RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 23.01.2025 | సంపుటి : 11 సంచిక : 195 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణకు మరో భారీ పెట్టుబడి

రూ.45,500 కోట్లతో రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ పవర్, సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు

ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో సన్ పెట్రోకెమికల్స్ సంస్థతో ఎంవోయూ

రూ.10 వేల కోట్లతో హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్న 'కంట్రోల్ ఎస్ ' సంస్థ

ప్రాజెక్ట్‌తో దాదాపు 3600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా

తెలంగాణ వృద్ధిలో ఈ డేటా సెంటర్ మరో మైలురాయి : మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌లో 3.20 లక్షల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ టెక్ సెంటర్ క్యాంపస్ ఏర్పాటు

విస్తరణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానం

హైదరాబాద్(జనంసాక్షి): దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో తెలంగాణ ప్రభుత్వం మరో భారీ పెట్టుబడిని సాధించింది. సన్ పెట్రోకెమికల్స్ సంస్థ రాష్ట్రంలో రూ. 45,500 కోట్ల పెట్టుబడుల ఒప్పందంపై సంతకం చేసిందిరాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్తు, సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఈ సంస్థ ఏర్పాటు చేయ నుందిఈ ఒప్పందంతో దాదాపు 7,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. నాగర్ కర్నూల్, మంచిర్యాల, ములుగు ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టులు నెలకొల్పనుంది. ఇప్పటివరకు దావోస్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే.అలాగే ఇదివరకే యూనిలీవర్, హెచ్‌సీఎల్ లాంటి దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. తాజాగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కంట్రోల్ ఎస్ ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా రూ.10 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు

మిగతా 2లో..

'ట్రిలియన్ ట్రీ ఉద్యమం'లో భాగస్వామ్యమవుతాం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2లో

దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు
తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు రేవంత్, చంద్రబాబు, ఫడ్నవీస్‌ల భేటీ 2లో

తెలంగాణ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు

ఆంధ్రప్రదేశ్‌కు ఇద్దరు కేటాయింపు

నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర

న్యూఢిల్లీ(జనంసాక్షి) : తెలంగాణ హైకోర్టుకు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. అందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులను బుధవారం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. అందులోభాగంగా తెలంగాణ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ రేణుక ఎర్రా, జస్టిస్ నర్సింగరావు నందికొండ, జస్టిస్ తిరుమల దేవి ఎడ, జస్టిస్ మధుసూధనరావు బొబ్బిలి రామయ్యలను నియమించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు.. జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావులను నియమిం చింది. రాష్ట్రాల హైకోర్టులకు పలువురు న్యాయమూర్తులను ఎంపిక చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమైంది. అందుకు పలువురు న్యాయమూర్తుల పేర్లను కేంద్రానికి సిఫార్స్ చేసింది. వీరి నియమాకానికి సంబంధించి.. ఈ రోజు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 28 మంది న్యాయమూర్తులే ఉన్నారు.

మిగతా 2లో..

గ్రామసభలపై అనవసరమైన రచ్చవద్దు

అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకూ ప్రభుత్వ పథకాలు

రేషన్ కార్డు జారీ నిరంతర ప్రక్రియ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పంట వేయకున్నా రైతు భరోసా, భూమిలేని కూలీకి రూ.12వేలు : మంత్రి ఉత్తమ్

కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి) : అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ పథకాలు అందుతాయని ఉమ్మడి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా తిమ్మాపూర్ మండలం రేణికుంటలో బుధవారం గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అడుగు ముందుకు వేసిందని అన్నారు. ఎంతమందికి అర్హత ఉంటే అంతమందికీ రేషన్ కార్డులు అందిస్తామని, పెళ్లయిన వారికి విడిగా కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల మార్పు చేర్పులు అన్ని పూర్తి చేస్తామని అన్నారు. గతంలో మీసేవ, ప్రజావాణి, సర్వేలలో సమర్పించిన దరఖాస్తులన్నీ పరిశీలిస్తామని, అర్హత ఉన్న వారందరికీ కార్డు ఇస్తామని అన్నారు. గ్రామ సభల్లో ప్రకటించిన జాబితాలో పేర్లు లేకున్నా అదే సభలో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. 2014లో 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే గత పది సంవత్సరాలలో కేవలం 40,000 మందికి మాత్రమే రేషన్ కార్డు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఈ

మిగతా 2లో..

రైతు ఆత్మహత్యలపై భారాస పోరుబాట

మా కమిటీ వెనుక ఎలాంటి రాజకీయం లేదు

24 నుంచి నెలరోజులపాటు రాష్ట్రమంతటా పర్యటన

రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకే రక్షణ లేదు : కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి) రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే అన్నారు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు. రేవంత్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతోనే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. రైతు ఆత్మహత్యలపై వేసిన తమ కమిటీ వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యం లేదన్న కేటీఆర్, కేవలం రైతాంగానికి అండగా నిలబడాలన్న ఆలోచన తప్ప ఇంకేం లేదన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో సమావేశమైన అధ్యయన కమిటీ తొలి సమావేశం తరువాత మీడియాతో మాట్లాడిన కేటీఆర్, ఆదిలాబాద్ బ్యాంకులో ఆత్మహత్య చేసుకున్న రైతు విషాద ఘటనే ఈ కమిటీ వేయడానికి కారణమని చెప్పారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ గారి ఆదేశం మేరకు ఏర్పాటైన ఈ కమిటీ ఈ నెల 24వ తారీఖు నుంచి పూర్వ ఆదిలాబాద్ జిల్లా నుంచి పని ప్రారంభిస్తుందన్నారు. రాబోయే నెల రోజులపాటు అన్ని జిల్లాలలో అన్ని వర్గాల రైతులను కలిసి రుణమాఫీ ఎంత మేరకు జరిగింది? అసలు రాష్ట్రంలో ఏం జరుగుతుంది? కరెంటు సరఫరా ఎలా ఉంది? సాగు పరిస్థితి ఎలా ఉంది? మద్దతు ధర

మిగతా 2లో..

ఆర్జీకర్ కేసులో అందరి వాదనలు వింటాం

బెంగాల్ సర్కార్ పిటిషన్‌పై సిల్దా కోర్టు వెల్లడి

కేసు సోమవారానికి వాయిదా

కోల్‌కతా(జనంసాక్షి) :ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన క్రమంలో.. అందరి వాదనలు విన్న తర్వాతే ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను పరిగణలోకి తీసుకుంటామని న్యాయస్థానం తెలిపింది. దోషి సంజయ్ రాయ్, సీబీఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాత ఆ పిటిషన్‌ను స్వీకరిస్తామని స్పష్టం చేసింది. ఈ కేసుపై సోమవారం విచారణ జరుపుతామని తెలిపింది.కాగా, ఈ కేసులో నిందితుడికి సియాల్దా కోర్టు విధించిన శిక్ష సరిపోదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయడాన్ని సీబీఐ వ్యతిరేకించింది. కేసును విచారించిన సంస్థగా శిక్ష విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు తమకు మాత్రమే ఉందని.. ఇందులో జోక్యం చేసుకొనే అధికారం ప్రభుత్వానికి లేదని పేర్కొంది. గతఏడాది

మిగతా 2లో..

'మహా'విషాదం

మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం

పట్టాలు దాటుతుండగా ట్రైన్ ఢీకొట్టడంతో 12 మంది దుర్మరణం

40 మందికి తీవ్రగాయాలు.. ఆస్పత్రికి తరలింపు

దుర్ఘటన కలిచివేసింది :మహారాష్ట్ర సీఎం ఫడణవీస్

జల్‌గావ్(జనంసాక్షి):మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణికుల మీద నుంచి మరో రైలు దూసుకెళ్లింది.ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 40మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని పలు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగు తున్నాయి.ఈ సాయంత్రం 5గంటల సమయంలో పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు వ్యాపించినట్టు వదంతులు వ్యాపించగా.. భయంతో ప్రయాణికులు ఆ రైలు చైన్‌లాగి పట్టాలపై దిగారు. ఈ క్రమంలో పట్టాలు దాటుతుండగా పచోరా రైల్వే స్టేషన్ సమీపంలో కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చి వారిని ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనపై తమకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఒక కోచ్‌లో హాట్ యాక్సిల్ లేదా బ్రేక్ బైండింగ్ కారణంగా నిప్పురవ్వలు చెలరేగాయని అధికారి ఒకరు చెప్పారు. దీంతో ప్రయాణికులు భయాందోళన కు గురై చైన్‌లాగారని తెలిపారు. కొందరు ట్రాక్‌లపై దూకేసిన సమయంలో కర్ణాటక ఎక్స్ ప్రెస్ రావడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు పేర్కొ న్నారు.

అందుకే పుష్పక్ ఎక్స్‌ప్రెస్ ఆగింది – సెంట్రల్ రైల్వే

ఈ ఘటనపై సెంట్రల్ రైల్వే అధికారులు స్పందించారు. "ప్రయాణికులు చైన్ లాగితే లఖ్‌నవూ– ముంబయి (పుష్పక్ ఎక్స్‌ప్రెస్) రైలు ఆగింది. ఈ ట్రైన్ ఆగాక ఒక బోగీ నుంచి కొందరు ప్రయాణికులు దిగి మరో ట్రాక్‌పైకి వెళ్తున్న క్రమంలో అటుగా వస్తున్న బెంగళూరు దిల్లీ (కర్ణాటక ఎక్స్‌ప్రెస్)

మిగతా 2లో..

కర్ణాటకలో ఘోర ప్రమాదం

లోయలోపడిన ట్రక్కు.. 10 మంది మృతి

2లో

సమర్ధులైన ఉద్యోగులే మాకు కావాలి

అమెరికా హెచ్1బీ వీసాలపై భిన్నాభిప్రాయాలు

చట్టబద్ధమైన వలసలకు మస్క్, వివేక్ రామస్వామి మద్దతు

జన్మతః పౌరసత్వం రద్దు వ్యవహారంపై తీవ్ర వ్యతిరేకత

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంపై ఉమ్మడిగా కోర్టుల్లో సవాల్ చేసిన 22 రాష్ట్రాలు

వ్యతిరేకిస్తున్న రిపబ్లికన్ పార్టీ నేత నిక్కీ హేలీ

వాషింగ్టన్(జనంసాక్షి):హెచ్1బీ వీసాల విస్తరణపై డొనాల్డ్ ట్రంప్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే.ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇస్తుంటే ఇతర నేతలు మాత్రం అమెరికా ఫస్ట్ విధానానికి కట్టుబడి ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా దీనిపై అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. తనకు రెండు వైపుల వాదనలూ నచ్చాయన్నారు. అయితే, సమర్థవంతమైన ప్రజలు అమెరికాలోకి రావాలని తాను కోరుకుంటున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు వైట్‌హౌస్‌లో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.'ఈ అంశంపై నాకు రెండు వైపుల వాదనలూ నచ్చాయి. సమర్థవంతులైన వ్యక్తులు మన దేశంలోకి రావడాన్ని నేనూ ఇష్టపడతాను. కేవలం ఇంజనీర్ల గురించి మాత్రమే నేను మాట్లడటం లేదు. అన్ని స్థాయిల వ్యక్తులను దృష్టిలో ఉంచుకొని ఈ మాట చెబుతున్నా. దేశ వ్యాపారాలను

మిగతా 2లో..

తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేకే..

మేడిగడ్డ వద్ద 'కాళేశ్వరం' నిర్మాణం

కమిషన్ ఎదుట జలవనరుల అభివృద్ధి మాజీ చైర్మన్ ప్రకాశ్ వివరణ

హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం కమిషన్ విచారణ కొనసాగుతోంది. దీనిలో భాగంగా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వి.ప్రకాశ్‌ను కమిషన్ ప్రశ్నించింది. కమిషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అఫిడవిట్ సమర్పించినట్లు వి.ప్రకాశ్ తెలిపారు. ఎవరి మద్దతూ అవసరం లేదని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ఆయనకు బదులిచ్చారు. రికార్డులు, డాక్యుమెంట్ల ఆధారంగా పని చేస్తామని

మిగతా 2లో..

ఆడ పిల్లల లింగ నిష్పత్తులను సమతుల్యం చేయడం కోసమే

బేటీ బచావో, బేటీ ఏడావో

కార్యక్రమానికి పదేళ్లు పూర్తైన సందర్భంగా ప్రధాని మోదీ హర్షం

న్యూఢిల్లీ(జనంసాక్షి) : ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమం నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 'నేటితో బేటీ బచావో, బేటీ పఢావో ఉద్యమానికి పదేళ్లు పూర్తవుతాయి. గత దశాబ్ద కాలంలో ఇది ఒక కీలక పరివర్తన, ప్రజల–ఆధారిత చొరవగా మారింది. అన్ని వర్గాల భాగస్వామ్యాన్ని పొందిందని' ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. లింగ అడ్డంకులు, పక్షపాతాలను అధిగమించడంపై ఈ ఉద్యమం దృష్టి సారించిందని, ఆడపిల్లలకు విద్య, అవకాశాలు ఉండేలా చూసేందుకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆడ పిల్లల లింగ నిష్పత్తులను సమతుల్యం చేయడం కోసం ప్రజలతోపాటు వివిధ కమ్యూనిటీ సంస్థలు చేపట్టిన ప్రయత్నాలకు, అంకిత భావానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పిల్లల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న జిల్లాలు గణనీయమైన మెరుగుదలను సాధించాయని, అవగాహన ప్రచారాలు లింగ సమానత్వం, ప్రాముఖ్యతను

మిగతా 2లో..

'అలకనంద' కిడ్నీ రాకెట్ వ్యవహారంపై
ప్రత్యేక కమిటీ
2లో

చౌకధరల దుకాణాల్లో త్వరలో
కొడిగుడ్లు పంపిణీ!
రేషన్‌కార్డుదారులకు మరో తీపికబురు
2లో

ప్రజ్ఞాన్ యూనివర్సిటీ
గుర్తింపు రద్దు
యూజీసీ షాకింగ్ నిర్ణయం
2లో

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23.01.2025

తెలంగాణకు మరో భారీ పెట్టుబడి

సంతకాలు చేశారు. తెలంగాణలో అత్యాధునిక డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు తెలంగాణ బృందంతో భేటీ అనంతరం సంతకం చేసింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వంతో ఈ ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఈ కంపెనీ రూ. 10,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఓవరాల్ గా 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ రూపొందనుంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని తెలంగాణ ప్రతినిధులు అంచనా వేశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కంట్రోల్ ఎస్ వారు నెలకొల్పనున్న ఈ డేటా సెంటర్ మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఐటీ సేవల సామర్థ్యం తెలంగాణలో పెరుగుఉందని, నగరంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణ ఐటీ సేవలలో మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోవటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం చేసుకోవడంపై గర్వంగా ఉందన్నారు. యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వంతో చర్చలు జరిపింది. వినియోగ వస్తువుల తయారీలో యూనిలీవర్‌కు మంచి పేరుంది. కామారెడ్డిలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుతో పాట్ను బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు యూనిలీవర్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆపై టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ సైతం హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకొచ్చింది. 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ సెంటర్ ఏర్పాటుతో 5000 మందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో కొత్తగా హెచ్‌సీఎల్ టెక్ సెంటర్

ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్ హైదరాబాద్ లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ

మంత్రి డి శ్రీధర్ బాబు, హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సివిజయకుమార్‌తో చర్చలు జరిపారు. హెచ్‌సీఎల్ కొత్త సెంటర్‌లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అత్యాధునిక క్లౌడ్, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లను అందిస్తుంది. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ అందుకుంది. దీంతో దాదాపు 5,000 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు, ఐటీలో ప్రతిభా వంతులైన నిపుణులతో ఇప్పటికే హెచ్‌సీఎల్ గ్లోబల్ నెట్‌వర్క్ సెంటర్ గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హెచ్‌సీఎల్ సేవల విస్తరణను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వాగతించారు. ప్రపంచంలో ఐటీ హబ్ గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుందని అభిప్రాయపడ్డారు. వచ్చే నెలలో కొత్త సెంటర్‌ను ప్రారంభించాలని ఆహ్వానించారు. స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు హైదరాబాద్‌లోని టెక్నాలజీ, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలని హెచ్‌సీఎల్ టెక్ ప్రతినిధులను కోరారు. ప్రభుత్వం తరపున తగిన సహకారం అందిస్తామని చెప్పారు. 2007 నుంచే హెచ్?సీఎల్ హైదరాబాద్ నుంచి ప్రపంచ వ్యాప్తంగా తమ క్లయింట్లకు సేవలను అందిస్తోంది. కొత్త కేంద్రంతో హైదరాబాద్ లో హెచ్‌సీఎల్ మొత్తం అయిదు సెంటర్లను విస్తరించనుంది.

'ట్రిలియన్ ట్రీ ఉద్యమం'లో భాగస్వామ్యమవుతాం

– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ఒక ట్రిలియన్ మొక్కలు నాటి భూమిని సతత హరితంగా మార్చే 'ట్రిలియన్ ట్రీ ఉద్యమంలో భాగమవుతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, భవిష్యత్ తరాల మనుగడను సురక్షితంగా మార్చే ప్రయత్నంలో పాలుపంచుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా వన్ ట్రిలియన్ ట్రీ ఆర్గనైజేషన్ నిర్వాహకులు తెలంగాణ పెవిలీయన్‌ను సందర్శించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ను కలిసి పర్యావరణ ప్రమాణాన్ని చేయించారు. తెలంగాణ రైజింగ్ విధానంలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రతి అంశంలోనూ నెట్ జీరో విధానాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు, నేచర్ పాజిటివ్ పిల్లర్ సహ వ్యవస్థాపకురాలు నికోల్ ష్వాబ్ , కార్యక్రమ నిర్వాహకులు ఫ్లోరియన్ వెర్నాజ్ తదితరులు పాల్గొన్నారు.

దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సిఎంలు

చంద్రబాబు, రేవంత్, ఫడ్నవీస్‌ల కలయిక

దావోస్(జనంసాక్షి):దావోస్‌లో జరిగిన కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పాల్గొన్నారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీ, ఏఐ, రక్షణ రంగంలో పెట్టుబడులకు సంబంధించిన అంశాలు సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ లో మూడో రోజు పర్యటిస్తున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో బుధవారం వివిధ రంగాల పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు.

అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసింది

అరెస్ట్‌పై మరోసారి స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):'పుష్ప2' విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్ (ంశ్రీశ్రీబీ ంతీతీబీని) అరెస్టయి ఆ తర్వాత బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. తొక్కిసలాట ఘటన, తదనంతర పరిణామాలు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగానే తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాజాగా దావోస్ పర్యటనలో ఉన్న ఆయన ఆంగ్ల మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు రేవంత్ రెడ్డి మరోసారి స్పందించారు.తొక్కిసలాట ఘటనకు అల్లు అర్జున్ నేరుగా బాధ్యుడు కాదు కదా అని ప్రశ్నించగా.. "రెండు రోజుల ముందు అనుమతి కోసం వస్తే.. పోలీసులు నిరాకరించారు. అయినా థియేటర్ వద్దకు అల్లు అర్జున్ వచ్చారు. ఈ క్రమంలో భారీగా అభిమానులు తరలిరావడంతో ఆయనతో వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది అక్కడున్న వారిని తోసేశారు. ఆ తొక్కిసలాటలో ఒకరు చనిపోయారు. ఒక మనిషి చనిపోవడమన్నది ఆయన చేతుల్లో లేకపోవచ్చు. ఒక మహిళ చనిపోతే, 10-12 రోజులు బాధిత కుటుంబాన్ని పట్టించుకోలేదు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోయింది" అని అన్నారు.

రైతు ఆత్మహత్యలపై భారాస పోరుబాట

దొరకుతుందా? బోనస్ ఏమైంది? కొనుగోలు కేంద్రాలు ఏమయ్యాయి? రైతు వేదికలు పనిచేస్తున్నాయా? వంటి అంశాలను అధ్యయనం చేస్తుందన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడంతో పాటు ఆత్మహత్యలకు కారణాలను అధ్యయనం చేసి నివేదికను రూపొందిస్తుందన్నారు. ఆ నివేదికను బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తుందన్నారు. రైతు డిక్లరేషన్ పేరిట రాహుల్ గాంధీ నాయకత్వంలో వరంగల్ వేదికగా రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలను ఇచ్చిందన్నారు కేటీఆర్. 2 లక్షల రుణమాఫీ, 15 వేల రైతు భరోసా, మద్దతు ధర, బోనస్ ఇవ్వడంతో పాటు విస్తారంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ హామీలను నమ్మి రైతులు ఆ పార్టీకి అధికారాన్ని అప్పగించారన్నారు. అయితే ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ దారుణంగా విఫలమైందన్నారు. రైతుల పట్ల కెసిఆర్ గారికున్న ప్రేమ, ఆర్తి ప్రస్తుత పాలకుల్లో మచ్చుకైనా కనిపించడం లేదన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్న పెద్దల మాటను వందకు వంద శాతం నమ్మి అందుకు తగ్గట్టుగానే 65 శాతం మంది ప్రజలు ప్రత్యక్షంగా ఆధారపడిన వ్యవసాయరంగ సంక్షేమానికి కేసీఆర్ గారు ఎన్నో కార్యక్రమాలను అమలుచేశారని చెప్పారు. రైతు బంధు, రుణమాఫీ పేరుతో లక్ష కోట్ల రూపాయలను నేరుగా 70 లక్షల రైతుల ఖాతాల్లో వేసిన ఏకైక ముఖ్యమంత్రి భారత దేశ చరిత్రలో కేసీఆర్ ఒక్కరే అన్నారు.

పథకాలకు అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ : మంత్రి ఉత్తమ్

జగిత్యాల(జనంసాక్షి):రాష్ట్రంలోనే చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.బుధవారం రాష్ట్ర నీటి పారుదల , పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎంఎల్ సి జీవన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్ లతో కలిసి ధర్మపురి మండలలోని జైన గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు, రైతులకు, రైతు కూలీలకు, నిరుద్యోగులకు , పేదలకు ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం స్వతంత్ర భారతదేశంలో మేలు చేయలేదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, గత 10 సంవత్సరాల కాలంలో ఎప్పుడు ఈ స్థాయిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, కేవలం 40 వేల కార్డులు మాత్రం అందించారని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని, గ్రామ సభలలో ప్రతిపక్ష పార్టీ నాయకులు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని కోరారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి రేషన్ కార్డు రైతు భరోసా ఇందిరమ్మ ఇల్లు రైతు భరోసా సంవత్సరానికి 12000 రూపాయలు జనవరి 26 వ తారీకు నుండి ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభిస్తుందని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి ఎస్పీ, అశోక్ కుమార్, ఏఎస్పీ భీమ్ కుమార్ , ఆర్డీవో మధు సుధను,డీఆర్డీఓ రఘు వరుణ్, డిపిఓ , మధన్ మోహన్, ఎమ్మార్వో, కృష్ణ చైతన్య , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'అలకనంద' కిడ్నీ రాకెట్ వ్యవహారంపై ప్రత్యేక కమిటీ

హైదరాబాద్(జనంసాక్షి) : అలకనంద ఆసుపత్రి కిడ్నీ రాకెట్ వ్యవహారంలో నిజానిజాలు తేల్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసింది. ఉస్మానియా మాజీ సూపరింటెండెంట్ నాగేందర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసింది.దీంతో అలకనంద ఆసుపత్రిని నాగేందర్, వైద్యులు పరిశీలించారు. కిడ్నీ శస్త్రచికిత్సలపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. మల్లికార్జున్, కిరణ్మయి, సాధనరాయ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. వీరంతా కిడ్నీ రాకెట్‌లో నిజానిజాలు తేల్చనున్నారు. గాంధీ ఆసుపత్రిలో ఉన్న బాధితులను ఈ బృందం కలవనుంది.హైదరాబాద్‌లో కిడ్నీ అక్రమ మార్పిడి ఆపరేషన్ల దందా కలకలం రేపింది. సరూర్‌నగర్‌లోని అలకనంద ఆసుపత్రిలో అనుమతి లేకుండా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయనే సమాచారంతో మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు, పోలీసులు దాడులు చేశారు. తనిఖీల్లో భాగంగా కిడ్నీ మార్పిడి కోసం ఇద్దరు దాతలు, ఇద్దరు గ్రహీతలు ఉన్నట్లు అనుమానించిన అధికారులు నలుగుర్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ప్రజ్ఞాన్ యూనివర్సిటీ గుర్తింపు రద్దు

యూజీసీ షాకింగ్ నిర్ణయం

జార్ఖండ్(జనంసాక్షి) :యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. జార్ఖండ్‌లోని ప్రజ్ఞాన్ యూనివర్సిటీని యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటన జారీ చేసింది. యూజీసీ యాక్ట్ 1956 సెక్షన్ 2(0) ప్రకారం ఈ మేరకు ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ పేరును తొలగించినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జార?ండ్ ప్రభుత్వం యూనివర్శిటీ స్థాపన చట్టాన్ని రద్దు చేయడంతోపాటు పలు నిబంధనలను పాటించని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జార్ఖండ్‌కు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ గతేడాది మార్చిలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. జార?ండ్ ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ చట్టం 2016 ప్రకారం ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ స్థాపించబడింది. 2016 ఆగస్టు 3న యూజీసీ జాబితాలో చేరింది. అయితే ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ యాక్ట్ 2016'ని 2024లో ఆ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ రిజల్యూషన్ ప్రకారం, ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ 2016 సంవత్సరంలో స్థాపించిన తర్వాత కూడా ఉనికిలోకి రాలేదు. అక్కడ బోధన జరుగుతున్నట్లు ఎలాంటి ఆధారాలు యూజీసీకి సమర్పించలేదు. పైగా యూజీసీ పంపిన టెలిఫోన్ కాల్‌లు, ఇమెయిల్‌లకు యూనివర్సిటీ స్పందించలేదు..

చౌకధరల దుకాణాల్లో త్వరలో కొడిగుడ్లు పంపిణీ!

హైదరాబాద్(జనంసాక్షి) :తెలంగాణలోని రేషన్ కార్డు దారులకు మరో కొత్త శుభవార్త వినిపించనుంది. కోడిగుడ్డులోని పోషక విలువలను దృష్టిలో ఉంచుకొని రేషన్ షాపుల్లో గుడ్లు కూడా పంపిణీ చేయాలని నేషనల్ ఎగ్ చికెన్ ప్రమోషన్ కౌన్సిల్ (ఎన్ఈసీపీసీ) తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. సాధారణంగా రేషన్ షాపుల్లో పప్పులు, బియ్యం, నూనెలు వంటి నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తుంటారు. అయితే గుడ్డులోని పోషకాల దృష్ట్యా రేషన్ ద్వారా వీటిని కూడా సప్లై చేయాలని ఎన్ఈసీపీసీ చెబుతోంది. ఈ క్రమంలో గుడ్డు ప్రాధాన్యతను, అందులోని పోషక విలువలను వివరిస్తూ కౌన్సిల్ రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను మంగళవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ బాలస్వామి, పౌల్ట్రీ ఇండియా వ్యవస్థాపకుడు పొట్లూరి చక్రధర్‌రావు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి 6 గుడ్లు, అంగన్‌వాడీల్లో గర్భిణులకు రోజుకు 2 గుడ్లు, పనికి ఆహార పథకంలో పనిచేస్తున్న వారికి నెలకు 30 గుడ్లు ఇస్తున్నట్లు గుర్తు చేశారు.

తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేకే మేడిగడ్డ వద్ద 'కాళేశ్వరం' నిర్మాణం

చెప్పారు. తమ ముందు ఎవరూ రాజకీయ ఉపన్యాసాలు చేయవద్దన్నారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు ప్రకాశ్ తెలిపారు. స్థిరీకరణకూ ఎక్కువ నీరు అవసరం కాబట్టి చేపట్టారన్నారు. మేడిగడ్డ వద్ద ఆనకట్ట వద్దని ఇంజినీర్ల కమిటీ చెప్పింది కదా అని కమిషన్ ప్రశ్నించింది. విశ్రాంత ఇంజినీర్ల కమిటీ అలా చెప్పలేదని ప్రకాశ్ పేర్కొన్నారు. బొగ్గు గనుల వద్ద సొరంగాలు వద్దన్న సిఫారసును ప్రభుత్వం గౌరవించిందని చెప్పారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకునే కాళేశ్వరం నిర్మించారన్నారు.

ఆడ పిల్లల లింగ నిష్పత్తులను సమతుల్యం చేయడం కోసమే నేటితో బేటీ బచావో, బేటీ పడావో

తెలియజేయడంలో హితోదికంగా తోడ్పడ్డాయన్నారు. దేశంలోని మహిళల హక్కులను కాపాడేందుకు, వారి విద్యకు భరోసా కల్పించేందుకు ఈ ఉద్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'ఈ ఉద్యమాన్ని కింది స్థాయి నుంచి ఉధృతం చేసిన భాగస్వాములందరినీ అభినందిస్తున్నానన్నారు. మన కుమార్తెల హక్కులను పరిరక్షించడాన్ని కొనసాగిద్దాం, వారి విద్యను నిర్ధారిద్దాం. కలిసికట్టుగా వారి కోసం ఎటువంటి వివక్ష లేకుండా అభివృద్ధి చెందగల సమాజాన్ని సృష్టిద్దాం. రాబోయే రోజుల్లో మన దేశ కుమార్తెలకు గొప్ప పురోగతిని, అవకాశాలను వస్తాయ్' అని మోదీ అన్నారు.

గ్రామసభలపై అనవరమైన రచ్చవద్దు

ప్రభుత్వం 40 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇస్తుందని అన్నారు. అందరికీ రేషన్ కార్డు అందిన తర్వాత ప్రతి వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. అర్హత ఉన్న వాళ్లందరికీ ఇల్లు కట్టించే ప్రక్రియ చేపట్టామని, ఇండ్ల మంజూరు జాబితాలో పేరు లేకుంటే దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. స్వంతస్థలం ఉన్నవారు ఇల్లు కట్టుకునేందుకు ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నామని, ఎస్సీ ఎస్టీలకు మరో లక్ష ఆదనంగా ఇస్తామని తెలిపారు. సాగు చేసేందుకు యోగ్యంగా ఉన్న ప్రతి ఎకరానికి సంవత్సరానికి 12000 రైతు భరోసా ఇవ్వబోతున్నామని తెలిపారు. పంట వేసినా వేయకున్నా వ్యవసాయానికి ముఖ్యంగా ఉంటే రైతు భరోసా అందుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి 12,000 అందజేస్తున్నామని అన్నారు. ఈ స్థాయిలో ఇన్ని ప్రభుత్వ పథకాలు ఒకేసారి అమలు చేయడం చరిత్రలో ఎక్కడా లేదని తెలిపారు.మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని అన్నారు. గతంలో ప్రజా పాలన సమయంలో దరఖాస్తు ఫారం సరిగ్గా నింపకపోవడం వల్ల ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామసభ పూర్తయిన తర్వాత కూడా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వవచ్చని అన్ని దరఖాస్తులు పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రపుల్ దేశాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్

కరీంనగర్‌బ్యూరో/గంగాధర(జనంసాక్షి):ప్రభుత్వపథకాల అమలుకు గ్రామసభల నిర్వహణలో భాగంగా గంగాధర మండలం నారాయణపూర్ లో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నారాయణపూర్ రిజర్వాయర్ ను సందర్శించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడుతూ... గత ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి తక్కువ ఆయకట్టుకు నీరిచ్చిందని అన్నారు. ఈ ప్రభుత్వం తక్కువ ఖర్చులో ఎక్కువ ఆయకట్టుకు నీరు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రాజెక్టుల జాబితాలో నారాయణపూర్ రిజర్వాయర్ ను చేరుస్తామని తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి అవసరమైన సుమారు 70 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రకటించారు. ఏడాదిలోగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీళ్లు అందిస్తుందని అన్నారు. ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు. నారాయణపూర్ లో నాలుగు ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం వర్తించేలా చూస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగును నింపేందుకు తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... 10 సంవత్సరాలుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వారందరికీ కార్డు అందుతుందని తెలిపారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఈనెల 26న మరో నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రపుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ పాల్గొన్నారు.

'మహా'విషాదం

రైలు ప్రమాద ఘటనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని, ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతులకు తన ప్రగాఢ సంతాపం తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "నా మంత్రివర్గ సహచరుడు గిరీశ్ మహాజన్, జిల్లా ఎస్పీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ సైతం అక్కడికి త్వరలో చేరుకుంటారు. జిల్లా అధికార యంత్రాంగం మొత్తం రైల్వే అధికారులతో సమన్వయం చేస్తూ పనిచేస్తోంది. క్షతగాత్రులకు తక్షణమే చికిత్స అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎనిమిది అంబులెన్సులను అధికారులు పంపారు. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు జనరల్ ఆస్పత్రులతో పాటు సమీపంలోని ఇతర ప్రైవేటు ఆస్పత్రులను సిద్ధంగా ఉంచారు. గ్లాస్ కట్టర్లు, ఫ్లడ్ లైట్లు వంటి అత్యవసర పరికరాలను సైతం సిద్ధం చేశారు. మేమంతా అక్కడి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. అవసరమైన సహాయాన్ని తక్షణమే అందిస్తున్నాం" అని పేర్కొన్నారు.

కర్ణాటకలో ఘోర ప్రమాదం

బెంగుళూరు(జనంసాక్షి) :కర్ణాటక రాష్ట్రంలోని ఉత్తర కన్నడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కూరగాయలు, పండ్ల లోడుతో వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొట్టడంతో బోల్తాపడింది.ఈ ఘ

ఇద్దరు ఆటోడ్రైవర్ల మధ్య ఘర్షణ

- ఒకరిపై కత్తితో దాడి.. అక్కడికక్కడే మృతి

హనుమకొండ, జనవరి22 (జనంసాక్షి) : ఇద్దరు ఆటోడ్రైవర్ల మధ్య జరిగిన గొడవ చివరకు ఒక ఆటో డ్రైవర్ ప్రాణం తీసింది. పట్టపగలే జరిగిన ఈ సంఘటన హనుమకొండలో చోటుచేసుకుంది. ఇద్దరు ఆటోడ్రైవర్ల మధ్య తలెత్తిన వివాదం కత్తి దాడికి దారితీసింది. ఈ క్రమంలో కత్తిపోట్లకు గురై తీవ్ర రక్తస్రావంతో ఓ ఆటో డ్రైవర్ నడిరోడ్డుపైనే దారుణహత్యకు గురయ్యాడు. హనుమకొండ పోలిస్ డివిజన్ సుబేదారి పీఎస్ పరిధిలో ఉన్న డీమార్ట్ ఎదురుగా ఘటన జరిగింది. ఆటో స్టాండ్ పక్కన ఇద్దరు ఆటో డ్రైవర్లు గొడవ పడుతున్న వీడియోలు వైరల్ అయ్యాయి. మడికొండకు చెందిన రాజ్ కుమార్‌పై మరో ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేస్తుండగా.. విడిపించేందుకు ఓ వ్యక్తి తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పట్టపగలే నడిరోడ్డుపై హత్యకు గురైన వ్యక్తిని ఆటోడ్రైవర్ రాజ్‌కుమార్‌గా పోలీసులు గుర్తించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న సుబేదారి పీఎస్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

గ్రామసభల్లో ఆందోళనలు బిఆర్ఎస్ కుట్రలు

- ప్రజలంతా ఆనందంగా దరఖాస్తు చేస్తున్నారు
- పదేళ్ల తరవాత రేషన్ కార్డులపై ప్రజల్లో ఆనందం
- మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్, జనవరి22 (జనంసాక్షి) : గ్రామసభల్లో ఆందోళనలు కేవలం బిఆర్ఎస్ కుట్రలతో జరిగినవేనని మంత్రి సీతక్క అన్నారు. అంతటా ప్రశాంతంగా సాగుతున్నాయని, ప్రజలు దరఖాస్తులు అందచేస్తున్నారని అన్నారు. కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభ మయ్యాయి. అయితే గ్రామసభల్లో లబ్దిదారులు ఆందోళనకు దిగారంటూ వస్తున్న వార్తలపై మంత్రి సీతక్క స్పందించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. మంగళవారం మొత్తం 3410 గ్రామాల్లో గ్రామసభలు జరిగాయని.. కేవలం 142 గ్రామాల్లోని ఆందోళనలు జరిగాయని స్వయంగా బీఆర్ఎస్ పత్రికలోనే చెప్పారన్నారు. అంటే కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే కొంత గొడవ జరిగింది.. అది కూడా టీఆర్ఎస్ వాళ్ళు ఉద్దేశపూర్వకంగా చేశారని ఆరోపించారు. అంటే 96 శాతం గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో గ్రామసభలు జరిగినట్టు స్పష్టమవుతుందన్నారు. పదేళ్ల తర్వాత గ్రామ సభలు కాబట్టి ప్రజలు సంతోషంగా ఉన్నారని.. గ్రామ సభల్లోనే అర్హులని గుర్తిస్తున్నామని తెలిపారు. గతంలో ఎమ్మెల్యేలు చెప్పిన వాళ్ళకే పథకాలు వచ్చేవని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో, ఎమ్మెల్యేలు ఇండ్లలో కూర్చొని లబ్దిదారులను ఎంపిక చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామ సభల్లోనే ప్రజల సమక్షంలో లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా లబ్దిదారులను గుర్తిస్తుంటే కావాలని బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్లప్పుడే పథకాలు అరకొరగా ఇచ్చేవారన్నారు. కానీ ప్రజా అవసరాలు, ఆర్థిక వనరులను బట్టి పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. అందుకే ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ గొడవలు చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి కొందరు ఆర్థిక సామాజిక రాజకీయ కుల సమగ్ర ఇంటిటి సర్వేలో పాల్గొనలేదని.. ఇప్పుడు వాళ్ళకి పథకాలు రావనే ఆందోళన ఉందన్నారు. ఏ ఒక్క అర్హుడు నష్టపోకుండా ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నామని స్పష్టం చేశారు.

గ్రామసభల్లో గందరగోళం

- అధికారుల నిలదీత

పాలకుర్తి, జనవరి 22(జనంసాక్షి) మండలంలోని విస్నూరు, మల్లంపల్లి, బమ్మెర, దర్దేపల్లి, సిరిసన్నగూడెం, నర్సింగపురం తండా, ఈరవెన్ను, మంచుప్పుల, తిర్మలగిరి గ్రామాల్లో బుధ వారం జరిగిన గ్రామ సభల్లో అధికారులు పలు పథకాలకు సంబందించిన లబ్దిదారుల ఎంపిక వివరాలు తెలిపిన తర్వాత సభలకు హాజరైన వారిలో కొందరి నుంచి వ్యతిరేకత వ్యక్తం అయింది. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, మంజూరి చేయకుండా ఆనర్హులకు మంజూరి చేసి అవకతవకలు జరిగాయని కొందరు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇందిమ్మ ఇళ్ల మంజూరి అర్హుల జాబితాతో పాటు రేషన్ కార్డులు పొందడానికి అర్హులైన జాబితాను ప్రకటించారు. ఇందులో తప్పులు ఉన్నాయని ఉన్నోల్లకే మళ్లీ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరి ఆయ్యా యని, ఇందిరమ్మ అత్మీయ భరోసా కూడా వ్యవసాయ భూములు ఉన్నోళ్లకే మంజూరి అయ్యాయని గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు ఆందో ళనకు దిగారు, బమ్మెరకు పాలకుర్తి సీఐ మహేందర్రెడ్డి చేరుకొని అక్కడికి చేరుకొని శాంతి భద్రతలను పర్యవేక్షిం చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్రినివాస్, ఎంపీడీవో రాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

వరంగల్ ఈస్ట్, జనవరి 22 (జనం సాక్షి) : వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఉర్సు దర్గా ప్రాంతంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం సాయంత్రం అన్నపూర్ణ క్యాంటీన్(5 రూపాయలకే భోజనం) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారా ణి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకిడే, మేయర్ గుండు సుధారాణి, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, సిఎంహెచ్వో రాజిరెడ్డి, ఎంహెచ్ఓ రాజేష్ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఉరుసు దర్గా వద్ద పేద మధ్యతరగతి ప్రజలతోపాటు ఆటో కార్మికులు ఎక్కువగా ఉంటున్నారని వారికి ఐదు రూపాయలకే భోజనం అన్నపూర్ణ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి కొండ సురేఖ దృష్టికి స్థానిక కాంగ్రెస్ నాయకుడు గడ్డం యుగంధర్ తో పాటు పలువురు కోరడంతో స్పందించిన మంత్రి సురేఖ ఉరుసు దర్గా వద్ద అన్నపూర్ణ క్యాంటీన్ మంజూరు చేయడం జరిగింది. ఇక్కడ మంత్రి అన్నపూర్ణ క్యాంటీన్ ప్రారంభించడంతో అందరూ హర్షం వ్యక్తం చేశారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం

సారంగాపూర్, జనవరి 22 (జనం సాక్షి) : అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం అయిన ఘటన సారంగాపూర్ మండలం రవీంద్ర నగర్ (బి) చర్చి తండాలో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక రైతు జాదవ్ రూప్ సింగ్ తన ఐదు ఎకరాల చేనులో మొక్కజొన్న పంట వేయాగా, చేతికి వచ్చే సమయానికి అడవి పందులు దాడి చేసి పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. దీంతో రైతు ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నారు.

సినీ పరిశ్రమలో ఐటీ సోదాల కలకలం

- తన ఒక్కడి ఇంటిపైనే జరగడంలేదన్న దిల్‌రాజు

హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) : నగరంలోని పలువురు సినీ ప్రముఖుల ఇళ్లపై జరుగుతున్న ఆదాయ పన్నుశాఖ దాడులపై నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు స్పందించారు. ఐటీ సోదాలు తన ఒక్కడిపైనే జరగడం లేదని అన్నారు. ఇండస్ట్రీ మొత్తం మీద ఐటీ సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాకు అభివాదం చేస్తూ పై వ్యాఖ్యలు చేశారు. రెండో రోజు కూడా సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ శాఖ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. దిల్ రాజు నివాసాలు, కార్యాలయంలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్, మ్యాంగో మీడియా కార్యాలయాల్లోనూ సోదాలు జరుగు తున్నాయి. నిర్మాణ సంస్థల ఆదాయం, పన్ను చెల్లింపు మధ్య తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పలు సంస్థలకు చెందిన వ్యాపార లావాదేవీల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు లాకర్లను కూడా ఐటీ అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన పలు పత్రాలను ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రాథమిక ఆధారాలతో కేసు నమోదు చేశాకే సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 55 బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. సంక్రాంతికి భారీ బ్జడెట్‌తో సినిమాలు తెరకెక్కించిన నేపథ్యంలో దిల్ రాజు నివాసంలో సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం.. సినిమాల నిర్మాణానికి భారీగా వెచ్చించినట్లు చెబుతున్నారు. ఈ రెండు చిత్రాల కలెక్షన్ల నేపథ్యంలో తనిఖీలకు ప్రాధాన్యం సంతరించుకొంది.

ప్రజలతో కలెక్టర్ ఆప్యాయ పలకరింపు

- లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ రాహుల్ శర్మ

కాటారం, జనవరి 22 (జనంసాక్షి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సంక్షేమ పథకాల అమలు కోసం ఏర్పాటుచేసిన గ్రామసభలో భూపాలపల్లి కలెక్టర్ లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించారు. బుధవారం కొత్తపల్లి లో జరిగిన గ్రామసభలో కలెక్టర్ రాహుల్ శర్మ గ్రామ సభకు వచ్చిన మహిళలను 'ఏమ్మా మీ పేరేంటి'? 'ఏ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు' అని అజ్మీర సమ్మక్కను అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క కలెక్టర్ కు రేషన్ కార్డు కోసం రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్నాను అని సమాధానం ఇవ్వడంతో ఒకే, నాకు ఇవ్వండని దరఖాస్తు తీసుకుని తహసీల్దార్ నాగరాజును సమ్మక్క దరఖాస్తు ఇచ్చారు. రిజిస్టర్ లో నమోదు చేయండని ఆదేశించారు. రెండవ రోజు జరుగుతున్న ప్రజాపాలన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కాటారం మండలం కొత్తపల్లి, ధన్వాడలో పాల్గొన్నారు. కొత్తపల్లి లో రేషన్ కార్డు కొరకు దరఖాస్తు ఇవ్వడానికి వచ్చిన సమ్మక్కతో కలెక్టర్ ముకాముఖీ మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామసభకు విచ్చేసిన ప్రజలకు జాబితా లో పేరు లేకుంటే దరఖాస్తు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పథకాలు అమలు ప్రక్రియ నిరంతరం ఉంటుందని, పేర్లు లేని ప్రజలు దరఖాస్తు లు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తులు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరి నుండి నాలుగు పథకాలకు దరఖాస్తులు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభలకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంత మంది లబ్ధిదారులు తమ పేర్లు అధికారులు చదివి వినిపించిన జాబితాలో రాలేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన జిల్లా కలెక్టర్ గ్రామసభలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 24 వరకు గ్రామసభలు కొనసాగనున్నాయని, పలుచోట్ల గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో సొంత ఇల్లు ఉన్న వారిని, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిని చేర్చారంటూ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని అలాంటి వారి పేర్లను గుర్తించి వెంటనే అధికారులు తొలగిస్తారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డిఆర్డిఓ నరేష్, తహసిల్దార్ నాగరాజు, ఎంపిడిఓ బాబు, డి.ఎస్.పి రామ్మోహన్ రెడ్డి, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి, జనవరి 22 (జనం సాక్షి): గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై బుధవారం అన్ని శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసా పత్రాలు అందించడానికి 23వ తేదీ వరకు జాభితా ఇవ్వాలని సూచించారు. వేడుకలకు సంబంధించి ప్రోటోకాల్ పాటిస్తూ అతిథులు కూర్చోడానికి అనువుగా షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలని, స్టేజ్ ఏర్పాట్లు, త్రాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను సంబంధిత శాఖ అధికారులు అంబేద్కర్ స్టేడియం లో పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లా ప్రగతి సందేశమును తయారు చేయాలని, స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధకారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో దేశభక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల చే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డిపిఆర్వో ను, డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. వేడుకల సందర్భంగా అంబులెన్సులు, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని అన్నారు. మైదానంలో పారిశుద్ధ్య.కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిపిఆర్వో శ్రీనివాస్, డీఈఓ రాజేందర్ మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఖాజా మొయినుద్దీన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వరకట్న హత్య కేసులో 7 ఏండ్ల జైలుశిక్ష

- రూ.3 వేల జరిమానా

రాజేంద్రనగర్, జనవరి 22 (జనం సాక్షి) : వరకట్నం కోసం వివాహిత మహిళను వేధించి ఆమె హత్యకు కారణమైన నిందితుడికి 7 ఏళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించింది గౌరవ న్యాయస్థానం. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తేదీ 09.06.2018 నాడు అప్పటి రాజేంద్రనగర్ పి. యస్ (ప్రస్తుత అత్తాపూర్ పి.యస్) పరిధిలోని ఖయ్యుమ్ నగర్, చింతల్ మెట్ ఏరియాలో ఒక వివాహిత మహిళను వరకట్నం కోసం వేధించి ఆమె మరణానికి కారణమైన కేసులో గౌర వి 11వ అడిషనల్ జడ్జి కోర్టు న్యాయస్థానం ఎల్బీనగర్ నందు పూర్తి అయ్యి అట్టి కేసులో న్యాయమూర్తి వై. జయప్రసాద్ తీర్పు వెలువరిస్తూ నిందితుడు ఖయ్యూం నగర్ అత్తాపూర్ కు చెందిన ఎ1గా మహమ్మద్ అసద్ అలీ 7 సంవత్సరాల కఠిన కారాగారా శిక్ష రూ .3 వేల జరిమానా విధించినారు. ఈ నేర విచారణలో భాగమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. రవి కుమార్, పరిశోధన అధికారి పీ. అశోక్, ఏసిపికోర్ట్ డ్యూటి అధికారులు అభినందించారు.

పత్రికలు ప్రజల పక్షాన నిలబడాలి

- పత్రికా స్వాతంత్ర్యాన్ని రాజ్యాంగ పుటలలో బంధించవద్దు
- సమాజానికి జర్నలిస్టు ఒక డాక్టర్ లాంటి వాడు
- తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి

నస్పూర్, జనవరి 22, (జనంసాక్షి): పత్రికలు ప్రజల పక్షాన ఉండి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా పనిచేయాలని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో గల నార్త్ ఇన్ హోటల్ లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రజాస్వామ్యం–మీడియా బాధ్యతపై నిర్వహించిన సెమినార్ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నగునూరి శేఖర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపిరెడ్డి ప్రకాశ్ రెడ్డి,మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దేగ సత్యం,కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గాండ్ల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి, కోశాధికారి కేశెట్టి వంశీకృష్ణ,యూనియన్ ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ పత్రికలు సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, రాజకీయ,సామాజిక,ఆర్థిక రంగాలలో ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు.సమాజానికి జర్నలిస్టు డాక్టర్ లాంటి వాడని,దెబ్బతిన్న సమాజాన్ని ఆరోగ్యంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని అన్నారు.ప్రభుత్వం, అధికార యంత్రాంగం,ప్రజా ప్రతినిధులు చేసే ప్రజా వ్యతిరేక ధోరణి ని ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా ప్రజలకు వివరించి సమాజాన్ని తీర్చి దిద్దుదామని అన్నారు.దేశంలో ప్రెస్ అకాడమీ ఏర్పాటు అయినప్పుడు సంస్థలో ఉన్న సభ్యులు తర్వాత ప్రధానమంత్రి,రాష్ట్రపతి, అత్యున్నత న్యాయస్థానానికి న్యాయ నిర్నేతలుగా వ్యవహరించి సమాజానికి తమదైన శైలిలో సేవలు అందించారని తెలిపారు.ప్రతి జర్నలిస్టు పత్రిక విలువలను కాపాడడంలో తమ వంతు నైతిక బాధ్యత వహించాలని,సమాజంలో జరిగే చెడును తెలియజేయడం, నిలిపివేయడం, అవాస్తవాలను ప్రదర్శించడం అంశాలపై వ్యక్తిగత పరిశీలన చేసుకొని సమాజానికి మేలు చేయాలన్నారు. వార్తలలో అవాస్తవాలతో గౌరవం సన్నగిల్లుతుందని,స్తబ్దత లేని ప్రవర్తనతో వ్యవహరించవద్దని అన్నారు. ప్రభుత్వం, న్యాయం, అధికారాలలో నెలకొన్న అవినీతిని ఎత్తి చూపేది మీడియా మాత్రమేనని, మీడియాపై జరుగుతున్న దాడుల గురించి ప్రతి జర్నలిస్టు కచ్చితంగా ఆలోచించి సరైన నిర్ణయంతో ముందుకు సాగాలని తెలిపారు.రాజ్యాంగం లో పేర్కొన్న ఆర్టికల్ 19–1ఎ ప్రకారం అందించిన పత్రిక స్వేచ్ఛను సమర్థవంతంగా వినియోగించుకొని సమాజ శ్రేయస్సు దృష్ట్యా వర్కింగ్ జర్నలిస్టులుగా తమదైన ముద్ర వేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి జె శారద,వివిధ పత్రికల స్టాపర్లు సురేష్ చౌదరి,రమేష్ రెడ్డి,ఆకుల రాజు, రవిరాజు, రాజలింగు, యూనియన్ ప్రతినిధులు,జిల్లా పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి స్వాగతం పలికిన ఉప్పరి అజయ్

కరీంనగర్ జనవరి 22 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి, కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి నల్లమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డికి, 53వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పరి అజయ్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్లోని హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో కలిసి ఉప్పరి అజయ్, జిల్లా ఇన్చార్జ్ మంత్రికి ఘనంగా సన్మానించారు. అనంతరం రేణికుంట గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించే ఉద్దేశం గా అంకురార్పణ చేసింది అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి, అత్యధికంగా గెలిపించాలని కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 జనవరి 2025

ఆదిలాబాద్‌కు న్యాయం చేస్తారా!?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాదికిపైగా గడిచిపోయింది. ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాల అమలును కొనసాగిస్తున్న ప్రభుత్వం.. ఇప్పుడు స్థానిక, మున్సిపల్ ఎన్నికల కోసం కూడా కసరత్తు జరుగుతున్నది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల కంటే ముందే మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే చర్చ జరుగుతున్నది. ఇటీవల ఢిల్లీ వెళ్లిన రాష్ట్ర కాంగ్రెస్ కీలక నాయకులు.. అక్కడ కేసీ వేణుగోపాల్ తో చర్చలు జరిపారు. ఇందులో కేబినెట్ విస్తరణపై స్పష్టత వచ్చినట్లు ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం ఆరు మంత్రి పదవులు ఖాళీ ఉండగా.. ఇప్పుడైనా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు న్యాయం జరుగుతుందా అనే అనుమానం వ్యక్తమవుతున్నది.

నలుగురు ఎమ్మెల్యేలున్నా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో నాలుగు కాంగ్రెస్, నాలుగు బీజేపీ, రెండు బీఆర్ఎస్ పార్టీలు గెలుపొందాయి. కాంగ్రెస్ తరపున బెల్లంపల్లి నుంచి గెలిచిన వినోద్ కు ఉమ్మడి రాష్ట్రంలో, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా పని చేసిన అనుభవముంది. మంచిర్యాల నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, చెన్నూర్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ లు తొలిసారి ఎమ్మెల్యేలే అయినా.. గతంలో ఎమ్మెల్సీ, ఎంపీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఖానాపూర్ నుంచి వెడ్మ బొజ్జు మొదటి సారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మొదటగా తన మంత్రివర్గంలో పది మందికి అవకాశమిచ్చారు. అయితే ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఒక్కరిని కూడా ఎంపిక చేయలేదు. అదే సమయంలో ఉమ్మడి ఖమ్మం నుంచి మల్లు ముగ్గురు మంత్రులుగా ఉండడం గమనార్హం. మంత్రి వర్గ విస్తరణ జరిగితే.. ఎన్ని పదవులు భర్తీ చేసినా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఒక్కరినైనా మంత్రి పదవి కేటాయించాలనే డిమాండ్ జిల్లా ప్రజల నుంచి వినిపిస్తున్నది.

ఆదిలాబాద్‌పై అంత అక్కసెందుకు?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే వివక్ష చూపుతున్నదనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతున్నది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల కారణంగానే ఇలా చేస్తున్నదనే ప్రచారం జరుగుతున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది స్థానాల్లో కేవలం నాలుగింటిలో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. అదే టైమ్ లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉంటే.. ఖానాపూర్ లో మినహా మరెక్కడా విజయం సాధించలేదు. ఇక్కడ నాలుగింటిలో బీజేపీ, రెండింటిలో బీఆర్ఎస్ నెగ్గాయి. ఉమ్మడి ఆదిలాబాద్ పశ్చిమ ప్రాంతమంతా బీజేపీ, బీఆర్ఎస్ హవానే కొనసాగింది. ఎంపీ ఎన్నికల్లోనూ ఆదిలాబాద్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకున్నది. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. అనుకున్న మేర ఫలితాలు రాకపోవడంతోనే కాంగ్రెస్ ఇలా వ్యవహరిస్తున్నదని పొలిటికల్ సర్కిళ్లలో డిస్కషన్స్ జరుగుతున్నాయి.

బీఆర్ఎస్ హయాంలోనే కాస్త నయం..

ఉమ్మడి రాష్ట్రం నుంచే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఒకరు లేదా ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వాలనే సంస్కృతి నడుస్తున్నది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక ఇదే సంస్కృతిని బీఆర్ఎస్ కూడా కొనసాగించింది. మొదటి సారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నిర్మల్ ఎమ్మెల్యే ఇంద్రకరణ్ రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్నను మంత్రి పదవులను అప్పగించింది. రెండో సారి అధికారంలోకి వచ్చాక ఇంద్రకరణ్ రెడ్డిని మంత్రిని చేసింది. చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ విప్ గా పని చేశారు. కాంగ్రెస్ హయాంలో కనీసం ఆ విప్ పదవి కూడా ఇవ్వకపోవడంపై విస్మయం వ్యక్తమవుతున్నది.

మైనార్టీలకైనా న్యాయం చేస్తారా?

సామాజిక సమీకరణాల పరంగా చూసుకుంటే.. మంత్రివర్గంలో మైనార్టీలు లేరు. మరోవైపు అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల్లో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేకపోవడం రాష్ట్ర చరిత్రలోనే ఇది మొదటిసారి. కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు స్థానాలను ముస్లింలకు కేటాయించింది. నిజామాబాద్ అర్బన్ నుంచి మహమ్మద్ షబ్బీర్ అలీ, జూబ్లీహిల్స్ నుంచి మహమ్మద్ అజారుద్దీన్, నాంపల్లి నుంచి ఫిరోజ్ ఖాన్, మలక్ పేట్ నుంచి షేక్ అక్బర్, చార్మినార్ నుంచి ముజీబ్ షరీఫ్, కార్వాన్ నుంచి ఉస్మాన్ అల్ హాజ్రీ పోటీ చేశారు. వీరిలోఒక్కరు కూడా విజయం సాధించలేకపోయారు. మహమ్మద్ షబ్బీర్ అలీ నియోజకవర్గం చేంజ్ చేయడంతో ఆయన ఓడిపోయారనే చర్చ జరిగింది. అయితే ప్రస్తుతం ఆరుగురికి మంత్రివర్గంలో తీసుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఒక్క మైనార్టీ నాయకుడికైనా అవకాశం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తున్నది. అయితే మీర్ అమీర్ అలీ ఖాన్ ను ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా చేసింది. ఆయనను మంత్రివర్గంలో తీసుకుంటే బాగుంటుంది. అలా కాకపోయినా.. మరో సీనియర్ మైనార్టీ నాయకుడిని మంత్రివర్గంలోకి తీసుకొని.. ఆ తర్వాత ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని మైనార్టీ సమాజం కోరుతున్నది. అప్పుడే ప్రమాణస్వీకారం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన.. సామాజిక న్యాయం పూర్తవుతుంది.

ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464

అమెరికాలో పుట్టిన విదేశీ పిల్లలపై ఆంక్షలు

అమెరికాలో పుట్టే ఇతర దేశాల పిల్లలపై ఆంక్షలు పెట్టేసారు, ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్! అక్కడ తండ్రి లేదా తల్లి అమెరికన్ సిటిజన్ షిప్ పొంది ఉంటే పుట్టిన పిల్లలకు డోఖా లేదు! లేనిపక్షంలో ఇప్పుడిక పుట్టిన పిల్లలకు కష్టమే!47 వ అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ ప్రమాణం చేయగానే ఫైల్స్ పై చేసిన సంతకాల్లో అతి ముఖ్యమైనది ఇది! ఇదే ఇప్పుడు అందరినీ ఆగం చేస్తున్నది. వైట్‌హౌస్‌లోకి అడుగు పెట్టగానే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌లో ప్రధాన చర్చల్లోకి వచ్చిన ఆర్డర్ ఇదే..అక్కడి విధేషీయుల్లో ఇప్పుడు చర్చకు, అభద్రత కు దారి తీస్తున్నది! పుట్టుకతో వచ్చే పౌరసత్వ హక్కును మార్చేయడం. ఖచ్చితంగా అమెరికన్లకు పుట్టిన వారికే అమెరికా పౌరసత్వం వస్తుంది.

గ్రీన్ కార్డు మాత్రమే ఫైనల్

ఇక గ్రీన్ కార్డు ద్వారా వచ్చే పౌరసత్వాలే పైనల్. వాటికి ఉన్న కోటా.. దరఖాస్తులతో పోలిస్తే వందేళ్లకు కూడా అవకాశం దక్కని వారు ఉంటారు. ప్రపంచంలో ఏ దేశంలో అయినా తమ దేశంలో, తమ దేశ పౌరులకు పుట్టిన పిల్లలకే పౌరసత్వం ఇస్తారు. కానీ అమెరికాలో నూటయాభై సంవత్సరాల క్రితం పిల్లలు పుట్టినా అమెరికాలో పుడితే పౌరసత్వం ఇచ్చేలా రాజ్యాంగాన్ని రూపొందించారు. దీనివల్ల వలసదారుల పిల్లలు, పౌర సత్వం లేని వాళ్లు, కాన్పు కోసం అమెరికా వెళ్లిన వాళ్లకు పుట్టిన పిల్లలకూ అమెరికా పౌరసత్వం వచ్చేది. ఇలా అమెరికా పౌరులుగా మారిన జనాభా లో సగం మంది ఇతర దేశాల వారు ఉంటారు.అలా తల్లి తండ్రులకు లేని అవకాశాలు సైతం పిల్లలకు దక్కుతుంది. వారు అక్కడ పుడితే చాలు అమెరికన్ లు అయిపోతారు. తల్లిదండ్రులు మాత్రం వీసాల మీద ఉండేవారు లక్షల్లోనే ఉంటారు. ఇప్పుడు అలాంటి అవకాశాలు లేకుండా పోతున్నాయి.

ఒక్క కలం పోటుతో..

ఒక్క కలం పోటుతో ట్రంప్ పెద్ద దెబ్బ పెట్టాడు. ఇలాంటివి ఇంకెన్ని ఆటంకాలు అంతర్జాతీయంగా ట్రంప్ వల్ల ఎదుర్కోవాల్సి వస్తుందో వేచి చూడాల్సిందే. భారతీయులు అమెరికా మోజుపడటానికి.. అక్కడే ఉద్యోగం, పిల్లల్ని కనడానికి ప్రాధాన్యం ఇచ్చేది అక్కడ సెటిలైపోవడానికే. అందులో సందేహం లేదు. సొంత ప్రాంతానికి చుట్టపు చూపుగా వస్తారు కానీ.. అమెరికా ను వదిలేందుకు ఇష్టపడరు.అమెరికా అంటే అదో ప్రత్యేక మోజు అందుకే దొంగ దారులను సైతం వెతికి, వెతికి మరీ బాధలు పడుతున్న మంది లక్షల్లోనే ఉన్నారు.50 నుంచి కోటి రూపాయలు ఖర్చు చేసి, ఆస్తులు అమ్మి, అప్పులు చేసి వెళుతున్నారు. మోసపోతూనే ఉన్నారు. అలాంటి వారినందరిని వాపసు పంపే కృత నిశ్చయం తో ట్రంప్ ఉన్నాడు. దిగుమతి సుంకం ను కూడా భారీగా పెంచడం, స్వంతం గా ప్రొడక్షన్, ప్రొడక్టివిటీ మీద దృష్టి,పెట్టాడు ట్రంప్.

చైనాకు సవాలే మరి

అమెరికాను ఒక మ్యానుఫ్యాక్చర్డ్ హబ్ గా మార్చడం కోసం కృషి లాంటి ట్రంప్ మాటలు, ఎక్కడో చైనా కు సవాల్ విసిరినట్టు ఉంది. పనమా పై మాట కూడ ఆయన ఇక్కడ ఎత్తారు. గాజా మీద ఇజ్రాయిల్ యుద్ధం ఆపామని చెప్పి ఆ క్రెడిట్ కొట్టేసారు. మరో వైపు ఉక్రైన్ – రష్యా యుద్ధం పడం, మూడో ప్రపంచ యుద్ధం ఉండదని కూడ శాంతి సందేశం పడేసారు. టెస్లా ఎలాన్ మస్క్ యొక్క సూచనలు, సలహాలు ట్రంప్ మాటల్లో ప్రస్ఫుటించు తున్నాయి. మ్యాను ఫాక్చర హబ్ మాట ఎలాన్ మస్క్ నుంచి పుట్టిందే అనిపిస్తుంది. నిజానికి భారత్ లో ఉద్యోగాలు లేకనే మన దేశం నిరుద్యోగులు విదేశీ ఉద్యోగాలు, అక్కడి జీత భత్యాల మీద ఆసక్తి చూపుతున్నారు. మన దేశంలో కనీసం నెల కు పాతిక వేలు ఎవరిజీగా సంపాదించుకునే పరిస్థితి లేదు. పాలకులకు ఒక ప్లాన్ లేదు. ప్రభుత్వ రంగం ను చేతులారా నాశనం చేసారు. పారిశ్రామికరణ గత పది ఏండ్లుగా అస్సలు లేదు. ఉపాధి కి అవకాశమే లేని పరిస్థితులు ఉన్నాయి. హర్యానా, పంజాబ్, కేరళ, గుజరాత్, యూపీ, బీహార్ ల నుంచి, మన తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా ఉద్యోగాల వేట ఎప్పటికైనా ఇండియా తిరిగి రావాలన్న భావనతో.. కొంత మంది అదేదో ఇక్కడే చూసుకుంటే బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చే చాన్స్ ఉంది. ట్రంప్ పౌరసత్వ మార్పుల వల్ల అమెరికాకు మేలు జరుగుతుందో.. ఇండియన్స్‌కు చేటు జరుగుతుందో కానీ..

భారతదేశం ప్రభుత్వం చేతిలో పని

బారత్ నుంచి మేధో వలస మాత్రం తగ్గే చాన్సులు ఉన్నాయి,అంటున్నారు. అయితే ఇది పూర్తిగా భారత ప్రభుత్వం చేతిలో ఉంది, వారిని ఆపడం కాపాడు కోవడం! మన ప్రభుత్వం చేతిలోనే ఉన్నది! మన పీఎం నరేంద్రమోడీ ఏమి చేస్తారో చూడాలి! ఇండియా నుంచి విదేశాలకు వెళ్లి గోస పడుతున్న వారిని కలిసి, వారి కుటుంబాలతో మాట్లాడి చాలా విషయాలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వెల్లడించిన విషయం విదితమే! భవిష్యత్తు లో చూద్దాం, ఏమి జరుగనుందో, జరుగుతుందో..మన పీఎం మోడీ స్పందన ఎలా ఉంటుందో చూద్దాం.

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

కగార్ హత్యాకాండపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి బాధ్యత లేదా?

భారత దేశంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం అంతర్భాగమా, కాదా అనే అనుమానం మునుపెన్నడూ లేని విధంగా ఇప్పుడు బలంగా వస్తున్నది. ఎందుకంటే అక్కడి ఆదివాసులు ఈ దేశ ప్రజలా? కాదా? అనే అనుమానం అందరికీ వస్తుంది. ఎందుకంటే గత రెండు దశాబ్దాలుగా చత్తీస్‌ఘడ్ ఆదివాసీలపై అముల కాని రాజ్యం కొనసాగిస్తున్న మారణకాండ రూపాలు మార్చుకుంటూ వస్తున్నది.

ఇప్పటికే వేలాదిగా ఆదివాసీలు హత్యకు గురికాబడ్డారు. లక్షల్లో నిర్వాసితులయ్యారు. 2005 నుండి సల్వాజుడుం పేరుతో వేలాది మంది ఆదివాసీలను రమణ్‌సింగ్ ప్రభుత్వం హత్య చేసింది. ప్రొ. నందిని సుందర్, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రజాస్వామిక బాధ్యత వలన సల్వాజుడుం రద్దుకాబడింది. కాని అందులో పని చేసిన వారందరిని డిఆర్‌జి బలగాల పేరుతో కొత్త ఫోర్సుగా ప్రభుత్వంలో చేర్చుకున్నారు. సల్వా జుడుం తర్వాత 2009 లో ఆపరేషన్ గ్రీన్ హంట్ ప్రకటించబడింది. దీనితో సిఆర్‌పిఎఫ్ బలగాలతో పాటు డిఆర్‌జి బలగాలు కూడా ఆదివాసులపై దాడులు చేస్తూ హత్యాకాండను కొనసాగించాయి. అందులో భాగంగానే 2012లో జరిగిన బాసగూడ హత్యాకాండ, 2013 లో ఎడిసిమెట్టలో కూడా ఇటువంటి మారణకాండనే కొనసాగిం చారు. ఒక్కక్క ఎన్‌కౌంటర్ ఘటనలో 17 మంది ఆదివాసీలు మరణించారు. ఇందులో స్కూలుకు వెళుతున్న మైనర్ బాలురు 5గురు ఉన్నారు. 2011 నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండవ దశ అమలవుతూ వస్తుంది. ఈ కాలంలో ఆదివాసీల అక్రమ అరెస్టులు నిర్విరామంగా కొనసాగాయి. సుక్మా, దంతెవాడ, జగ్‌దల్‌పూర్, రాయపూర్ జైళ్ళన్నీ ఆదివాసీలతోనింపబడ్డాయి. అందరిపై ఉపా కేసులు నమోదు కాబడ్డాయి. చత్తీస్‌ఘడ్ ప్రత్యేక భద్రతా చట్టం కేస్ కూడా మోపబడింది. 2017 నుండి ఆపరేషన్ సమాధాన్ పేరుతో డ్రోన్‌లతో దాడి ప్రారంభించారు. ఈ స్థితిలోనే అక్కడ ఉన్నటువంటి జర్నలిస్టులకు పత్రికా స్వేచ్ఛ లేకుండా పోయింది. ఇది 1990లో అప్పుడున్న కలెక్టర్ ఎట్లయితే అడవిలోకెళ్ళి ఎవరు వార్తలు సేకరించినా గాని వారిని కాల్చి పారేయండని బహిరంగంగా మాట్లాడిన స్థితి నేడు అమలవుతున్నది. అందులో భాగంగానే చత్తీస్‌ఘడ్‌లో జరిగిన రహదారి అవినీతి కేసును బయటకు తీసినందుకు ముఖేస్ చంద్రాకర్ అనే యువ జర్నలిస్టును అత్యంత కిరాతకంగా గుండెను బయటకు తీసి కాలేయం నాలుగు ముక్కలుగా నరికి హత్య చేయడం అక్కడ ఎవరూ కూడా న్యాయం గురించి మాట్లాడొద్దని హెచ్చరించినట్లుగానే మనకు అర్థమవుతుంది. ఇది ఒక వైపు గతంలో ఉన్న ఐజి ఎస్ఆర్‌పి కల్లూరి కొనసాగించిన దాడినే నేడు ఉన్న ఐజి సుందర్ రాజ్ కొనసాగిస్తున్నాడు. కల్లూరి కాలంలో బిబిసి కాని అమ్నెస్టీ కాని చత్తీస్‌ఘడ్‌లో పర్యటిం చడానికి అవకాశం లేకుండా చేసి చత్తీస్‌ఘడ్ ఆవలకు నెట్టేసిన చరిత్ర వారికుంది. అప్పుడే ఎడిటర్స్ గిల్ట్ అనే సంస్థ ఇక్కడ వార్తా సేకరణ అనేది పూర్తి ప్రమాదకరంగా మారిందని ప్రకటించారు. ఆ స్థితి నుండి చత్తీస్‌ఘడ్ ప్రాంతంలో బస్తర్ టాకీస్ పేరుతో, బస్తర్ జంక్షన్‌ల పేరుతో యూట్యూబ్ ఛానల్లు అక్కడ జరుగుతున్న ఎన్‌కౌంటర్ దాడులను గాని హత్యాకాండలను గాని ప్రజలకు అందించడంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని కార్పొరేట్లకు పూర్తిగా కొమ్ము కాస్తున్న డబుల్ ఇంజన్ సర్కాల్‌లు ముఖేష్ చంద్రాకర్‌ను హత్య చేయించారు.

జనవరి 1, 2024 నుంచి ప్రారంబమైన ఆపరేషన్ కగార్ 6 నెలల పాప మంగ్లీ సోడి నుంచి ప్రారంభమైంది. ఆమె బీజాపూర్‌జిల్లా మూద్దూం గ్రామానికి చెందిన పాప. పోలీసులు కాల్పులు జరిపి 6 నెలల పాపను చంపేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తారు. తల్లి ఎక్కడ నిజం చెబుతుందో అని బిడ్డ అంత్యక్రియలకు రానీయకుండా దూరం పెడతారు. ఇది అక్కడ జరుగుతున్నటువంటి ఆపరేషన్ కగార్ నిజ స్వరూపం. 7 ఫిబ్రవరి 2024 న గోందోడు గ్రామంలో ఎన్ కౌంటర్ ఒకరి మృతి, చంద్రన్ అనే వ్యక్తి గోందోడు గ్రామంలో ముందే పట్టుకొని అతనిని రాత్రంతా తీవ్ర చిత్రహింసలకు గురి చేసి ఉదయం 6 గంటలకే కాల్చి చంపేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారు. 24 ఫిబ్రవరి 2024 సుక్మ జిల్లా బూర్గులంకలో ఎన్ కౌంటర్ ఒకరి మృతి చెందినట్లుగా ప్రకటించారు. ఇది సుక్మా జిల్లాకు చెందినవాడిగా అతన్ని కూడా ఇంటి దగ్గరే పట్టుకొని తీవ్ర చిత్రహింసలకు గురి చేసి ఉదయం 6 గంటలకే కాల్చి చంపేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారు. 19 మార్చి 2024 కోళ్ళమార్కలో జరిగిన ఎన్‌కౌంటర్లో నలుగురు మరణిం చారని ప్రకటించారు. గడ్చిరోలి జిల్లా ఐరి తాలుకా కోళ్ళమార్క్ అడవిలో నలుగురిని పోలీసులు ప్రాణాలతో పట్టుకొని విషం పెట్టి క్రూరంగా హింసించి ఉదయం 6 గంటలకు కాల్చి చంపి ఎప్పటిలాగే ఎదురుకాల్పుల్లో చనిపోయినట్లు ప్రకటిం చారు. శవాలను కూడా మాయం చేశారు. 27 మార్చి 2024 న బీజాపూర్ జిల్లా చీపురుబట్టి ఎన్ కౌంటర్ లో ఆరుగురు మరణించారు, అందులో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు. బీజాపూర్ జిల్లా చీపురుబట్టి గ్రామ సమీపంలో ఇద్దరు నిరాయుధంగా అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో వారిని పట్టుకొని తీవ్రంగా చిత్రహింసలు పెడుతుంటూ గ్రామస్తులు తిరగబడ్డందుకు అందులో నుండి ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసి, నలుగురిని చంపి ఈ ఎన్‌కౌంటర్‌లో 6 గురి చనిపోయినట్లుగా చిత్రించారు. 2 ఏప్రిల్ 2024 బీజాపూర్ కోర్చిల్ ఎన్కౌంటర్ 13 మందిని ఎన్‌కౌంటర్ చేశారు. ఇందులో ముగ్గురు మాత్రమే ఎదురుకాల్పుల్లో చనిపోయారు. మిగతావారు నిరాయుధంగా దొరికిన గ్రామస్తులు, మావోయిస్టులు. 6 ఏప్రిల్ 2024, బీజాపూర్ జిల్లా ఊసూర్ కర్రెగుట్ట ఎన్ కౌంటర్ లో ముగ్గురు మరణించినట్లుగా ప్రకటించారు. 16 ఏప్రిల్ 2024 కాంకేరి జిల్లా చోటా బెటియా పోలీస్ స్టేషన్ పరిధిలో కల్పర్ అపటోలా అడవిలో జరిగిన ఎదురు కాల్పులు జరిగాయి. అందులో 29 మంది మరణించారు. అందులో 15 మంది మహిళలు, 14 మంది పురుషులు మరణించారు. పోలీస్ ఎదురు కాల్పులలో 12 మంది మరణించారు. గాయాలతో దొరికిన ఆరుగురిని పోలీసులు పట్టుకొని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. అంతేకాక మరో 11 మందిని వెంటాడి పట్టుకొని ఊళ్ళో ఉన్న అమరుల స్తూపం వద్దకు తీసుకెళ్ళి ఒక్కొక్కరిని కాల్చి చంపారు.30 ఏప్రిల్ 2024 టెకేమెటా – కాకూర్ ఎన్ కౌంటర్, 10 మంది హత్య. మే 10 న ఛత్తీస్గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగులూరులో ఎన్ కౌంటర్ – 12 మంది మృతి. వీళ్లందరూ గ్రామస్థులేనని ఆదివాసి హక్కుల కార్యకర్త సోనీసోరి బీజాపూర్ కలెక్టర్ వద్దకు ఆదివాసి మహిళలను తీసుకువెళ్లి నిలదీస్తున్న వీడియో మన ముందుకు వచ్చిన నేపథ్యంలో ఇది బూటకపు ఎన్ కౌంటర్ గా భావిస్తున్నాం. మే 13 న ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో 2 చిన్నపిల్లల మృతి.

నిశబ్దంగా ఉన్నట్లయితే మన దేశం ప్రజాస్వామిక దేశమా అనే అనుమానం ప్రజలందరికి కలుగుతుంది. కనుక ఆ వైపుగా ఆపరేషన్ కగార్ అణచివేతను కొనసాగనివ్వకుండా నిలువరించడం కోసం రాజకీయ పార్టీలతో పాటు ప్రజాస్వామిక వాదులందరు కూడా గొంతెత్తాలని పౌర హక్కుల సంఘం పిలుపునిస్తుంది.

ఈ విధంగా జరిగిన ఎన్ కౌంటర్ హత్యాకాండ ఆపరేషన్ కగార్ పేరుతో 1 జనవరి 2024 నుండి దండకారణ్య ప్రాంతంలో అమలు కాబడుతున్నాయి. సుమారు 650 భద్రతా దళాల క్యాంపులు 7 లక్షల మంది పారా మిలిట్రీ బలగాలతో దానికి తోడు డిఆర్‌జి బలగాలు నిత్యం కూంబింగ్ నిర్వహిస్తూ ఆదివాసీలను అమానుషంగా హత్యగావిస్తున్నది. ఏడాది కాలంగా జరుగుతున్న హత్యాకాండ ఇప్పటికే 300 మార్కును దాటేసింది. ఎన్‌కౌంటర్ కొనసాగుతుండగానే మృతుల సంఖ్య బయటకి వస్తుంది. ఎందుకంటే ముందుగానే ఆదివాసీలను క్యాంపుల్లో నిర్బంధించి ఉంచి చంపాలనుకున్నప్పుడు డ్రెస్సులు తొడిగి అడవిలోకి తీసుకెళ్ళి కాల్చి చంపడమే ఎన్‌కౌంట్ ఆనవాయితిగా కొనసాగుతుంది. అందుకనే ముందుగానే ఎన్‌కౌంటర్ సంఖ్య బయటికి వచ్చేస్తున్నది.

దేశంలో ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ పార్టీ దాని నాయకుడు రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించబడి ఉన్నాడు. కానీ మధ్య భారతంలో లక్షలాది పోలీసు బలగాలు ఆదివాసీలను వెంటాడి వేటాడి హత్య చేస్తూ ఉంటే ఇప్పటి వరకు ఆపరేషన్ కగార్‌పై గాని హత్యాకాండలపై గాని నోరు మెదపలేదు. అదే విధంగా ఇక్కడ ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాని, మంత్రి సీతక్క గాని ఆమె నియోజకవర్గం ములుగులోనే 2 ఎన్‌కౌంటర్లు జరిగినప్పటికి ఇప్పటివరకు స్పందించలేదు. అదీ గాక పౌరహక్కుల సంఘం దేశంలో ఎన్నో ప్రాంతాల్లో నిజ నిర్ధారణ నిర్వహించినా ఎటువంటి ఆటంకాలు జరగని స్థితిలో ములుగులో మాత్రం ఒక వైపు మా నిజనిర్ధారణ కొనసాగుతుండగానే మరొక వైపు పౌరహక్కుల సంఘం దిష్టి బొమ్మన ఐటిడిఎ వద్ద కాల్చివేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే చెల్లింది. ఇప్పటికైనా దేశంలో ఒక ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ పార్టీ ఉనికిలో ఉన్నట్లుగా తాను భావించినట్లయితే జరుగుతున్న ఎన్‌కౌంటర్ హత్యాకాండపై ప్రతిపక్ష పార్టీ నేత రాహుల్ గాంధీ ఖచ్చితంగా మాట్లాడాలి. అంతేకాక దేశంలో ఉన్నటువంటి వామపక్షపార్టీలు, అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడి ఈ ఆదివాసీల హననానికి వ్యతిరేకంగా గొంతు విప్పాల్సిన అవసరం ఉంది. వాళ్ళు నిశబ్దంగా ఉన్నట్లయితే మన దేశం ప్రజాస్వామిక దేశమా అనే అనుమానం ప్రజలందరికి కలుగుతుంది. కనుక ఆ వైపుగా ఆపరేషన్ కగార్ అణచివేతను కొనసాగనివ్వకుండా నిలువరించడం కోసం రాజకీయ పార్టీలతో పాటు ప్రజాస్వామిక వాదులందరు కూడా గొంతెత్తాలని పౌర హక్కుల సంఘం పిలుపునిస్తుంది.

ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి,
పౌరహక్కుల సంఘం

రండి కదలి రండి

పటిష్టమైన ఉక్కు మెత్తబడిపోతోంది
ఘనపదార్థం ద్రవమై కన్నీరు కార్చేస్తోంది
పాలకుల స్వార్థ బుద్ధికి
నోరుమెదపని కుటిల కుతంత్రానికి
నిలువునా నీరై జవసత్వాలు కోల్పోతోంది

కడుపుకు ఇంత ముద్దపెట్టే అమ్మలాంటి
కర్మాగారపు డొక్కలు ఎండగొట్టడానికి
ఆసన్నమవుతోంది
ఇనుమునే అన్నంగా భావించి
రేయింబళ్ళు చెమటోడ్చి కండలు కరిగించి
జీవితాలను పణంగా పెట్టిన
కార్మికుల బ్రతుకుల్లో బుగ్గి రగిలించడానికి
కుట్ర సమ్మెటై పైకి లేస్తోంది

వేలాదిమందికి జీవనాధారమైన
పరిశ్రమను ఎక్కడినుండో వలస వస్తున్న
రాబందుల నోటికి ఆహారం చేస్తోంది
ప్రజానీకం దయా దాక్షిణ్యాలతో
అందలమెక్కిన
ఐదేళ్ల ఏలికల వెన్నుపోటుకి
ఐదువేళ్ళ నోటికాడ కూటిని
లాక్కొంటోంది

ఇంతటి దారుణమైన దగా ఇంకెక్కడైనా
ఉందా!?
కార్మికులారా లేవండి
మీ హక్కులను కాలరాస్తున్న కుయుక్తుల
పన్నాగులకు బుద్ధి చెప్పండి
ఐక్యంతో చేయి చేయి కలపండి గళం విప్పండి
పదం పదంతో కదం తొక్కండి
ఉక్కు సంకల్పంతో ముందుకు కదలండి
ఉద్యమిద్దాం కదలి రండి
మీ జీవితాల్లో వెలుగులను కమ్మేస్తున్న
ఈ కారుచీకటి మాయగాళ్ళ కుతంత్రాలను
ఎండగట్టండి
మీ జీవిత లోగిలిని రక్షించుకోండి

సాటి జనులరా కర్కశ మూకల వికృతత్వానికి
బలి కాబోతున్న తోటి కష్టజీవులకు
చేయూతనివ్వండి
తరలి పోబోతున్న ఉక్కు పరిశ్రమను
కాపాడనిద్దాం రండి కదలి రండి....!

నాగముని.యం (నాగ్)
9490856185
సీనియర్ అసిస్టెంట్ అదానీకి 'ధారవి' ధారదత్తం
విద్యుత్ శాఖ గుత్తి.ఆర్.యస్
అనంతపురం జిల్లా
ఆంధ్రప్రదేశ్.

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా వెలుగు నింపుతాం

- బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు లేదు
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

వనపర్తి బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) : గత పదేళ్లుగా పాలించిన బిఆరెస్ పార్టీ అదేవిధంగా గ్రామాలకు ఒక్క రేషన్ కార్డు జారీ చేయలేదని, గ్రామాలలో ఏడాదికో 10 ఇండ్లు నిరుపేదలకు అందించిన బడుగు బలహీన వర్గాలకు లబ్ధి చేకూరేదని, వీటిపై దృష్టి సారించకుండా సొంత లాభం చూసుకున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు.ప్రజాపాలన గ్రామసభల కార్యక్రమంలో భాగంగా బుధవారం వనపర్తి మండలం హవాయిగూడెం క్రిష్ణగిరి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. గ్రామాల్లోని నిరుపేదలు గత ప్రభుత్వ పాలనలో

పదేళ్లు నియంత పాలనలో దగాపడ్డారని నేడు ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందుతాయన్నారు. రైతు భరోసా భూమిలేని నిలుపేదలకు అందించే రూ 12,000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల అందజేతకు సంబంధించి నేడు జరుగుతున్న గ్రామసభల్లో ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అధికారులు తయారుచేసిన జాబితాలో కొందరు పేర్లు ఉండొచ్చు ఉండకపోవచ్చునని అలాంటివారు ఎలాంటి నిరాశకు గురి కాకుండా నేడు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో బడుగు బలహీన వర్గాలకు పూర్తిస్థాయిలో ప్రజాపాలన అందించే ఉద్దేశంతోనే ప్రభుత్వం ముందుకెళుతుందని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ఫలితాలు అద్భుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశ కమిటీ సభ్యులు శంకరనాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి కిరణ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తాం

- రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి

రాజేంద్రనగర్, జనవరి 22 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలో భాగంగా నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళను అర్హులందరికీ అమలు అయ్యేలా చేస్తామని రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోకాపేట కమ్యూనిటీ హాలు నందు నార్సింగ్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు గంగిడి శివారెడ్డి, ఆర్. ఆదిత్య రెడ్డిలు పాల్గొని వార్డు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్హులైన తెలంగాణ ప్రజల కు రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ళు సంక్షేమ పథకాలు అమలు చేయడం పట్ల అహర్నిశలు శ్రమిస్తున్నారని అర్హులైన వార్డు ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వారు తెలిపారు.

ప్రభుత్వ పారా మెడికల్, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని వినతి



మఖ్తల్, జనవరి 22 (జనంసాక్షి) : మఖ్తల్ నియోజకవర్గ కేంద్ర పర్యటనకు విచ్చేసిన తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నర్సింహని మఖ్తల్ ఏబీవీపీ సభ్యులు కలిసి మఖ్తల్ లో పారామెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందచేశారు. సందర్భంగా నగర కార్యదర్శి వంశీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా, విద్యా వైద్యం, ఉద్యోగ పరంగా అన్ని విషయాల్లో వెనుకబడ్డ జిల్లాగా, వలస జిల్లాగా ఉమ్మడి పాలమూరు కానీ, నూతన నారాయణపేట జిల్లా కానీ అభివృద్ధికి నోచుకోలేదని అందులో మఖ్తల్ నియోజకవర్గం సరిహద్దు నియోజకవర్గం కావడంతో అన్ని రకాలుగా మరింత వెనకబడి ఉన్నదని తెలిపారు. నియోజకవర్గం అయినప్పటికీ కనీసం ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేని సందర్భంలో గతంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మఖ్తల్ శాఖ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసి మఖ్తల్ కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధనలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీ, వినయ్, అరవింద్, సందీప్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ

- అర్హులైన ప్రతి రైతుకి రుణమాఫీ చేయిస్తాం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

తాండూరు, జనవరి 22 (జనంసాక్షి) : భవిష్యత్తులో మరింత పారదర్శకంగా సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందిస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు మండలం కరణ్ కోట్ గ్రామంలో ప్రజాపాలనలో భాగంగా మండలి విఫ్ మహేందర్ రెడ్డి ,గ్రామ నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి గ్రామ సభలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని, పథకాల గురించి వివరించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కు అధికారం ఇవ్వండి, నన్ను గెలిపించండి అని ఎన్నికల ప్రచారంలో అడిగాం, మాపై నమ్మకంతో మీరు మాకు అవకాశం ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం మొత్తం అధికార యంత్రాంగం మీ ఇంటి ముందుకు వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. సంక్షేమ పథకాలను నిరంతరం అమలు చేస్తాం.దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకి 22 వేల కోట్ల రూపాయలతో రైతు రుణమాఫీ చేశాం.గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కడుతూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.అర్హులైన ప్రతి రైతుకి రుణమాఫీ చేయిస్తామన్నారు. ఇంకా ఎవరికైనా కాకపోతే చేయించే బాధ్యత నేను తీసుకుంటానని తెలిపారు. గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు

జిరాక్స్ పేపర్లు పట్టుకొని కార్యాలయాల చూట్టూ తిరిగేవారు. ఇప్పుడు మన ప్రజా ప్రభుత్వంలో అలా కాదన్నారు. ప్రభుత్వం మారింది ప్రజలకు కష్టాలు తీరుతున్నాయన్నారు.భవిష్యత్తులో మరింత పారదర్శకంగా సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందిస్తామన్నారు.రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26న మరో 4 పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు.ప్రతిపక్ష నాయకులు చెప్పే మాటలు నమ్మకండి, ప్రతిపక్ష నేత కేసీఆర్ కు కూడా రైతు భరోసా అందిస్తామన్నారు.భూమి లేని నిరుపేదలకు కూడా సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వడమనేది దేశంలోనే చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు.అర్హులైన వారి పేర్లు లిస్ట్ లో లేకుంటే మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 22 (జనంసాక్షి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ వల్లూరు కాంతి పేర్కొన్నారు. బుధవారం చౌటకూర్ మండలం బద్రి గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు కలెక్టర్ వల్లూరు క్రాంతి, మునిపల్లి మండలంలో బుధేరా గ్రామంలో అదనపుకలెక్టర్ చంద్రశేఖర్ లు వేరువేరుగా పాల్గొన్నారు. ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద లబ్ధి పొందేందుకు గాను అర్హులైన ప్రతి ఒక్కరు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామసభల తరువాత కూడా తహసిల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజా పాలన కేంద్రాలలో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు స్థానిక సంస్థల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి

మఖ్తల్, జనవరి 22 (జనంసాక్షి) : మక్తల్ పట్టణంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహని కలిసి స్థానిక సంస్థలో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ తో పాటుగా రాష్ట్రంలోని హారులైన ప్రతి దివ్యాంగునికి 15 లక్షలు హెల్త్ కార్డు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో దాదాపు 20 లక్షల మంది దివ్యాంగులు ఉన్న దాదాపు 20 లక్షల ఓటు బ్యాంకు ఉన్న మమ్మల్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం మొన్నటి ఎన్నికల మేనిఫెస్టోలో 8/8 ప్రకారం స్థానిక సంస్థల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు జరిగే పంచాయతీ ఎన్నికలలో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వాటితో పాటుగా ప్రతి పంచాయతీలో ఇద్దరు చొప్పున నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రతి దివ్యాంగునికి పదిహేను లక్షల వరకు హెల్త్ కార్డు ఇవ్వాలని పలు సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకుపోవడం జరిగిందని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, తిరుపతయ్య, రాఘవేందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో అధిక నిధులు తీసుకొస్తాం
- తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు, జనవరి 22 (జనంసాక్షి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు మండలం కరన్ కోట్ లో ప్రజా పాలన గ్రామ సభ లో ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి , డిప్యూటీ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్. అధికారులు ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తులును స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో లక్ష తొమ్మిది వేల మంది రైతులకు 2 లక్షల

చొప్పున 850 కోట్ల రూపాయల రుణమాఫీ అందించా మన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదించి, తాండూర్‌కు నిధులు వరదలా తెప్పించి అభివృద్ధికి ఎమ్మెల్యేకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని పిలుపు నిచ్చారు. కరణ్ కోర్ట్ గ్రామం నియోజకవర్గంలోనే పెద్ద గ్రామం కాబట్టి ప్రతి ఒక్కరికి ఇల్లు అందేలా చూస్తామన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన రోజుల్లో అన్ని మండలాలలో రోడ్ల అభివృద్ధికి, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు తీసుకోచ్చామని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులకు నిధులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం అధికారులను నిలదీసిన ప్రజలు

నర్సాపూర్, జనవరి 22 (జనంసాక్షి) : నర్సాపూర్ మున్సిపాలిటీలో అధికారులను బిఆర్ఎస్ నాయకులు ప్రజలు రేషన్ కార్డుల కోసం నిలదీశారు. పట్టణంలోని ఆరవ వార్డులో మున్సిపల్ అధికారులు బుధవారం వార్డు సభ నిర్వహించారు. అధికారులు సర్వే చేసిన ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల జాబితాను చదివి వినిపించారు. దరఖాస్తులు చేసుకున్న పథకాలు మంజూరు చేయడం లేదని అధికారులను ప్రజల నిరదీశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, బిఆర్ఎస్ పట్టణ నాయకులు మహమ్మద్‌లు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం దరఖాస్తులు మాత్రమే తీసుకుంటుందని వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తూతూ మంత్రంగా వార్డు సభలు,గ్రామ సభలు నిర్వహిస్తూదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,బిఆర్ఎస్, నాయకులు ప్రజలు ఇతరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ పక్కన పెడితేనే లక్ష్యం సాధించవచ్చు

నర్సాపూర్, జనవరి 22 (జనం సాక్షి) : సెల్‌ఫోన్ పక్కన పెడితేనే అనుకున్న లక్ష్యం సాధించవచ్చని మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం నర్సాపూర్ మండలంలోని పదవ తరగతి విద్యార్థుల ప్రేరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులను మొబైల్ ఫోన్ తలదించుకునేలా చేస్తుందని దేశం జెండా ఎప్పుడూ తల ఎత్తుకునేలా చేస్తుందని సూచించారు. వాతావరణ

కాలుష్యానికి ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్తబుట్టలో వేయమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ తనకు ప్రేరణగా తన తల్లిదండ్రులు ,తన గురువులే కారణమని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి తారా సింగ్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, దీపక్ దాస్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు

చందంపేట, జనవరి 22 (జనంసాక్షి) : చందంపేట మండల పరిధిలోని దేవరచర్ల, యాల్మలమందలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శంకుస్థాపన చేసిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్.అనంతరం ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. ప్రతి గ్రామానికి, తండాకు సీసీ, బీటీ రోడ్డు వేయడమే తమ లక్ష్యమని అన్నారు. అధికారులు కార్యాలయాల్లో కూర్చోకుండా క్షేత్రస్థాయిలో రోడ్లను పరిశీలించి,తమకు నివేదిక ఇస్తే నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేద్దామని అధికారులకు సూచించారు. అధికారులు, ప్రజలు సహకరిస్తే మరింత ఉత్సాహంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,%ూూజం% చైర్మన్ కొండ్ర శ్రీశైలం యాదవ్,మండల పార్టీ అధ్యక్షులు బాధ్య నాయక్,మాజి జడ్పీటిసి బుచ్చి లచ్చిరామ్, మాజీ ఎంపీపీలు పార్వతి చందు నాయక్, సబిత సుక్కో నాయక్,గోవింద్ యాదవ్,యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,మహిళ అధ్యక్షురాలు రాజ్య లక్ష్మి,మండల అధ్యక్షులు సాయి రాథోడ్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క సంజీవ కుమార్, రాజు, కో ఆప్షన్ సభ్యులు సాదిక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు,మాజి ఎంపీటీసీ మహా లక్ష్మయ్య, కోటి లక్ష్మ నాయక్,కోరట్ల మాజి సర్పంచ్ దొండేటి మల్లా రెడ్డి,రంగయ్య గౌడ్,నాయకులు నాగేశ్వర్ రావు,రమేష్ నాయక్,గ్రామ నాయకులు రమావత్ గోపాల్, ముడావత్ శ్రీను,న్యాంక్య, సురేష్, స్వామి, నర్యా, జబ్రూ, శ్రీను,చిన్నమర్య,లచ్చురాం,బిట్టు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ హాస్పిటల్లో జీవితాన్ని మార్చే శస్త్రచికిత్స

ఖైరతాబాద్, జనవరి 22 (జనంసాక్షి) : ప్లాస్టిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్స విభాగం నిమ్స్ జనవరి 6-8 మధ్య ఎన్.వై.యూ, యూఎస్ఏ నుండి వచ్చిన అంతర్జాతీయ విజిటింగ్ ఫ్యాకల్టీ (క్రానియోఫేషి యల్ సర్జన్) సహాయంతో కొన్ని క్రానియోఫేషియల్ విధానాలను నిర్వహించింది. అంతర్గత డిస్ట్రాక్షన్ ఆస్టియోజెనిసిస్ అని పిలువబడే అధునాతన సాంకేతికతపై అసలు పరిశోధన పనితో సంబంధం కలిగి ఉన్న ఈ విధానాలు ఇలిజారోవ్ టెక్నిక్‌లు అని పిలువబడే అవయవాలలో ఎముకలను పొడిగించే విధానాల మాదిరిగానే ముఖ ఎముకల పురోగతికి ఉపయోగించబడతాయి. భారత దేశం లో అంతర్గత డిస్ట్రాక్షన్ ఇప్పటికీ బాల్యంలోనే ఉంది. కేసు వివరాలు క్రానియోసినోస్టోసిస్ కారణంగా వికృతమైన తల ఆకారంతో జన్మించిన 7 సం.ల తెలివైన, చాలా ఉత్సాహభరితమైన బాలుడు కౌషల్ 6 నెలల వయస్సులో న్యూరో సర్జన్ చేత ఆపరేషన్ చేయబడ్డాడు. తల పెరుగుతూనే ఉంది కానీ అసాధారణ

ఆకారంలో కళ్ళు మధ్యభాగం తగినంతగా పెరగకపోవడం వల్ల కక్ష్యల నుండి బయటకు పొడుచుకువచ్చాయి. రాత్రిపూట అక స్మాత్తుగా ఆక్సిజన్ సంతృప్తత పడిపోవడంతో, కొన్నిసార్లు 50 శాతం వరకు తక్కువగా ఉండటంతో అతని సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. పుర్రె, ముఖ ఎముకలు, ముఖ్యంగా ఇరుకైన నాసికా వాయు మార్గానికి దారితీసే మధ్యభాగం తగినంతగా పెరగకపోవడంతో అతనికి అబ్స్ట్రాక్టివ్ స్లీప్ అప్నియాతో కూడిన సిండ్రోమిక్ క్రానియోసి నోస్టోసిస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. తల్లిదం డ్రులు అడెనో టాన్సిలెక్టమీ వంటి బహుళ మృదు కణజాల దిద్దుబాటు శస్త్ర చికిత్సలతో ప్రయత్నించారు. తదుపరి నిర్వహణ కోసం పిల్లవాడిని నిమ్స్‌కి పంపారు. అన్నీ సిద్ధం చేసి జనవరి 7న యూఎస్ నుండి ప్లాస్టిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్స విభాగానికి విజిటింగ్ ఫ్యాకల్టీ అయిన డాక్టర్ డేవిడ్ ఎ స్టాఫెన్‌బర్గ్ సహాయంతో శస్త్రచికిత్స జరిగింది. రోజుకు 1 మిమీ చొప్పున 5 రోజుల గ్యాప్ డిస్ట్రాక్షన్ ప్రారంభమైన తర్వాత, అది ఎటువంటి సమస్యలు లేకుండా సజావుగా సాగుతోంది. ఇటువంటి క్లిష్టమైన కేసులలో ఆపరేషన్ చేయడానికి, అంతర్జాతీయ ఫ్యాకల్టీతో సహకరించడానికి తమకు అవకాశం ఇచ్చినందుకు నిమ్స్ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

అలకనంద కాదు... అలకదందా ఆసుపత్రి

- నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్
- ఆసుపత్రి వద్ద ఏఐవైఎఫ్ నిరసన

హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) : నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు పాల్పడిన సరూర్ నగర్ డాక్టర్స్ కాలనీ లోని అలకనంద మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి రిమాండ్ చేయాలని, ప్రజల ప్రాణాలను సొమ్ము చేసుకుంటున్న ఆస్పత్రులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో అలకనంద ఆసుపత్రి వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ లు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలకనంద మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ యాజమాన్యం 9 పడకలకు మాత్రమే అనుమతి పొంది, 30 పడకలను అక్రమంగా నిర్వహిస్తున్నా రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టలేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిన్న బాధిత పేషెంట్ లకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తే కానీ స్పందించని అధికారుల వైఖరి చూస్తుంటే ఏ స్థాయిలో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో పరోక్షంగా కుమ్మక్కు అవుతున్నారో అర్థం చేసుకోవాలని వారు అన్నారు. ఇతర రాష్ట్రాలు తమిళనాడు, కర్నాటక నుండి లైసెన్స్ లేని జూనియర్ వైద్యులతో ఈ సర్జరీలు చేస్తున్నారని, ప్రజల ప్రాణాలతో దందా చేస్తున్న ఇలాంటి ఆసుపత్రులపై ఉక్కు పాదం మోపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ,ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధు, పి. శివ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి వీరేశ్, వెంకటేష్, సందీప్, హరి కృష్ణ, గణేశ్, భాను, ప్రకాష్,పాండు, భగత్ సింగ్, సైదులు, శ్రవణ్, కళ్యాణ్, అనీల్ కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ కు వినతిపత్రం అందజేశారు.

ఇంటి జాగా ఇచ్చేవరకు ఇంచు కదిలేది లేదు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 22 (జనంసాక్షి) : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీలో రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేస్ 2లో భూ పోరాట రెండవ వార్షికోత్సవ వేడుకలను జనసందోహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు భూ పోరాటాల్లో భాగమైన పేదల త్యాగాలను గుర్తుచేసుకుంటూ, వారి హక్కుల సాధనకు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. భూమి పేదల హక్కు:-ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ టి నరసింహ, అందోధి రవీంద్ర చారి లు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల కోసం ఇంటి స్థలాలను పంచాలని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. "ఓట్లు రాకపోయినా, సీట్లు లేకపోయినా, ప్రజల వెంటే ఉంటాం. భూమి పేదల హక్కు, ప్రతి పేదరికంలో ఉన్నవారికి అది అందాలి" అని స్పష్టంచేశారు. రావి నారాయణ రెడ్డి కాలనీ భూ పోరాట కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిందని, 100 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి కాపాడి పేదల హక్కులు రక్షించామని వారు వెల్లడించారు. ఈ విజయాన్ని అందరితో పంచుకుంటూ, ఈ పోరాటం సామూహిక విజయంగా నిలిచిందని అన్నారు. ప్రభుత్వం పేదల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిపారు. "ఇల్లు లభించే వరకు మా పోరాటం ఆగదు. తక్షణమే సమస్యల పరిష్కారం కోసం అన్ని మార్గాల్లో కృషి చేస్తాం" అని హామీ ఇచ్చారు.పేదల కోసం పోరాడే ప్రతి ఒక్కరు కలిసివస్తేనే విజయం సాధ్యమని నేతలు పిలుపునిచ్చారు. భూ పోరాటాలను అడ్డుకునే ప్రయత్నాలను కఠినంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. "పేదల గెలుపు కోసం ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యత నిర్వహించాలి" అని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ప్రజానాట్య మండలి ప్రధానకార్యదర్శి పల్లె నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, సిపిఐ పార్టీ కౌన్సిలర్ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ అజ్మీర్ హరిసింగ్ నాయక్, దిగోజు వేణుగోపాల్ చారీ,మాధవ రెడ్డి, కేతరాజు నర్సింహా అరుణ, వట్టి నవనీత, తగిలి మధు, మరియు భూ పోరాట నాయకులు పొన్నాల యాదగిరి, దాసరి ప్రసాద్, సైదులు ముదిరాజ్, ఆవుల యాదగిరి,వీరేష్, శ్రీకాంత్, సుజాత, దేవమ్మ,ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ అవాస్తవం

- డిపోల కార్యకాలపాలన్నీ ఆర్టీసీ ఆధీనంలోనే
- ప్రైవేటీకరణ దుష్ప్రచారాన్ని ఖండించిన టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) : ఎలక్ట్రిక్ బస్సుల పేరిట ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ ప్రయత్నాలంటూ జరుగుతున్న ప్రచారాన్ని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ఆర్టీసీ డిపోలు ప్రైవేట్ సంస్థల పరిధిలోకి వెళ్లిపోతున్నాయనే దుష్ప్రచారం పూర్తి అవాస్తవమని పేర్కొంది. ఎలక్ట్రిక్ బస్సుల మెయిన్‌టనెన్స్, చార్జింగ్ మినహా ఆపరేషన్స్ అంతా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతుందని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఈవీ పాలసీ ప్రకారమే పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సులను ప్రజలకు సంస్థ అందుబాటులోకి తీసుకువస్తోందని పేర్కొంది. డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతో సహా అన్ని బస్సుల ఆపరేషన్స్ నిర్వహణ పూర్తిగా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతుందని, అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని వెల్లడించింది.

సమష్టిగా సమీకృత వ్యవసాయం

- నికర ఆదాయ పంటలకు ప్రోత్సాహం
- తెలంగాణ రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మీన్ బాషా

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 22 (జనంసాక్షి) : సమీకృత వ్యవసాయాన్ని వ్యవసాయ,పట్టు పరిశ్రమ, ఉద్యానశాఖలతో కలిసి సమష్టిగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మీన్ బాషా తెలిపారు.బుదవారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడ గ్రామంలో రీలింగ్ యూనిట్‌ని,వెల్దెర్ల గ్రామంలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌ని,పూలు సాగుని ఆమె బుదవారం సందర్శించారు. ఈ సందర్భంగా యాస్మీన్ బాషా మాట్లాడుతూ సమీకృత సాగు విధానాన్ని రైతులు స్ఫూర్తిగా తీసుకుని నికర ఆదాయం లభించే పంటలను సాగు చేయాలన్నారు. ఈ ప్రాంతంలో ఆయిల్‌ఫామ్ పంటల వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ వంటి లాభదాయకమైన పంటలను సాగు చేయాలన్నారు. సమీకృత సాగు విధానంపై వివరాలు తెలుసుకుని సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులకు ఆయిల్ పామ్ పంటలకు సంబంధించి తగు సూచనలు, తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేసినారు. ఈ సందర్భంగా ఉద్యాన సంచాలకులు డ్రిఏ కు సంబంధించి 1200 హెక్టార్లు అదనపు లక్ష్యాన్ని కేటాయించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి కె.సురేశ్,సహాయ ఉద్యాన సంచాలకులు కె.కిషన్ రావు, పట్టు పరిశ్రమ జాయింట్ డైరెక్టర్ లత,అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ నాగరత్న, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకే..

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

వనపర్తి బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) : సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకే అందించాలనేదే ప్రభుత్వం ఉద్దేశమని, కాబట్టి ప్రజలు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి తెలిపారు.సంక్షేమ పథకాల అమలుకోసం నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా బుధవారం రెండో రోజు గోపాల్ పేట్ మండలంలోని తాడిపర్తి గ్రామంలో జరిగిన గ్రామ సభకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి లు హాజరయ్యారు. గ్రామ సభను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకే అందాలనే ఉద్దేశ్యంతో అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి అర్హులైన వారి జాబితా రూపొందించడం జరిగిందన్నారు. ఈ జాబితాలో ఇంకా ఏమైనా మార్పు చేర్పులు, అభ్యంతరాలు ఉన్నాయా అనేది ప్రజల సమక్షంలో పెట్టి ప్రజల అభిప్రాయాలు, సూచనలు తీసుకురావడం జరుగుతుందన్నారు. అనర్హులు ఉంటేవారిని తొలగించడం జరుగుతుంది అన్నారు. గ్రామంలో సాగు యోగ్యం కానీ భూములను రైతు భరోసా నుంచి తొలగించడం జరుగుతుందని, అలాంటివి ఏవైనా ఉంటే గ్రామసభలో తెలియజేయాలని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని ఇంకా ఎవరైనా నిజమైన లబ్ధిదారులు ఉంటే గ్రామ సభలో కానీ మండలంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పథకాల అమలు విషయంలో ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, తహసిల్దార్ తిలక్ రెడ్డి, ఎంపిడివో, ఇతర అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం..

చిట్యాల, జనవరి 22 (జనంసాక్షి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయడానికి కృషి చేస్తున్నామని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఐఏఎస్ అన్నారు. ప్రజా పాలనలో భాగంగా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో నిర్వహించిన వార్డు సభకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి హాజరై వార్డు సభ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ఏ ఒక్క రేషన్ కార్డు మంజూరు కాలేదని, గ్రామసభలలో కేవలం ఆయా పథకాల కింద వచ్చిన దరఖాస్తుల పేర్లను మాత్రమే చదవడం జరుగుతున్నదని, అవి ఏ పథకం కింద ఖరారైన జాబితాలు కాదని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు, ఇండ్లు తదితర పథకాల కోసం గతంలో మీ-సేవ ,ప్రజా పాలన, కుల గణన సందర్భంగా, అలాగే ప్రస్తుతం గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించడం జరుగుతున్నదని, వీటన్నింటిని పరిశీలనలోకి తీసుకుని పూర్తిగా పరిశీలించి అర్హులైన వారికి మాత్రమే ఆయా పథకాలను అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ జెడి శ్రవణ్, మున్సిపల్ కమిషనర్ వీరేందర్, ఎమ్మార్వో కృష్ణ నాయక్, ఎంపిడిఓ ఎస్పీ జయలక్ష్మి,మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, మున్సిపల్ కమిషనర్ వీరేందర్, వెలిమినేడు పిఎ సిఎస్ చైర్మన్ రఘుమారెడ్డి, కౌన్సిలర్‌లు జడల పూలమ్మ, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలి

సూర్యాపేట ప్రతినిధి, జనవరి 22 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా స్కీమ్స్ అర్హులైన ప్రతి ఒక్కరికి పదకాలు అందించాలన్న ఉద్దేశంతో కొత్తగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. నాలుగు పథకాలకు జరిగే గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీనిలో భాగంగా సూర్యాపేట జిల్లాలో బుధవారం గ్రామ, వార్డ్ సభలు నిర్వహించగా మొత్తం 475 గ్రామ పంచాయితీలు ఉండగా 139 గ్రామ సభలు, 05 మున్సిపాలిటీ పరిదిలోని 141 వార్డులలో 35 వార్డ్ సభలను అధికారులు నిర్వహించారు. గ్రామ సభలలో 616 మంది రైతు భరోసా కొరకు, 5537 మంది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కొరకు, 4384 మంది కొత్త రేషన్ కార్డుల కొరకు, 6124 మంది ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరిస్తా...

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద

కుత్బుల్లాపూర్, జనవరి 22 (జనంసాక్షి) : కుల సంఘాల కమిటీ హాల్‌ల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. బుధవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉమామహేశ్వర కాలనీ వడ్డెర సంఘం సభ్యులు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి కమిటీ హాల్ నిర్మాణానికి తోడ్పాటు అందించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుల సంఘాలకు ప్రభుత్వ భూములు కేటాయించి ప్రత్యేక నిధులను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కుల సంఘాల అభివృద్ధి కోసం తాము ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కుల సంఘాలకు పనిముట్ల తో పాటు వారికి లోన్లను ఇప్పించి సబ్సిడీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు ఎత్తరి మారయ్య, కొంపల్లి ఉమామహేశ్వర కాలనీ వడ్డెర సంఘం సభ్యులు వల్లపు అంజయ్య, మంజుల వెంకయ్య, వల్లేపు మహేష్, బోసు సుధాకర్, కె స్వామి, ఎస్ వెంకటేష్, ఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- ఫుడ్ తయారీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) : నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కల్తీ, అపరిశుభ్ర ఆహార పదార్థాలు తయారీ చేసి ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాటమాడితే సహించబోమని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హెచ్చరించారు. బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూకట్ పల్లి జోన్ పరిధిలోని కుతుబుల్లాపూర్ సర్కిల్ సూరారం ప్రాంతంలో గల పలు పిండి వంటల, స్వీట్ తయారి కేంద్రాలను ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల సందర్భంగా మేయర్ ఆయా షాప్‌లో తయారు చేసి అమ్మకానికి ఉన్న నాణ్యతలేని సరుకులను, అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్న పిండి వంటకాలు, ఆహార పదార్థాల తయారీలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడాన్ని గుర్తించారు. పిండి, పప్పులు, తదితర సరుకుల పై తయారు తేదీ, ఎక్స్పైరీ తేదీ లేకపోవడాన్ని గమనించి, నిల్వలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘనల పై ప్రశ్నించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, కాలపరిమితి ముగిసిన సరుకులు నిల్వ చేయడం వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అధికారులకు కనిపించని అసలైన లబ్ధిదారులు

- నిరుపేదలంటే అధికారులకు ఎందుకు ఇంత చిన్నచూపు
- నిరుపేదల బ్రతుకుచిత్రం మారేది ఎప్పుడు
- అధికారుల నిర్లక్ష్యానికి నిండు నిదర్శనం
- లెంకలపల్లి గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లలో చోటు లేదు

మర్రిగూడ, జనవరి 22 (జనంసాక్షి) : మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామంలో అధికారులు చేసిన నిర్లక్ష్యం చూస్తే ఆగ్రహంతో ఊగిపోతారు, అసలే నిరుపేదలు అమాయకులైన ప్రజలను మోసం చేయడానికి సిగ్గు అనిపించదా... ప్రజా ప్రభుత్వం పేదవారి పక్షమా లేక అన్నీ ఉన్న బలిసినోడి పక్షమా.. ఆర్థికంగా బలంగా ఉన్నోడి పక్షానే ప్రభుత్వం ఉంటుందని మరోసారి రుజువు చేసింది, ప్రజా ప్రభుత్వం లో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజా ప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు లెంకలపల్లి గ్రామానికి చెందిన షేక్ గిడ్డు, మైసయ్య గుడిసెలలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు, చలికి వానకి వణుకుతూ విష సర్పాల నుండి జీవన పోరాటం చేస్తూఅగ్నికి ఎప్పుడు ఆహుతి అవుతుందో కూడా తెలువకుండా జీవనం సాగిస్తున్నారు, అలాంటి వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని పట్టించుకోవడం సర్వతవిమర్శలకు దారి తీస్తుంది,ఎన్ని ప్రభుత్వాలు మారిన పేదవాడి బ్రతుకుచిత్రం ఎప్పుడు మారుతుందో అర్థం కాని ప్రశ్న..

మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల నీ భాష మార్చుకో..
- ధర్నాలు, నిరసనలు ప్రజాస్వామ్య పద్ధతిలో చేయాలి
- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 22 (జనంసాక్షి) : జిల్లా అభివృద్ధి ప్రదాత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎవరికైనా బడిత పూజ తప్పదని,నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు హెచ్చరించారు.బుధవారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,నల్లగొండ,తిప్పర్తి మాజీ జెడ్పిటిసిలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాం రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే స్థాయి లేదని హెచ్చరించారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు ఇప్పటికైనా మానుకోవాలని, లేనిపక్షంలో ఇంటికొచ్చి కొడతామని హెచ్చరించారు.నల్లగొండ మున్సిపాలిటీలో కంచర్ల భూపాల్ రెడ్డి చేసిన నిరసన,దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేయాల్సి ఉండగా, గుండాలు, రౌడీలు,గంజాయి బ్యాచ్ తో మున్సిపాలిటీలో కమీషనర్ ఛాంబర్ కు వెళ్లి దౌర్జన్యానికి పాల్పడ్డారని విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఇంకా పదవిలో ఉన్నాననే భ్రమలో ఉన్నారని, భవిష్యత్తులో ఆయన కౌన్సిలర్ గా కూడా గెలవడం ఎద్దేవా చేశారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జిల్లాలో ఫ్లోరైడ్ విముక్తి కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశాడని అన్నారు.జాతీయ రహదారి ఆరు లైన్లుగా మంజూరు చేయించిన ఘనత కూడా కోమటిరెడ్డి వెంకటరెడ్డిదేనని స్పష్టం చేశారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా ఉన్న జగదీష్ రెడ్డి బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు గురించి ఎన్నడు పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయించాడని అన్నారు.అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిని విస్మరించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి,

ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిలు అధికారం కోల్పోయిన తర్వాత కొత్త నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మైనార్టీ నాయకులు,కౌన్సిలర్ బషీరుద్దీన్,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,కౌన్సిలర్లు మారవుని నవీన్ గౌడ్, కేసాని వేణుగోపాల్ రెడ్డి,జూలకంటి శ్రీనివాస్,గణేష్ నాయకులు మందడి శ్రీనివాస్ రెడ్డి,జూలకంటి సైదిరెడ్డి, గోవర్ధన చారి, వజ్జ రమేష్ యాదవ్,గాలి నాగరాజు,పిల్లి రమేష్ యాదవ్,దాసరి ప్రీతి ప్రశాంత్, నాంపల్లి భాగ్య,కిన్నెర అంజి,జానీ యాదవ్,కంచర్ల ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,జనవరి 22(జనంసాక్షి)

జిల్లాలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎస్సారెస్పీ డీ 83, డీ 86 కాలువల సాగునీటి విడుదల పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.పెద్దపల్లి జిల్లాలో డీ-83, డీ-86 కాలువల వివరాలను అధికారులు మ్యాప్ ద్వారా కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో యాసంగి పంటకు ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో డీ-83, డీ-86 కాలువల ద్వారా సాగు నీరు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.యాసంగి పంటకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు తయారు చేసుకున్నామని, వారం విడిచి వారం ఆన్ ఆఫ్ పద్ధతిలో ఇప్పటి వరకు రెండు తడుల నీటిని అధికారులు విడుదల చేయడం జరిగిందని, జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు మూడో తడి సాగునీటి విడుదల ఉన్నందున, చివరి ఆయకట్టు వరకు సాగునీరు వెళ్లే విధంగా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. సాగు నీటి విడుదల అంశంలో ఎక్కడ ఎటువంటి లోపం రాకుండా అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ సాగునీరు సమృద్ధిగా రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాస్, ఈఈ ఇరిగేషన్ సుల్తానాబాద్ ప్రసాద్, ఈఈ మంథని బల్ రామయ్య ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తాం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) :

ప్రభుత్వ పథకాల అమలుకు గ్రామసభల నిర్వహణలో భాగంగా గంగాధర మండలం నారాయణపూర్ లో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నారాయణపూర్ రిజర్వాయర్ ను సందర్శించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడుతూ... గత ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి తక్కువ ఆయకట్టుకు నీరిచ్చిందని అన్నారు. ఈ ప్రభుత్వం తక్కువ ఖర్చులో ఎక్కువ ఆయకట్టుకు నీరు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రాజెక్టుల జాబితాలో నారాయణపూర్ రిజర్వాయర్ ను చేరుస్తామని తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి అవసరమైన సుమారు 70 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రకటించారు. ఏడాదిలోగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీళ్లు అందిస్తుందని అన్నారు. రిజర్వాయర్ ముంపు విషయంలో నారాయణపూర్ ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు. నారాయణపూర్ లో నాలుగు ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం వర్తించేలా చూస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగును నింపేందుకు తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని వివరించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... 10 సంవత్సరాలుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వారందరికీ కార్డు అందుతుందని తెలిపారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.

జనవరిలోనే ఎల్లంపల్లి జలాలు విడుదల

గతంలో ఎప్పుడూ లేనివిధంగా జనవరి మాసంలోనే నారాయణపూర్ జలాశయానికి ఎల్లంపల్లి నీరును విడుదల చేశామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మెట్ట ప్రాంతంగా ఉన్న చొప్పదండి నియోజకవర్గంలో జల యజ్ఞంలో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపూర్ జలాశయానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. 90 శాతం పనులు కూడా పూర్తి చేసిందని అన్నారు. మిగిలిన 10 శాతం పనులను గత సర్కారు పట్టించుకోలేదని అన్నారు. నారాయణపూర్ జలాశయం పనులన్నీ పూర్తి చేస్తామని, మిగిలిన ఆయకట్టుకు కూడా నిరందిస్తామని వివరించారు.

ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు గతంలో సమర్పించిన దరఖాస్తులన్నీ పరిగణలోకి తీసుకున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అర్హులుగా ఉన్న వారి పేరు గ్రామసభలో లేకపోతే అక్కడే దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. చాలా ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రేషన్ కార్డుల ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని వివరిం చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రపుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ పాల్గొన్నారు.

భూ కబ్జాల ఫోర్జరీ కేసులో అరెస్టు

రాజేంద్రనగర్,జనవరి22(జనం సాక్షి)

భూ కబ్జా ఫోర్జరీ సంతకాలతో భూమిని ఆక్రమించి అగ్రిమెంట్తో అమ్మకానికి పెట్టిన నేరస్తులను మైలార్దేవ్పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇన్స్పెక్టర్ నరేందర్ తెలిపిన ప్రకారం గగన్ పహాడ్ కు చెందిన కిషోర్ కుమార్(56), అశోక్ కుమార్(48) లు ఎకేఆర్ పెట్రోల్ పంప్ ఏకేఆర్ బార్ వ్యాపారం చేస్తున్నారు. తేదీ 23 9 2024న బేగంబజార్ కు చెందిన ఓం ప్రకాష్ గంటాజి ఫిర్యాదుతో రాజేంద్ర నగర్ మండలం లోని బుద్వేల్ గ్రామ పరిధిలోని సుమారురూ.3 కోట్ల భూమి సర్వే నం. 265 లోని ప్లాట్ నం. 168 పార్ట్ లోని 235 గజాల ఓపెన్ ప్లాట్ ను, ప్లాట్ నం. 168 ప్లాట్ 102 గజాల ప్లాట్ లను ఫిర్యాదు దారుడు కి తెలియకుండా అతని యొక్క సంతకం ఫోర్జరీ చేసి ఒక ఫేక్ అగ్రిమెంట్ సేల్ పొజిషన్ తో ఫేక్ డాక్యుమెంట్ ను తయారు చేశారు. రాజేంద్ర నగర్ లోని రెండవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లో ఓఎస్ నెం. 260/2023 ప్రకారం తప్పుడు కేసు వేశారు. మైలార్ దేవ్ పల్లి పోలీసులు ఇట్టి కేసు లో నేరస్తులు కేకేఆర్ పెట్రోల్ పంప్ , కేకేఆర్ బార్ యాజమానులు అయిన కిషోర్ కుమార్ అతని సోదరుడు అశోక్ కుమార్ లను అరెస్ట చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో లో హాజరు పరిచారు. గౌరవ న్యాయస్థానం నేరస్తులను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ కి తరలించారు.

వైద్యారోగ్య శాఖలో 104 కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళనలు

ఆరు నెలలుగా వేతనాలు అందక అవస్థలు

వరంగల్ ఎంజీఎం, జనవరి 22 (జనం సాక్షి):

వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 104 కాంట్రాక్టు ఉద్యోగులకు గత అరు నెలలుగా వేతనాలు పెండింగ్ లో ఉండడం వలన అనేక అవస్థలు పడుతున్నారని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించకపోతే దశల వారి ఆందోళన,పోరాటాలు చేస్తామని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం నాడు వరంగల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ముందు 2024 జూలై నుండి రావలసిన ఆరు నెలల పెండింగ్ వేతనాల కోసం నిరసన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాద నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 33 జిల్లాలకు ఆరు నెలలకు సంబంధించిన సరిపడా బడ్జెట్ విడుదల చేసిందని,రాష్ట్రంలోని 32 జిల్లాల కు సంబంధించిన ఉద్యోగుల వేతనాల చెల్లింపు పూర్తయిందని ఒక్క వరంగల్ జిల్లాలోనే వేతనాలు విడుదల చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని జిల్లా యంత్రాంగాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం,సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని మూడు రోజుల్లో ఆరు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేనియెడల ఈ నెల 27వ తేదీ సోమవారం రోజున వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో పర్లపల్లి శ్రీనివాస్,రాజ్ కుమార్,సృజన,మధు, క్రాంతి కుమార్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం గల అధ్యాపకులతోనే అత్యుత్తమ ఫలితాలు

హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి)

నైపుణ్యం గల అధ్యాపకులతోనే అత్యుత్తమ ఫలితాలు సాధ్యమని, హంగూ, ఆర్భాటంతో కూడిన సౌకర్యాలతో కాదని మాస్టర్ మైండ్స్ సహా వ్యవస్థాపకుడు సీఏ మోహన్ మట్టుపల్లి తెలిపారు. ఇటీవల 'బ్యాక్‌బెంచింగ్ విత్ వివేక్' యూట్యూబ్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. మాస్టర్ మైండ్స్ విద్యార్థి సీఏ ఫైనల్స్‌లో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించారన్నారు. టాప్ ర్యాంక్స్ ఫ్యాన్సీ బిల్డింగ్స్ నుంచి రావని, అసాధారణమైన ఉపాధ్యాయుల నుంచి వస్తాయని తెలిపారు. మాస్టర్ మైండ్స్ ప్రముఖ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా.. ప్రతి సంవత్సరం వేలాది మంది సీఏ/సీఎంఏ అభ్యర్థుల కలలను సాకారం చేస్తుందన్నారు. ఎంతో మంది విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ విజయానికి పర్యాయపదంగా మారిందన్నారు. ఈ విజయం నాణ్యమైన విద్య పట్ల తిరుగులేని నిబద్ధతకు తార్కాణంగా నిలిచిందన్నారు. 'బ్యాక్‌బెంచింగ్ విత్ వివేక్' చానల్ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుందన్నారు. లక్షకు పైగా సభ్యులతో యాక్టివ్ వ్యూయర్‌షిప్‌ను అందుకుంటుందని పేర్కొన్నారు.

హంగూ, ఆర్భాటంతో కూడిన సౌకర్యాలతో కాదు

మాస్టర్ మైండ్స్ సహా వ్యవస్థాపకుడు సీఏ మోహన్ మట్టుపల్లి

గుడి కొలనులో పడి గుర్తుతెలియని బాలుడు మృతి

కుత్బుల్లాపూర్ జనవరి 22 (జనం సాక్షి)

గుర్తుతెలియని బాలుడు గుడి కొలనులో పడి మృతి చెందిన సంఘటన బుధవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం గాజులరామారం సమీపంలోని మహదేవపురం శివాలయం వద్ద గల గుడి కొలనులో మృతదేహం గుర్తించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ.శంకర్ పోలీసుల బృందం తో ఘటన స్థలానికి వెళ్లి సీసీ ఫుటేజీల ఆధారంగా ఆరా తీశారు. కోనేరు వైపు ముగ్గురు బాలుళ్లు వెళ్తున్నట్టు దృశ్యాలు కనిపించాయన్నారు.తక్షణమే డిఆర్ఎఫ్ సిబ్బందిని పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు.బుధవారం సాయంత్రం బాలుడి మృతదేహం తేలడంతో పోలీసులు స్వాధీన పరుచుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.బాలుడి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

లింగాల గణపురం, జనవరి 22 (జనంసాక్షి)

: ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరిం చిందని తెలంగాణ రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి, మాజీఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించా రు. లింగాల గణపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిరసన దీక్ష నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా తాటికొండ రాజయ్య హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులకు ద్రోహం చేసిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయడమే కాకుండా, వారి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయకపోవడం, వాగ్దానాలను

కేవలం ప్రచార హోదాలో పరిమితం చేయడం కాంగ్రెస్ అసమర్థతకు నిదర్శనంగా నిలుస్తోందని ఆరో పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్, నాయకులు చేవెళ్లి సంపత్, చౌదర్పల్లి శేఖర్, కాసర్ల సుధీర్, కుమార్, ఉడుగుల భాగ్యలక్ష్మి, కొర్ర రాజేందర్, సోమిరెడ్డి, ఏదునూరి వీరయ్య,గండి యాదగిరి, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి

శేరిలింగంపల్లి, జనవరి 22 (జనంసాక్షి)

ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత వ్యవహారాలకు సంబంధించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్ కొత్తగూడా విలేజ్ పరిధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం - 2025' కార్యక్రమంలో భాగంగా జరిగిన అవగహన ర్యాలీలో బుధవారం కొండాపూర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నవీన్, శేరిలింగంపల్లి మండలం విద్యాధికారి వెంకటయ్య తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భద్రతా మాసోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం పిఎసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను పాటించి నిర్దేశించిన వేగం మించకుండా వాహనాలను నడపాలని గాంధీ తెలియచేసారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకోవడంవల్ల ప్రతి ఒక్కరిలో సామాజిక స్పృహ పెరిగి రోడ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించడానికి ఆస్కారం కలుగుతుందని అరికపూడి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉట్ల కృష్ణ, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చాంద్ పాషా, ఉట్ల దశరథ్, శ్రీనివాస్ చౌదరి, తిరుపతి, నర్సింహ సాగర్, సత్యం గౌడ్, శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆసుపత్రి సందర్శించిన ఒడిస్సా డాక్టర్ల బృందం

తూప్రాన్, జనవరి 22 (జనంసాక్షి)

తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఒరిస్సా రాష్ట్రానికి చెందిన డాక్టర్ల బృందం సందర్శించారు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వివిధ జిల్లా ఆసుపత్రి డాక్టర్లు అరవింద గోవిందా మహంతి రవి నారాయణ సాహూ ఇప్సిత మహాపాత్ర మన్సు శ్రీ దీప్తి రంకన్ మాలిక్ దీపక్ మాజీ వదలకు సభ్యుల బృందము ఆసుపత్రిని సందర్శించారు ఆస్పత్రి ఇన్చార్జి డాక్టర్ అమర్ సింగ్ నాయక్ ఆసుపత్రి పనితీరును డాక్టర్ల బృందానికి వివరించారు. ఓపి నమోదు డాక్టర్ పరిశీలన వ్యాధి నిర్ధారణకు సంబంధిత పరీక్షలు ఆ తర్వాత ఇన్ పేషెంట్ల వార్డులను ల్యాబ్, రక్త నమూనాల సేకరణ వంటి గదులను సిబ్బంది పనితీరును క్లీన్ అండ్ గ్రీన్ వంటి మొదలగు విషయాలపై డాక్టర్ అమర్ సింగ్ నాయక్ వివరించారు. అనంతరం డాక్టర్ల బృందం ఆసుపత్రికి వచ్చిన రోగులను ఆసుపత్రి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఒరిస్సా డాక్టర్ల బృందం వెంట డాక్టర్ అనిల్ కుమార్. డాక్టర్ పురుషోత్తం. అధికారులు ఒరిస్సా సభ్యులకు వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తాం

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి,జనవరి 22(జనంసాక్షి)

: పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామంలో అలాగే పెద్దపల్లి పట్టణంలోని 10, 22, 34 వార్డుల్లో బుధవారం సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపిక సభల్లో ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలో నెంబర్ వన్ గా నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన జనవరి 26 నుండి అమలు చేసే రైతుభరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు నాలుగు సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఆర్డీఓ గంగయ్య, మున్సిపల్ కమీషనర్ వెంకటేష్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసిల్దార్ రాజ్ కుమార్, మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, పెద్దపల్లి విండో ఛైర్మన్ నర్సింహ రెడ్డి, కౌన్సిలరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఉప్పల

హైదరాబాద్ (జనంసాక్షి)

శ్రీశైలం పుణ్యక్షేత్రంలో మల్లికార్జున స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని పురోహితులచే ప్రత్యేక పూజలు నిర్వహించిన టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కన్నవారికి, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలి

మంథని, (జనంసాక్షి)

మంథని నియోజక వర్గం పరిధిలోని మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో మహాదేవ పూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకరి రమ్య రాజబాబు ఆధ్వర్యంలో అజాతశత్రువు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసనసభావతి శ్రీపాద రావు స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ విజేతలకు బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు దుద్దిల్ల శ్రీను బాబు చేతుల మీదుగా అందజేశారు. ముందుగా శ్రీను బాబు పొలిటికల్ జట్టు వర్సెస్ ప్రెస్ జట్టు క్రికెట్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. శ్రీను బాబు కీపింగ్, బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ కన్నవారికి పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని శ్రీను బాబు అన్నారు.

శ్రీపాద స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన శ్రీను బాబు

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 జనవరి 2025

కార్మికుల సంక్షేమం బీఆర్‌టీయూ మిత్రపక్షాలకే సాధ్యం

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

బూర్గంపహాడ్, జనవరి 22 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మా గెలుపుకు ఎదురులేదు శంకర్ రెడ్డికి తిరుగులేదని ఈ నెల 31న సారపాక ఐటీసీ పీఎస్పీడీలో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో వందకు వందశాతం బీఆర్డీయూ మిత్రపక్షాలదే గెలుపు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం బీఆర్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్టీయూ మిత్రపక్షాలు 14వ వేతన ఒప్పందం కోసం 14 అంశాలను మేనిఫెస్టోలో ప్రవేశపెట్టి విజయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. గత గుర్తింపు సంఘాలు బీఆర్ టి యు మిత్రపక్షాలకు అనుభవం లేదంటున్నారని, కానీ విజ్ఞానం... సత్తా ఉందని, మంచిచేసిన సంఘానికి కార్మికులు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. ఇప్పటికే సగం విజయం ఖాయమైందని మిగిలిన సంఘాల నుంచి కొందరు ఇప్పటికే బిఆర్‌టియు మిత్రపక్షాలకు టచ్లో ఉన్నారన్నారు. నిబద్ధత, నిజాయితీతో కార్మికుల సంక్షేమానికి పాటుపడే సంఘం బీఆర్డీయూ మాత్రమేనన్నారు. సీనియర్ నాయకులు, అనుభవజ్ఞులు, అనేక కంపెనీల్లో అగ్రిమెంట్లు చేసిన సీనియర్ నాయకుల సపోర్ట్ బీఆర్జీయు కు ఉందని 100శాతం సమస్యలను పరిష్కరించగల సత్తా బీఆర్టీయూకు ఉందన్నారు. బీఆర్టీయూ మిత్రపక్షాలు క్యాంపు ఆఫీస్ అధికారికంగా ఏర్పాటు చేసి యూనియన్లతో సంబంధంలేకుండా నిజాయితీగా కార్మికులకు సర్వీస్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మేనిఫెస్టోలో ప్రధానంగా కార్మికుల సంక్షేమం కోసం 14 అంశాలను రూపొందించడం జరిగిందని, ప్రధానంగా విద్య, వైద్యం, బదిలీల రెగ్యులర్, క్వార్టర్ల నిర్మాణంతో కార్మికుల సంక్షేమం కోసం పనిచేసే సంఘం ఏదైనా ఉందంటే బీఆర్టీయూ మాత్రమేనన్నారు. త్వరలో జరగనున్న ఐటీపీ గుర్తింపు ఎన్నికల్లో రామబాణంతా బీఆర్డీయూ మిత్రపక్షాలు దూసుకువెళ్లి విజయం సాధించడం తథ్యమన్నారు. ప్రతిపక్ష కార్మిక సంఘాలు టీఆర్టీయూ మిత్రపక్షాలపై చేసే ఆరోపణలు, అవాకులు చెవాకులు ఎవరూ నమ్మవద్దని. కార్మికులకు అండగా నిలిచే సంఘం. వారికి సంక్షేమం అందించే సంఘం బీఆరేయూ మాత్రమేనన్నారు. తొలుత బీఆర్టీయూ ఎన్నికల ప్రధాన రథాలను జెండా ఊపి ప్రారంభించారు. విలేకరుల సమావేశం అనంతరం మేనిఫెస్టోను ప్రారంభించి అనంతరం బీఆర్డీయూ మిత్రపక్షాలు, కార్మికులతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో గెలుపుపై చర్చించారు. ఈ సమావేశంలో రేయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము.. శంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్పి అజీమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.హరినార్, సీఐటీయూ అధ్యక్షుడు కె.ప్రవీణ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఐఈయూ ప్రధాన కార్యదర్శి ఎండి. సాబీట్, ఐఈయ అధ్యక్షులు శిక్షావలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆర్గనైజేషన్ బాధ్యులు నర్సింహారావు, డి. ప్రశాంత్ బహుజన నాయకులు మధుమహరాజ్, శ్రీపాద రవికుమార్, గడ్డల నాగేశ్వరరావు, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాస్, బెజ్జంకి కనకాచారి, బొల్లు సాయి, బిల్లా సాయిబాబా, పూర్ణ, లక్ష్మీచైతన్య రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రులలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

● జిల్లా కలెక్టర్

నల్లగొండ బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) : ప్రభుత్వాసుపత్రులలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జిల్లా త్రిపాఠి అన్నారు.బుధవారం ఆమె నకిరేకల్ మండలం,ఓగోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగుల వివరాలను అవుట్ పేషెంట్,ఇన్ పేషెంట్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు.అలాగే గర్భిణీ స్త్రీలకు ప్రతినెల చికిత్సలు నిర్వహించే ఏ ఎన్ సి రిజిస్టర్ సైతం పరిశీలించారు.పి హెచ్ సి లో ప్రసవాలు లేక పోవడంపై ఆమె మాట్లాడుతూ జీరో డెలివరీలు ఎందుకు ఉన్నాయని అడిగారు.ఇక్కడ డెలివరీలు నిర్వహిస్తున్నారా,సి సెక్షన్ చేస్తున్నారా డాక్టర్లందరూ విధులకు హాజరవుతున్నారా అని వైద్య అధికారిని ప్రశ్నించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలకు గ్రామీణ ప్రాంతాల నుండి పేద ప్రజలే ఎక్కువగా వస్తారని,వారికి సరైన వైద్య సేవలనందించి వారి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ డాక్టర్ల పైనే ఉందని అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం డాక్టర్లు,సిబ్బందితోపాటు,లక్షల రూపాయలు వెచ్చించి సౌకర్యాలను సైతం కల్పిస్తున్నదని తెలిపారు.ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం స్థాయిలోనే సాధారణ ప్రసవాలను ప్రోత్సహించినట్లయితే మాత,శిశు సంరక్షణతో పాటు, మాతా శిశు మరణాలను తగ్గించవచ్చని, జిల్లా స్థాయి ఆస్పత్రులపై భారాన్ని తగ్గించవచ్చని అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. ఏలాంటి సమస్య లేకున్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులను కావాలని ప్రైవేట్ ఆస్పత్రులకు పంపించినట్లు తమ దృష్టికి వస్తే అలాంటి డాక్టర్ల లైసెన్సు రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు.అత్యవసరమైతే తప్ప సమస్య ఉన్న కేసుల విషయంలోనే పై ఆసుపత్రులకు రెఫర్ చేయాలని చెప్పారు.

ప్రజల సమక్షంలోనే అధికారులను నిలదీయాలి

● ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జనవరి 22 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్లు, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ పారదర్శకంగా జరిగే విధంగా, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా, పక్కా ప్రణాళికతో అధికారులను నిలదీయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందేవిధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న కొంతమంది పేదల పేర్లు జాబితాలో పొందుపర్చలేదని,కేవలం అయిదు శాతం లబ్దిదారులకే అంటే నూటికి అయిదు మంది చొప్పున లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తించడాన్ని గట్టిగా ప్రశ్నించాలని, ప్రజలతో కలిసి అధికారులను ప్రశ్నించాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికారులను తప్పుదోవ పట్టించి జాబితాను తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు పారదర్శకంగా పని చేయాలని లేకుంటే ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి అధికారుల పై చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. అదే విధంగా ప్రతి బూతులో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాలో లేనివారి పేర్లను ఎందుకు తొలగించారో ప్రజల సమక్షంలోనే అధికారులను నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ శాంతి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, రావుల అంజయ్య,కరంచంద్, బద్దం పరశురామ్ రెడ్డి, మురుగేశ్, అమీనుద్దీన్,లక్ష్మణ్ యాదవ్, వసాగోని శ్రీనివాస్ గౌడ్, సిద్ది రాములు, డోలి రమేష్, చిన్న యాదవ్, డిల్లి పరమేశ్, శోభన్ బాబు,శేఖర్ గౌడ్, తుపాకుల జనార్దన్, సంతోష్ నాయుడు, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 28న నల్లగొండలో రైతు మహా ధర్నాకు హైకోర్టు అనుమతి

● కంచర్లపై దాడి ఘటనను మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

నల్లగొండ టౌన్, జనవరి 22 (జనంసాక్షి) : నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి,నోముల భగత్ తోపాటు రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్,రాజీవ్ సాగర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 28న రైతు మహా ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని తెలియజేశారు.ఈ ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నా విజయవంతం చేయాలని కోరారు.నోముల భగత్ కుమార్ మాట్లాడుతూ కేటీఆర్ ను చూసి భయపడి రైతు ధర్నాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని, ఇప్పుడు కోర్టు అనుమతితో రెట్టించిన ఉత్సాహంతో సభను విజయవంతం చేస్తామని తెలిపారు.పల్లె రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుడు వాగ్దానాలకు ప్రజలు మోసపోయి నేడు అడుగడుగునా వారిని ప్రజలు ఎండ కడుతున్నారని,ఇప్పటికైనా ప్రభుత్వం తను చేసిన వాగ్దానం నిలబెట్టుకునే విధంగా ప్రజలకు మేలు చేయాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించిన ఎస్పీకి, డిజిపికి, మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేయనున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొర్ర సుధాకర్, సీనియర్ నాయకులు బక్క పిచ్చయ్య,కనగల్ సింగిల్ విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి,మాజీ ఎంపీపీ ఎస్కే కరీం పాషా,బొజ్జ వెంకన్న,మాజీ జెడ్పిటిసి తుమ్మల లింగస్వామి, పట్టణ పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్,నల్గొండ కనగల్ మండల పార్టీ అధ్యక్షులు,దేప వెంకట్ రెడ్డి అయితగోని యాదయ్య,సిరిగిరి వెంకటరెడ్డి,బడుపుల శంకర్ మాజీ ఎంపీటీసీలు,పొగాకు గట్టయ్య, సుంకిరెడ్డి వెంకట్ రెడ్డి ఉట్కూరు సందీప్ రెడ్డి,మెండు మణిపాల్ రెడ్డి, మాజీ సర్పంచు కడారి కృష్ణయ్య, పేర్ల అశోక్, శ్యాంసుందర్, వీరమల్ల భాస్కర్ షరీఫ్,విద్యార్థి నాయకుడు బొమ్మరబోయన నాగార్జున, వెంకన్న,జిల్లా రవి,తదితరులు పాల్గొన్నారు.

ఆహార విధానంతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్

ఖైరతాబాద్, జనవరి 22 (జనంసాక్షి) : ఆహార విధానంతో దీర్ఘకాలిక వ్యాధులను సైతం తగ్గించుకోవచ్చని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ విషయంలో ఆయుర్వేద వైద్యం హితోధికంగా దోహదపడుతుందన్నారు. నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఆరోగ్య డైట్" కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం "ఆయుర్ కల్పిట సిరప్" లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో షుగరు, బీసీ, థైరాయిడ్, ఒబిసి టీ వంటి అనారోగ్య సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయన్నారు. వీటన్నింటిని మన ఆహార విధానాలతో నయం చేసుకోవచ్చన్నారు. ఈ పరిస్థితుల్లో "ఆహారం మాది ఆరోగ్యం మీది" అనే నినాదంతో 2017లో మొదలైనటువంటి ఈ ఆహార ఉద్యమం ఆరోగ్య డైట్ కౌంటర్ అందిస్తున్న ఆయు ర్వేద వైద్యంతో మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. బి12, డి విటమిన్ సమస్యతో బాధపడుతున్న తాను ఈ ఆరోగ్య డైట్ ద్వారా ఫలితం పొందానని జెడి లక్ష్మీనారాయణ చెప్పారు. అనంతరం ఆరోగ్య డైట్ సృష్టికర్త లక్ష్మణ్ పూడి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో కూడా ఈ ఆహార విధానం దిగ్విజయంగా కొనసాగుతుందన్నారు. ఈ ఆహార విధానాన్ని జేడీ పాటిస్తున్నారని చెప్పారు. షుగర్, సొరియా సిస్, ఒబెసిటీ సమస్యలతో బాధపడే వారందరు ఆరోగ్య డైట్ ద్వారా మంచి ఫలితాలను పొంద వచ్చని అన్నారు.

చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యం

దేవరకొండ, జనవరి 22 (జనంసాక్షి) : నేటి పోటీ ప్రపంచంలో నిలబడాలంటే విద్యార్థి దశలోనే ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని ,క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అసిస్టెంట్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ పి. మౌనిక ఐపీఎస్ పేర్కొన్నారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో బుధవారం వారు ఖేల్ – మేల్ 2025 క్రీడా కార్యక్రమాలకు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉండే ప్రతి ఒక్కరు ఎలా ఉండాలి,ఒక ఉన్నతమైన ఆశయాల కోసం లక్ష్యాల కోసం ఎలా ముందుకు వెళ్లాలి, అనే విషయాన్ని వెల్లడించారు. విద్యార్థులు ఆటలతోపాటు,చదువు యొక్క ప్రాముఖ్యత, ఎలా చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారో తన జీవిత అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు పిల్లలలో శారీరక ఎదుగుదలను, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. భవిష్యత్తులో ఈ పాఠశాల విద్యార్థులు ప్రపంచానికే దిక్సూచిగా ఉండాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ మొహమ్మద్ అన్వర్ హుస్సేన్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు..

● ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, జనవరి 22 (జనంసాక్షి) : నేరుడుగొమ్ము మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు మరియు రేషన్ కార్డులు అర్హత కల్గిన వారి జాబితా ఆమోదించుకొనుట కొరకు గ్రామ సభ నిర్వహణ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల ,ఇందిరమ్మ ఇళ్లపై జరుగుతున్న తప్పుడు సమాచారం పై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు,రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు అందోళన చెందవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి జరుగుతుందని ప్రజలకు వారు భరోసా నిచ్చారు.రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడం జరిగిందని అన్నారు. దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖన్, పిఎసిఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలం యాదవ్,మండల పార్టీ అధ్యక్షులు కృష్ణయ్య,యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,మాజి జడ్పీటీసీ బుజ్జి లచ్చిరం నాయక్, మాజి ఎంపీపీ గోవింద్ యాదవ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జానపహాడ్ దర్గా ఉర్సు ఉత్సవానికి పటిష్ట పోలీసు భద్రత

● జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్

పాలకవీడు, జనవరి 22 (జనంసాక్షి) : ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న జానపాహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా బుధవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఉత్సవం జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు, దర్గాను సందర్శించి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లను చేస్తున్నాము అని, ప్రజలు సోదరభావంతో కలిసిమెలిసి ఉత్సవం నిర్వహించుకోవాలని కోరారు.దర్గా పరిసరాలు, క్యు లైన్స్, బారికెడ్స్ ఏర్పాటు,వాహనాల పార్కింగ్ స్థలాలు, ఉత్సవ ప్రాంతంలోకి వచ్చిపోయే మార్గాలను.ఉత్సవ ప్రాంతంలో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నాము అన్నారు.వాహనాలు రద్దీ వల్ల భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ రెగ్యులేషన్ చేస్తూ, పార్కింగ్ పాయింట్ లు ఏర్పాటు చేశామని.పోలీసు సూచన మేరకు వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని, రోడ్ల పక్కన వాహనాలు నిలిపి భక్తులకు అసౌకర్యం కలిగించవద్దు అని కోరారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా రక్షణ కల్పిస్తూ బందోబస్తు నిర్వహించాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని స్థానిక డీఎస్పీ,సిఐ లను ఆదేశించారు.ఎస్పి వెంట డీఎస్పీ శ్రీధర్ రెడ్డి,సిఐ చరమంద రాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, స్థానిక ఎస్ఐ లక్ష్మీ నరసయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలకు అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ

● సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

సూర్యాపేట ప్రతినిధి, జనవరి 22 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజలను కోరారు.బుధవారం చివ్వెంల మండలంలోని వట్టి కంపహాడ్ గ్రామం పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.గ్రామసభల వద్ద స్పెషల్ దరఖాస్తులు అందజేస్తున్నారని,దానిలో ఓపికగా వివరాలు పూర్తిచేసి అందజేయాలని తెలిపారు. ఇప్పుడు గ్రామ సభలో చదివిన పేర్లు గతంలో దరఖాస్తులు పెట్టుకున్న వారి పేర్లని, ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు, దీనిలో పేరు రాని వాళ్ళు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.ప్రజలు అధైర్యపడకుండా దరఖాస్తులు అందజేయాలని కోరారు.ప్రజలకు పథకాలపై ఎలాంటి అపోహలున్న వెంటనే అధికారులను తెలిపి నివృత్తి చేసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్లకు 269, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 17 మంది, కొత్త రేషన్ కార్డు కొరకు 212 మంది, రైతు భరోసాకు 26 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.గ్రామసభలో మరలా ఇందిరమ్మ ఇళ్లకు 28 మంది, కొత్తగా దరఖాస్తులు చేసుకున్నారని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 53 మంది కొత్తగా దరఖాస్తులు చేసుకున్నారని అన్నారు.నూతన రేషన్ కార్డుల కొరకు 12 మంది దరఖాస్తులు చేసుకున్నారని, రైతు భరోసా కు ఇద్దరు రైతులు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇక్కడకు రాలేకపోయిన వారు ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని అనుకునేవారు మండలాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలలో కూడా వాటి దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.ప్రజా పాలన గ్రామసభలు విజయవంతంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, మండల స్పెషల్ ఆఫీసర్ జగదీశ్వర్ రెడ్డి, తహశీల్దార్ కృష్ణయ్య, విలేజ్ స్పెషల్ ఆఫీసర్ సంతోష్, ఏఈఓ వెంకటరెడ్డి, పంచాయతీ సెక్రటరీ రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీను, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రంప్ ఈవెంట్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా నీతా..

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ.. ఆసియాలోనే అత్యంత ధనవంతుడు. ఆ సంపన్నుడి సతీమణి నీతా అంబానీ ఆ రేంజ్‌కు తగ్గట్లే ఉంటుంది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ.. ఆసియాలోనే అత్యంత ధనవంతుడు. ఆ సంపన్నుడి సతీమణి నీతా అంబానీ ఆ రేంజ్‌కు తగ్గట్లే ఉంటుంది. ఎక్కడా ఆమె వైభవం తగ్గదు. రిచ్‌నెస్‌కు కేరాఫ్ అడ్రెస్ ఆమె. ఈవెంట్లకు తగ్గట్టు కట్టూబొట్టుతో ఆకట్టుకుంటుంటుంది. బాలీవుడ్ సినీ సెలబ్రిటీలకు తీసిపోని రీతిలో ఫ్యాషన్‌ను ప్రదర్శిస్తుంటారు. పూజా, వివాహాది కార్యక్రమాలకు సంప్రదాయ చీరకట్టులో దర్శనమిచ్చే నీతా.. బిజినెస్ ఈవెంట్లలో అందుకు తగ్గట్టు దుస్తులను ధరిస్తుంటారు. ఇంకా చెప్పాలంటే ఎక్కువశాతం నీతా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా తనకు ఎంతో ఇష్టమైన చీర కట్టునే తాజాగా మొన్న జరిగిన అమెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకా రోత్సవ కార్యక్రమంలో కూడా నీతా భారతీయ సంప్రదాయమైన చీరకట్టునే ఎంచుకుని మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌ను ప్రదర్శించారు. ట్రంప్ ఇనాగరేషన్‌కు ముందు జరిగిన ప్రైవేట్ రిసెప్షన్‌లో కాంచీపురం సిల్క్ శారీ ధరించి ఆకట్టుకున్నారు. పింక్, గ్రీన్ బోర్డర్‌తో కూడిన నలుపు రంగు పట్టుచీరలో మెరిసిపోయారు. ఈ చీరను తమిళనాడులోని దేవాలయాల శిల్ప కళను ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. ఈ శారీకి ప్రముఖ డిజైనర్ మనీశ్ మల్హోత్ర డిజైన్ చేసిన మోడ్రన్ బ్లౌజ్‌ను ధరించారు. ఇక చీరతోపాటు ఆమె ధరించిన పచ్చల హారం మరింత ఆకర్షణీయంగా కనిపించింది. ఈ నగలకు సుమారు 200 ఏళ్ల నాటి చరిత్ర ఉందట. ప్యారెట్ షేప్‌లో ఉన్న పెండెంట్‌ను ఈ హారానికి జత చేశారు.

ఇక ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక విందులో కూడా నీతా డిజైనర్ శారీలో మెరిసిపోయారు. ఏస్ డిజైనర్ తరుణ్ తహిలియాని డిజైన్ చేసిన కశ్మీరీ ఫ్యాబ్రిక్ చీరను ధరించి ఎంతో అందంగా కనిపించారు. ఈ చీరను దాదాపు 1,900 గంటలపాటు శ్రమించి రూపొందించిందిగా తెలిసింది. ఈ చీరకు తగ్గట్టు నీతా ధరించిన బ్లౌజ్ మరింత ఆకర్షణీయంగా ఉంది. మోడ్రన్ టేపర్డ్ కాలర్డ్ బ్లౌజ్‌కు నెక్‌లైన్ వద్ద చంకీ డైమండ్ బ్రూచ్‌తో ఎంతో అందంగా తీర్చిదిద్దారు.

చీర కంటే ఈ బ్లౌజే చాలా హైలెట్‌గా ఉంది. ఇక చీరకు తగ్గట్టుగానే చెవిపోగులు, రింగ్, బ్యాంగిల్ ధరించింది నీతా. సింపుల్ హెయిర్‌స్టైల్, మేకప్‌తో 60 ఏళ్ల నీతా.. చాలా యంగ్‌గా కనిపించారు. నీతా లుక్ ఈవెంట్‌కు హాజరైన ప్రతి ఒక్కరినీ ఎంతగానో ఆకర్షించింది. ట్రంప్ ఈవెంట్‌లో నీతా అంబానీ హైలెట్‌గా నిలిచారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆ ఫొటోలను చూసిన నెటిజన్లు నీతా ఫ్యాషన్ సెన్స్ గురించే మాట్లాడుకుంటున్నారు.

హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ

హెచ్‌సీఎల్ టెక్నాలజీ.. హైదరాబాద్‌లో నూతన సెంటర్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్స్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నగరంలో కొత్తగా సెంటర్‌ను ఆరంభించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సీ విజయకుమార్ తెలిపారు.

హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ

హెచ్‌సీఎల్ టెక్నాలజీ.. హైదరాబాద్‌లో నూతన సెంటర్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్స్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నగరంలో కొత్తగా సెంటర్‌ను ఆరంభించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సీ విజయకుమార్ తెలిపారు. హై-టెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 5 వేల మంది కూర్చోవడానికి వీలుంటుందన్నారు. విప్రో అనుబంధ సంస్థయైన విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సంస్థ.. హైదరాబాద్‌లో ఐవోటీ ఆధారిత ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో అత్యాధునిక లైటింగ్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు, దేశంలో ఇది రెండో సెంటర్‌ని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అనూజ్ ధీర్ తెలిపారు.

బ్రాండ్లలో మేటి.. భారతీయ ఐటీ

దేశీయ ఐటీ దిగ్గజాలు అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సత్తాచాటాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలువైన సంస్థల జాబితాలో ఐదు సంస్థలు చోటు దక్కించుకున్నాయి. వీటిలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రాలు ఉన్నాయని బ్రాండ్ ఫైనాన్స్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా టాప్-10 విలువైన సంస్థల్లో అమెరికా ఎప్పటిలాగే 40 శాతంతో తొలిస్థానంలో నిలిచింది. 36 శాతం వాటాతో భారత్ ఆ తర్వాతి స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. యూఎస్ టెక్నాలజీ దిగ్గజం యాక్సెంచర్

వరుసగా ఏడోసారి అత్యంత విలువైన సంస్థగా తన స్థానాన్ని కొనసాగించింది. దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 21.3 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువ(11 శాతం ఎగబాకింది)తో రెండో స్థానం దక్కించుకున్నది. వరుసగా నాలుగో సారి ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. మరోవైపు, 2025లో అత్యంతవేగవంతమైన ఐటీ సర్వీసుల బ్రాండ్‌గా హెచ్‌సీఎల్ టెక్నాలజీ అవతరించిందని పేర్కొంది.

గడిచిన ఐదేండ్లుగా తొలిస్థానంలో ఉన్న ఇన్ఫోసిస్‌ను వెనక్కినెట్టి హెచ్‌సీఎల్ ఈ స్థానాన్ని దక్కించుకున్నదని బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మొత్తం ఐటీ విలువల్లో 36 శాతం వాటాతో భారత్ రెండోస్థానంలో కొనసాగుతున్నది. గత కొన్నేండ్లుగా నిరాశాజనక పనితీరు కనబరిచిన అమెరికా మార్కెట్ తిరిగి పుంజుకోవడం దేశీయ ఐటీ సంస్థలకు కలిసొచ్చిందని, ముఖ్యంగా నూతన ఆర్డర్లు రావడంతో దేశీయ ఐటీ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. మూడోస్థానంలో నిలిచిన ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువ 15 శాతం ఎగబాకి 16.3 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే స్థానంలో కొనసాగడం వరుసగా నాలుగోసారి. ఇన్ఫోసిస్ సీఈవో పరేఖ్ నాయకత్వంలో సంస్థ అన్ని విభాగాల్లో రాణిస్తున్నదని, పనితీరు మెరుగుపడటంతోపాటు ఇన్నోవేషన్‌లో దూసుకుపోతున్నదని పేర్కొంది. అలాగే హెచ్‌సీఎల్ టెక్నాలజీ బ్రాండ్ విలువ 17 శాతం ఎగబాకి 8.9 బిలియన్ డాలర్లకు చేరుకోగా, విప్రో విలువ 6 బిలియన్ డాలర్లుకాగా, టెక్ మహీంద్రా కూడా టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. అలాగే టాప్-25 గ్లోబల్ ర్యాకింగ్ సంస్థల్లో తొలిసారిగా హెక్సావేర్ టెక్నాలజీ ప్రవేశించింది.

ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్!

గ్రే మార్కెట్ కార్యకలాపాల నిరోధానికి ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌ను పరిచయం చేసే యోచనలో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఉన్నది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)లో కేటాయించిన షేర్లను ఇన్వెస్టర్లు వెంటనే అమ్ముకునేలా ఓ వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మదాబీ పురీ బచ్ మంగళవారం ఇక్కడ తెలిపారు.

గ్రే మార్కెట్ కార్యకలాపాల నిరోధానికి ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌ను పరిచయం చేసే యోచనలో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఉన్నది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)లో కేటాయించిన షేర్లను ఇన్వెస్టర్లు వెంటనే అమ్ముకునేలా ఓ వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మదాబీ పురీ బచ్ మంగళవారం ఇక్కడ తెలిపారు. తద్వారా గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టాలని చూస్తున్నట్టు చెప్పారు. రెండు అగ్రశ్రేణి ప్రాక్సీ అడ్వైజరీ సంస్థలు ఈ పనిలోనే నిమగ్నమయ్యాయని, త్వరలోనే ఓ పోర్టల్ ప్రారంభం కావచ్చన్నారు. సదరు లావాదేవీలన్నీ ఇందులో నిక్షిప్తమవుతాయని, కంపెనీల్లో పాలనాపరమైన ప్రమాణాలను నిర్వహించడంలోనూ ఇది దోహదపడగలదన్న

దేశీయ స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ఐపీవోలు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే లిస్టింగ్ రోజున భారీ లాభాలనూ నమోదు చేస్తున్న సంగతీ విదితమే. కానీ దీనికి కారణం గ్రే మార్కెట్ కార్యకలాపాలేనని సెబీ అంటున్నది. ఐపీవో ముగిసిన దగ్గర్నుంచి షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదు కావడానికి మధ్య ప్రస్తుతం 3 రోజుల విరామం ఉంటున్నది.

ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ఐపీవోలు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే లిస్టింగ్ రోజున భారీ లాభాలనూ నమోదు చేస్తున్న సంగతీ విదితమే. కానీ దీనికి కారణం గ్రే మార్కెట్ కార్యకలాపాలేనని సెబీ అంటున్నది. ఐపీవో ముగిసిన దగ్గర్నుంచి షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదు కావడానికి మధ్య ప్రస్తుతం 3 రోజుల విరామం ఉంటున్నది. ఈ సమయంలో ఇన్వెస్టర్లు, ఆథరైజ్డ్ కాని డీలర్ల నడుమ అనధికార, నియంత్రణలేని క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

వీటినే గ్రే మార్కెట్ కార్యకలాపాలుగా పేర్కొంటున్నారు. అందుకే అనధికారికంగా జరుగుతున్న ఈ లావాదేవీలకు.. మదుపరులు కోరుకుంటే సక్రమ రీతిలో ఎందుకు జరుగడానికి అవకాశం ఇవ్వొద్దని ఆలోచించామని బచ్ చెప్తున్నారు. ఐపీవోలో షేర్ల కేటాయింపు జరిగిందంటే అది లీగలేనని, వాటిని అమ్ముకునే హక్కు కొన్నవారికి ఉంటుందని చెప్పారు. అందులో భాగంగానే ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌కు అనుమతిచ్చే దిశగా వెళ్తున్నట్టు తెలిపారు.

ట్రంప్ మరో సంచలన నిర్ణయం

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బందికి లేఆఫ్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే ఆ విభాగాల సిబ్బంది అందరినీ సెలవులో ఉంచాలని ఆదేశించారు. ఈ ఆదేశాలతో ట్రంప్ కార్యవర్గం ఉత్తర్వులు జారీ చేసింది.

బుధవారం సాయంత్రం 5 గంటల్లోపు వారందరినీ వేతనంతో కూడిన సెలవుపై పంపించాలని సంబంధిత ఏజెన్సీలకు ఆదేశాలు అందాయి. ఈ విభాగాలకు చెందిన అన్ని వెబ్ పేజీలను కూడా ఈ గడువులోగా పూర్తిగా తొలగించాలని ఉత్తర్వుల్లో ట్రంప్ కార్యవర్గం స్పష్టం చేసింది. అంతేకాకుండా డీఈఐ సంబంధిత శిక్షణ కార్యక్రమాలను కూడా తక్షణమే ముగించాలని ఏజెన్సీలకు సూచించింది. ఈ విభాగాలు చేసుకున్న ఒప్పందాలను కూడా క్యాన్సిల్ చేయాలని ఆదేశించారు. దీంతో ఇప్పటికే కొన్ని వెబ్ సైట్లను అధికారులు తొలగించారు. కాగా, ట్రంప్ అమెరికా 47వ అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. శ్వేతసౌధంలోకి అడుగుపెట్టిన వెంటనే షాకింగ్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. బాధ్యతలు చేపట్టిన గంటల వ్యవధిలోనే గత అధ్యక్షుడు జో బైడెన్ ఇచ్చిన 78 ఆదేశాలను రద్దు చేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేశారు. అంతేకాదు.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా ఉపసంహరణ, క్యాపిటల్ హిల్‌పై దాడి కేసులో 1600 మంది మద్దతుదారులకు క్షమాభిక్ష, జన్మతః పౌరస త్వంపై వేటు వంటి వందకు అంశాలకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు.

ట్రంప్ నిర్ణయంతో అప్రమత్తమైన భారత్..

వారిని వెనక్కి రప్పించే యోచనలో కేంద్రం..!

అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ట్రంప్ చర్యలతో భారత్ ఆచుతూచి నిర్ణయాలు తీసుకుంటోంది.

ట్రంప్ నిర్ణయంతో అప్రమత్తమైన భారత్.. వారిని వెనక్కి రప్పించే యోచనలో కేంద్రం..!

అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా యూఎస్‌లో నివసిస్తున్న వివిధ దేశాలకు చెందిన అక్రమ వలసదారులపై కఠిన వైఖరిని అవలంభిస్తున్నారు. ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అధిక పన్ను విధిస్తున్నారు. తద్వారా వలసలను తగ్గించొచ్చని అధ్యక్షుడు భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో ట్రంప్ చర్యలతో భారత్ ఆచుతూచి నిర్ణయాలు తీసుకుంటోంది. అగ్రరాజ్యంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తోన్న దౌత్య, ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించింది. వాటిపై ఎలాంటి దుష్ప్రభావం పడకుండా జాగ్రత్త పడుతోంది. ట్రంప్ పాలనకు సహకరించేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న తమ పౌరులను స్వదేశానికి రప్పించేందుకు భారత్ యోచిస్తున్నట్లు సమాచారం.

సరైన పత్రాలు లేకుండా దాదాపు 18,000 మంది భారతీయులు అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. అయితే, వాస్తవానికి ఆ సంఖ్య మరింత ఎక్కువ కూడా ఉండొచ్చని అంచనా. తాజాగా కొత్త అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వాళ్లందరినీ వెనక్కి పిలిపించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. దీనికోసం ఓ సమగ్ర ప్రణాళికను రూపొందించబోతోందని పేర్కొన్నారు. కాగా, ఎన్నికల ప్రచారంలో అక్రమ వలసదారులపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

చేసిన విషయం తెలిసిందే. అక్రమ వలసదారులను ర్యాడికల్స్, టెర్రరిస్టులుగా అభివర్ణించారు. అలాంటి వాళ్లు అమెరికా గడ్డపై నివసిం చేందుకు ఏమాత్రం అర్హులు కాదని వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వలసలపై ఉక్కుపాదం మోపుతానని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జన్మతః పౌరసత్వ హక్కును కూడా రద్దు చేశారు. అమెరికా పౌరులకు పుట్టిన వారికే కాకుండా.. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది. 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అప్పటి నుంచి ఈ జన్మతః పౌరసత్వ విధానం కొనసాగుతున్నది. అయితే, దీన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించబోదు' అని ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనున్నట్టు నిపుణులు చెప్తున్నారు. ఇక ట్రంప్ చర్యల నేపథ్యంలో అప్రమత్తమైన భారత ప్రభుత్వం భారతీయులను తిరిగి వెనక్కి రప్పించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

76కి పెరిగిన స్కీ రిసార్ట్ మృతుల సంఖ్య..

కొనసాగుతున్న సహాయక చర్యలు వాయువ్య టర్కీ లోని ప్రముఖ స్కీ రిసార్ట్‌లోని హోటల్‌లో మంగళవారం ఘోర అగ్ని ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. వాయువ్య టర్కీలోని ప్రముఖ స్కీ రిసార్ట్ లోని హోటల్‌లో మంగళవారం ఘోర అగ్ని ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ అగ్నిప్రమాద ఘటనలో మరణించిన వారి సంఖ్య 76కి పెరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గాయపడిన దాదాపు 51 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బోలు ప్రావిన్స్‌లోని కర్తాల్కాయ రిసార్ట్‌లోని 12 అంతస్తుల గ్రాండ్ కర్తాల్ హోటల్ రెస్టారెంట్‌లో తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రమాదం జరిగిన సమయంలో 234 మంది హోటల్‌లో ఉన్నారు.

ఇజ్రాయెల్ సైన్యాధిపతి రాజీనామా

ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొద్ది గంటల్లోనే.. ఇజ్రాయెల్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ దేశ సైన్యాధిపతి హెర్జి హాలివీ రాజీనామా ప్రకటించారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొద్ది గంటల్లోనే.. ఇజ్రాయెల్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ దేశ సైన్యాధిపతి హెర్జి హాలివీ రాజీనామా ప్రకటించారు. మార్చి 6న తాను బాధ్యతల నుంచి వైదొలగుతున్నట్టు మంగళవారం తెలిపారు. గతేడాది అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్స్ దాడిని పసిగట్టడంలో, అడ్డుకోవటంలో విఫలమైనందుకు రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. ఆనాటి దాడి నుంచి ఇజ్రాయెల్‌కు రక్షణ కల్పించటంలో తన మిషన్ విఫలమైందని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మరో ఉన్నతాధికారి మేజర్ జనరల్ యారోన్ ఫింకెల్‌మాన్‌లు కూడా బాధ్యతల నుంచి తప్పుకుంటూ రాజీనామా సమర్పించారు. ఆనాటి హమాస్ దాడి వైఫల్యాలపై విచారణ జరపాలన్న డిమాండ్ ఇజ్రాయెల్‌లో ఊపందుకుంది.

పౌరసత్వం రద్దుపై భారత సంతతి చట్టసభ ప్రతినిధుల ఆందోళన

జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇచ్చిన ఆదేశాలను భారతీయ సంతతి రాజకీయవేత్తలు తప్పుపట్టారు. ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని భారత సంతతి చట్టసభ ప్రతినిధులు రో ఖన్నా, శ్రీ థానేదార్, ప్రమీలా జయపాల్ లాంటివారు డిమాండ్ చేశారు. పౌరసత్వం రద్దుపై భారత సంతతి చట్టసభ ప్రతినిధుల ఆందోళన ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారీ చేశారు. దీని వల్ల అక్రమ వలసదారులతో పాటు విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌కు ఆటంకాలు ఎదురుకానున్నాయి. వలసదారులకు పుట్టే పిల్లలకు జన్మతః పౌరసత్వం రాదు అని ట్రంప్ తాజా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆ ఆదేశాలను భారతీయ సంతతి రాజకీయవేత్తలు తప్పుపట్టారు. అమెరికా చట్టసభప్రతినిధి రో ఖన్నా మాట్లాడుతూ.. బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ రద్దు వల్ల హెచ్1బీ వీసాలపై ఉంటున్న వారి పిల్లలకు కూడా ప్రభావం పడుతుందన్నారు. హెచ్1బీ వీసాలపై అమెరికాలో పనిచేసే భారత్, చైనీయులు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. అయితే చట్టపరంగా వలసవచ్చినవారితో పాటు తాత్కాలికంగా స్టూడెంట్ వీసాలపై ఉన్న వారికి కూడా బర్త్‌రైట్ సిటిషన్‌షిప్ రద్దుతో ఇబ్బందులు ఎదురవుతాయని రో ఖన్నా తెలిపారు. ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు ఎలా ఉన్నా.. జన్మతః పౌరసత్వం హక్కు కోసం పోరాటం చేస్తానని, ఎన్ని అవరోధాలు ఎదురైనా, ఆ చట్టం కోసం ఫైట్ చేస్తానని మరో భారత సంతతి ప్రతినిధి శ్రీ థానేధార్ తెలిపారు. జన్మతః పౌరసత్వంపై ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రమీలా జయపాల్ తెలిపారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకం అని, కేవలం ఓ పెన్ను సంతకంతో దాన్ని రద్దు చేయలేమని, ఒకవేళ ఆ చట్టాన్ని ఆమోదిస్తే, అప్పుడు రాజ్యాంగాన్ని అవమానించినట్లు అవుతుందన్నారు. ఇమ్మిగ్రేషన్ రైట్స్

గ్రూపులు.. ట్రంప్ ఆదేశాలకు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేసినట్లు ప్రమీలా తెలిపారు. జన్మతః పౌరసత్వ రద్దు ఆదేశాల ప్రకారం.. ఒకవేళ పేరెంట్స్ అమెరికా పౌరులు లేదా పర్మనెంట్ రెసిడెంట్ కాకుంటే, అప్పుడు 2025, ఫిబ్రవరి 19వ తేదీ తర్వాత పుట్టే పిల్లలకు ఆటోమెటిక్‌గా పౌరసత్వాన్ని ఇవ్వబోమని పేర్కొన్నారు. ట్రంప్ ఆదేశాలను సవాల్ చేస్తూ 22 రాష్ట్రాల్లో అటార్నీ జనరల్స్ కేసులు దాఖలు చేశారు. 14వ సవరణ ప్రకారం అమెరికాలో జన్మించే పిల్లలకు ఆటోమెటిక్‌గా పౌరసత్వం వస్తుంది. అయితే 18 రాష్ట్రాలు, రెండు నగరాలు ఆ సవరణను ప్రస్తావిస్తూ కోర్టులో కేసు వేశాయి.

ప్రొఫెసర్ క్లాస్ శ్వాబ్ తో చారిత్రాత్మక భేటీ

మంత్రి శ్రీధర్ బాబుకి దక్కిన అరుదైన గౌరవం

మంథని, (జనంసాక్షి)

తెలంగాణను అంతర్జాతీయ వేదికపై నిలబెట్టడంలో మంత్రి శ్రీధర్ బాబు దూరదృష్టి, నాయకత్వం ప్రత్యేకంగా ప్రశంసనీయం. ఈ సమావేశం ఆయన ప్రతిభను చాటిచెప్పే ఘట్టంగా నిలుస్తోంది. దావోస్‌లో జరిగిన ఈ చారిత్రాత్మక భేటీతో, ప్రపంచ ఆర్థిక వేదికపై తెలంగాణను ప్రభావశీల గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టేందుకు శ్రీధర్ బాబు ప్రయాణం మరింత వేగవంతమైంది. ప్రపంచ ఆర్థిక వేదిక వ్యవస్థాపకుడు, ప్రపంచ ఆర్థిక విధానాలను ఆవిష్కరించిన గొప్ప మహనీయుడైన ప్రొఫెసర్ క్లాస్ శ్వాబ్ తో తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దావోస్‌లో నిర్వహించిన చారిత్రాత్మక సమావేశం తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతున్న దశలో మరొక ముఖ్య ఘట్టంగా నిలిచింది. ఈ సమావేశం తెలంగాణ భవిష్యత్తును అంతర్జాతీయ స్థాయిలో మరింత పైకి తీసుకెళ్లే ప్రణాళికలకు బలమైన పునాది వేయనుంది. ప్రొఫెసర్ క్లాస్ శ్వాబ్ ప్రపంచ ఆర్థిక వేదికను స్థాపించి, నాల్గవ పారిశ్రామిక విప్లవానికి నాంది పలికిన స్ఫూర్తిదాయక నేత. ప్రపంచ ఆర్థిక విధానాలను, సాంకేతిక అభివృద్ధిని, స్థిరమైన అభివృద్ధిని సమన్వయం చేసే ఆయన దూరదృష్టి, ఆలోచనా సరళి ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రభుత్వాలకు, పరిశ్రమలకు మార్గ నిర్దేశం చేస్తోంది. ప్రొఫెసర్ క్లాస్ శ్వాబ్ తెలంగాణ ప్రగతిని అత్యంత ప్రశంసనీయంగా అభివర్ణిస్తూ, ఈ రాష్ట్రం నాల్గవ పారిశ్రామిక విప్లవంలో ముందంజలో నిలుస్తుందని, భవిష్యత్ ఆర్థిక విధానాలను ప్రభావితం చేసే శక్తిగా మారనున్నదని పేర్కొన్నారు. పారిశ్రామిక విప్లవం, సాంకేతిక మార్పుల్లో తెలంగాణ చూపుతున్న నైపుణ్యం ప్రపంచానికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. దావోస్ నుండి తెలంగాణ భవిష్యత్తు అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందుతోంది. ఈ చారిత్రాత్మక సమావేశం తెలంగాణను ప్రపంచ ఆర్థిక వృద్ధిలో ప్రధాన భాగస్వామిగా మార్చే దిశగా కీలకంగా మారనుంది. భారత ఆర్థిక వ్యవస్థకు తెలంగాణ ముఖ్య కేంద్రంగా అవతరించడానికి, అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ప్రతిభను చాటిచెప్పేలా ఈ భేటీ కీలక పాత్ర పోషించనుంది.

ప్రభుత్వ పథకాల దరఖాస్తులకు నిరంతర ప్రక్రియ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 22 (జనం సాక్షి)

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల కోసం గత ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని వారు ఈ గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం తాడ్వాయి మండలం బ్రహ్మాజీవాడ గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామ సభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఇట్టి పథకాలలో అర్హత కలిగిన వారి పేర్లు రానివారు దరఖాస్తులు ఆయా కౌంటర్ లలో సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తులు తీసుకోవడం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. గ్రామ సభల్లోనే కాకుండా ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్ లో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఇపుడు సమర్పిస్తున్న దరఖాస్తుల పై పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సభల్లో చదివిన జాబితాలపై అభ్యంతరాలు, ఆక్షేపణలు, చేర్పులు ఉంటే పూర్తివివరాలు గ్రామ సభలో తెలియజేయవచ్చని తెలిపారు. అనంతరం వివిధ పథకాల కోసం ఏర్పాటుచేసిన కౌంటర్ లను కలెక్టర్ పరిశీలించారు. ఈ గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, పంచాయతీ కార్యదర్శి రేణుక, వ్యవసాయ అధికారి నర్సింలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

కరీంనగర్ బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) :

నగరంలోని 54 , 60 డివిజన్లలో ప్రజా పాలన డివిజన్ సభల్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. సభల్లో స్వయంగా సుడా చైర్మన్ లబ్ది దారుల నుండి దరఖాస్తులు తీసుకొని వారి అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... అర్హులైన లబ్దిదారులందరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వటమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అధికారులు ప్రకటించిన లిస్టులో పేరు లేకపోతే రానట్టు కాదని మళ్లీ ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న గాని వార్డు అధికారికి గాని మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాగాని మళ్లీ పరిశీలించి అర్హులందరికీ ఇవ్వడం జరుగుతుందని నరేందర్ రెడ్డి అన్నారు. పదేళ్లలో ఒక్క ఇల్లు ఇవ్వకుండా ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా ఏముఖం పెట్టుకొని పని చేసే ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఈ ప్రభుత్వం ఆదుకుంటుందని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాలలో టిపిఎస్ తేజస్విని, వార్డు అధికారులు మోసిన్, శ్రీనివాస్, ఎండి తాజ్, కార్పొరేటర్లు ఇఫ్రాన్ తహర్, వాల రమణారావు, కలిమొద్దిన్, పెద్దిగారి తిరుపతి, అహ్మద్‌అలీ, రాజ్ కుమార్, ఆరిఫ్, కొట్టె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చిక్కిన భారీ చేప

ముత్తారం, జనవరి 22(జనంసాక్షి)

మండలం ఓడేడ్ గ్రామ శివారులోని తుమ్మలకుంట చెరువులో మత్స్యకారుడి వలకు భారీ చేప చిక్కింది. ఓడేడ్ తుమ్మలకుంట చెరువులో గతకొన్ని రోజులుగా మత్స్యకారులు చేపలు పడుతున్న సందర్భంలో బుధవారం రోజున మత్స్యకారుడి వలలో సుమారు 12 కిలోల అతిపెద్ద చేప పడింది. ఈ భారీ చేప చెరువులో కనపడడం ఇదే మొదటిసారి అని మత్స్యకారులు తెలిపారు. భారీ చేప దొరకడంతో మత్స్యకారులు ముదిరాజ్ లు సంతోషం వ్యక్తం చేశారు.

అర్హులు ఆందోళన చెందవద్దు

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

నడికూడ, జనవరి 22 (జనం సాక్షి):

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతాయని, ప్రభుత్వ పథకాల విషయంలో ఎవరు కూడా ఆందోళన చెందవద్దని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా నడికుడ మండలం రాయపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన గ్రామసభ ను నిర్వహించారు. ఈ గ్రామ సభ లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి రూపొందించిన ముసాయిదా జాబితాలోని పేర్లు చదివి వినిపించారు. గ్రామసభ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నాలుగు ప్రభుత్వ పథకాలకు సంబంధించి ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే గ్రామపంచాయతీ కార్యదర్శి కి లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న వారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి హెల్ప్ డెస్క్ లో దరఖాస్తులను అందించాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కె. నారాయణ, తహసీల్దార్ నాగరాజు, మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఇతర అధికారులు, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకులంలో మౌలిక సదుపాయాలు కల్పించండి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 22 (జనంసాక్షి)

గురుకులంలో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు కు చర్యలు చేపట్టాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. బుధవారం దౌల్తాబాద్ మండలంలోని కెజిబివి బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల పరిసరాలను, వంట గదులను, వంట సామాగ్రిని,బియ్యంను, డార్మెంటరీ రూమ్ లను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఇచ్చే త్రాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు హెచ్ టు ఎస్ టెస్ట్ వైల్ ద్వారా పరీక్షించి త్రాగు నీరును ఇవ్వాలని సూచించారు. పాఠశాలలో స్నానాల గదులను ఏర్పాటు చేయాలనీ, బెడ్స్, ల్యాబ్, వంట సామాగ్రి ఏర్పాటు చేయాలనీ

విద్యార్థులు కలెక్టర్ ను కోరగా, విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అంచనా ప్రకారం ప్రణాళిక తయారు చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మరమ్మత్తు పనులు చేయించేందుకు కావలసిన నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పిస్తే నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం తిమ్మాయిపల్లి గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణాపనులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి ఉపయోగపడే విధంగా నిర్మాణ పనులు జరగాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తో పాటు కడ అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ గాయత్రి, ఎస్ఐ రవి గౌడ్,ఇంచార్జి ప్రిన్సిపల్ బసమ్మ, ఏంపిడిఓ శ్రీనివాస్, సుదర్శన్ విద్యార్థులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, జనవరి 22, (జనంసాక్షి)

ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బుధవారం ఆయన బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం అచ్చులా పూర్, తాండూర్ మండల కేంద్రం, బెల్లంపల్లి పట్టణం 22వ వార్డులో ఏర్పాటు చేసిన గ్రామసభ, వార్డుసభల్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాలుగు పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డ్ అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని సదుద్దేశంతో ఉందని అన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని, ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. అధికారుల వద్ద ఉన్న జాబితాలో పేరులేని పథకాలకు అర్హులైన లబ్ధిదారులను దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మున్సిపల్ చైర్పర్సన్ జక్కుల శ్వేతా, తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ పఠాన్, బెల్లంపల్లి తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవోలు, గ్రామపంచాయితీ స్పెషల్ ఆఫీసర్లు, గ్రామ పంచాయతీ సెక్రెటరీలు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ లో ప్రసవం.. తల్లి బిడ్డ క్షేమం

రుద్రంగి, జనవరి 22(జనం సాక్షి)

పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ అంబులెన్స్ లో ఆసుపత్రికి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రసవించిన ఘనట రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం జరిగింది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన సూర శృతి(21) అనే గర్భిణి మంగళవారం రాత్రి సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి. గర్భిణి కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించగా అంబులెన్స్ లో వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో శృతికి పురిటి నొప్పులు అధికం కావడంతో మల్యాల గ్రామం శివారులో వాహనాన్ని ఆపి అంబులెన్స్ లో నే ఈఎంటీ గణేష్ నాయక్, పైలేట్ మహేష్, ఆశాకార్యకర్త లక్ష్మీతో కలిసి అంబులెన్స్ లో సుఖ ప్రసవం చేశారు. శృతి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని వైద్య సిబ్బంది తెలిపారు.

మాస్టర్ ప్లాన్ రద్దుకు కృషి చేస్తాం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 22 (జనం సాక్షి)

మాస్టర్ పాన్ ను రద్దు చేసేందుకు కృషి చేస్తామని, రైతన్నలకు అండగా ఉంటామని, రైతులు అధైర్యపడవద్దని, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ అన్నారు. ఆయా గ్రామాల రైతులతో ఆమె మాట్లాడుతూ నేను కూడా రైతు బిడ్డనే నని నా వంతు రైతన్నలకు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలియజేశారు. ఈ యొక్క మాస్టర్ ప్లాన్ రద్దు విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు వద్దకు వెళ్లి మాస్టర్ ప్లాన్ రద్దు చేయిస్తామని, తెలియచేసారు. కార్యక్రమంలో, మున్సిపల్ కమిషనర్ స్పందన,కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, రైతన్నలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సోమతలేక ఆగిన నిరుపేద గుండె

గంభీరావుపేట జనవరి 22 (జనం సాక్షి):

ఆర్థిక స్తోమత లేక హాస్పిటల్లో వెళ్లలేని స్తోమత లేక ఒక నిరుపేద గుండె ఆగింది. ఈ ఘటన గంభీరావుపేట మండలంలోని, బరిగెలగూడెం కాలనీ లోని ఎర్రోల్ల బాల నర్సు అనే వ్యక్తి గత వారం రోజులుగా హై బిపితో హైదరాబాదులోనే ఉస్మానియా హాస్పిటల్లో చికిత్స పొందుతూ మరణించాడు. అతనికి భార్య ఇద్దరు కూతుళ్లు, ఆర్థిక ఇబ్బంది వల్ల కార్పొరేట్ హాస్పిటల్ పోక ,ఆర్థిక సమస్యల వల్ల ఒక నిండు ప్రాణాన్ని కోల్పోయారు. చిన్న కూతురు తలకొరివి పెట్టింది చూస్తూ కాలనీవాసులుశోకసముద్రంలో మునిగిపోయారు.

భూమి పుత్రిక పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది

రుద్రంగి జనవరి 22 (జనం సాక్షి)

రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం స్థానిక కవయిత్రి అంగల శ్రీవాణి రచించిన భూమి పుత్రిక పుస్తకాన్ని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రుద్రంగి గ్రామానికి చెందిన శ్రీవాణి భూమి పుత్రిక కవిత సంపుటి పుస్తకాన్ని రచనలు చేసినందుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నానని, మున్ముందు మరిన్ని పుస్తకాలు రచనలు చేయాలని వాటికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ, నాయకులు తదితను పాల్గొన్నారు.

ప్రాణం 'ఖరీదు' రూ.3లక్షలు..?

- ఇది 'యోధ' హాస్పిటల్ నిర్వాకం..
- చేతులు దులుపుకునే ప్రయత్నంలో యాజమాన్యం
- పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం..
- స్టాఫ్ నర్స్ మృతిపై చిక్కుముడి వీడినట్లేనా.. ?

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):

స్టాఫ్ నర్సు మృతికి కారణమైన 'యోధ' హాస్పిటల్ యాజమాన్యం ప్రాణానికి ఖరీదు మాట్లాడినట్లు తెలిసింది. ఎస్ కె అప్సర్ బీ మృతితో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. ఇది ఆసరాగా చేసుకున్న హాస్పిటల్ యాజమాన్యం మధ్య దళారులను బరిలో దింపి రూ.3లక్షలకు బేరం కుదుర్చుకుని విడతలవారిగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. ప్రాణానికి రేటు చెల్లించి, హాస్పిటల్ యాజమాన్యం చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

ఎస్.కె అప్సర్ బీ అనే మహిళ భర్తతో విడిపోయి, తల్లిదండ్రులు మదర్, సుల్తాన్ బీ లతో కలిసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నివాసం ఉంటూ, తన పదేళ్ల కుమారుడిని చదివించుకుంటూ, తల్లిదండ్రులను పోషించేది. కాగా జిల్లా కేంద్రంలోని యోధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో అప్సర్ బీ సుమారు మూడు సంవత్సరాల నుండి స్టాఫ్ నర్స్ గా పనిచేస్తూ వచ్చిన వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్న క్రమంలో గత నవంబర్ 29న రాత్రి నైట్ డ్యూటీ లో భాగంగా హాస్పిటల్ కు వెళ్ళింది. ఈ క్రమంలో అప్సర్ బీ కి ఆ రాత్రి ఏమైందో తెలియని పరిస్థితి ఏర్పడింది. తెల్లారేసరికి అప్సర్ బీ మృతిచెంది కనిపించింది. హాస్పిటల్ లో వాంతులు అయ్యాయని, కళ్ళు తిరిగి పడిపోయిందని, స్థానిక హాస్పిటల్ సిబ్బంది చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. తన కూతురు చావుకు హాస్పిటల్ యాజమాన్యమే కారణమని మృతురాలు తల్లి అదే రోజు ఆరోపించింది. ఈ క్రమంలో సీసీ టీవీ ఫుటేజ్, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అప్పట్లో పోలీసులు చెప్పారు. ఈ పరిస్థితుల్లో తమ మెడకు ఉచ్చు బిగుస్తుందని భావించిన యాజమాన్యం మధ్య దళారులను రంగంలోకి దింపింది. ప్రాణానికి రూ.3లక్షలు ఖరీదు మాట్లాడి, విడతలుగా చెల్లిస్తామని ఒప్పందం చేసుకుని, కేసు నుండి బయటపడే ప్రయత్నాలు జరుపుతున్నట్లు తెలిసింది. ప్రాణాలను కాపాడాల్సిన యోధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఓ ప్రాణం పోవడానికి కారకులై, ఖరీదు చెల్లించి తమ స్పెషాలిటీ సత్తా చూపిస్తున్నారనే ఆరోపణలు జిల్లాకేంద్రంలో వినిపిస్తున్నాయి. ప్రాణాలను రక్షించలేని ఇలాంటి హాస్పిటల్స్ ను శాశ్వతంగా మూసివేయించి, మరోమారు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని, మృతురాలు కుటుంబానికి మరో రూ.20లక్షల పరిహారం ఇప్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గురుకుల పాఠశాల్లలోని సమస్యలు పరిష్కరించాలి

ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్

బెల్లంపల్లి, జనవరి 22, (జనంసాక్షి)

తెలంగాణ రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సిఓ గోపీచంద్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురుకులాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని, ఫ్యాకల్టీ లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రైవేట్ భవనాలలో గురుకులాలను కొనసాగించడం వల్ల సరైన సమయంలో అద్దె చెల్లించకపోవడం వల్ల భవన యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సదుపాయాలు కల్పించడం లేదని కామన్ మెనూ అమలుపరచడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆహారాన్ని అందించాలని, పక్క భవనాలు నిర్మించే దిశగా పూనుకోవాలని, గురుకులాలను దేశానికి మార్గదర్శకంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అల్లి సాగర్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, తెలంగాణ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కాంతి కుమార్, తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాయిని మురళి శ్రావణ్ పాల్గొన్నారు.

చెట్లను నరికిన వ్యక్తుల అరెస్ట్

ఖానాపూర్ జనవరి 22 (జనంసాక్షి)

12 మంది వ్యక్తులు, మూడు వాహనాల గుర్తింపు
ముగ్గురి అరెస్ట్, ఒక్క వాహనం సీజ్
కఠిన చర్యలకై కోర్టుకు నివేదిస్తాం : అటవీ క్షేత్ర అధికారి కిరణ్

గత నెల 19న ఖానాపూర్ అటవీ క్షేత్రం పరిధిలోని తర్లపాడు బీట్ లో అక్రమంగా చెట్లను నరికిన ఘటన పాఠకులకు విద్యుతమే. ఈ నేరానికి సంబంధించి అటవీ అధికారులు పక్కా పకడ్బందీ ప్రణాళికతో సైంటిఫిక్ ఆధారాలతో విచారణ చేపట్టారు. అందులో భాగంగా బుధవారం చెట్లను నరికిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్న సందర్భంగా అటవీ క్షేత్రాధికారి కార్యాలయంలో అటవీ క్షేత్రాధికారి కిరణ్ విలేకరులకు ఘటన వివరాలను వెల్లడించారు. గత నెల 19వ తారీఖున అక్రమంగా అటవీ సంపదపై దాడికి తలపడి ప్రత్యేక వాహనాలలో దుంగలను తరలించారని తెలిపారు. కూలంకుశంగా విచారణ చేపట్టిన అధికారులకు దుండగులు పట్టుపడ్డారు. పట్టుబడిన వ్యక్తులను విచారించగా ఈ నేరంలో 12 మంది నేరస్తుల పాత్ర ఉన్నట్లు గుర్తించామని అన్నారు. అలాగే మూడు వాహనాలు గుర్తించినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురు దుండగులు గండిగోప్పుల నగేష్, దోసండ్ల శ్రీనివాస్ లు కడెం మండలానికి చెందినవారు కాగా మధిర రాజగోపాల్ మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందినవారని అన్నారు. కలపను తరలించిన నకిలీ నంబర్ తో కూడిన ఒక టాటా ఇండికా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. అలాగే జన్నారం మండలంలోని టీజీపల్లి గ్రామానికి చెందిన సంజు, సతీష్ సోదరులతో పాటు దస్తురాబాద్ మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన ఏంబడి శేఖర్ లను ప్రధాన నేరస్తులుగా గుర్తించామని, వీరితోపాటు కలప కొనుగోలు చేసిన మంచిర్యాల పట్టణానికి చెందిన జగదీశ్వర్, మహేందర్ రెడ్డి లపై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. విచారణ ముమ్మరం చేసి మిగిలిన రెండు వాహనాలతో పాటు, తొమ్మిది మందిని కూడా త్వరలోనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తామని తెలిపారు. అరెస్ట్ అయిన వారిని కఠినంగా శిక్షించేందుకు కోర్టుకు నివేదిస్తామని ఆయన స్పష్టం చేశారు. అరెస్టు అయినవారు గతంలో పోలీస్ స్టేషన్ లో, అటవీ శాఖలో వివిధ నేరాలకు పాల్పడి కేసులలో ఉన్నవారేనని అన్నారు. టేకు దొంగలను నరికి వేయడంతో పాటు వాటిని కొనుగోలు చేసిన వారిపై కూడా కేసులు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. దుండగులను ఛేదించుటలో ప్రధాన పాత్ర పోషించిన అటవీ సెక్షన్ అధికారి రవీందర్, కుత్బుద్దీన్, డిప్యూటీ అటవీ క్షేత్ర అధికారి మహేష్ లతోపాటు బీట్ అధికారులు నరేందర్, మోయిద్, రామచందర్, ముత్యం, నారాయణ లను అటవీ క్షేత్రాధికారి అభినందించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

రాయపర్తి,జనవరి 22(జనంసాక్షి):

కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.రాయపర్తి మండలం కొలన్ పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభలో పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వావలంబన కోసం ఆత్మీయ భరోసా పథకం ద్వారా వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామపెద్దలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

గందరగోళం మధ్యన గ్రామసభలు

అర్హులను పక్కన పెట్టారంటూ అధికారులను నిలదీసిన ప్రజలు

చిగురుమామిడి, జనవరి 22(జనం సాక్షి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన గ్రామసభల ద్వారా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఎంపికకు చిగురుమామిడి మండలంలోని లంబాడి పల్లె, సీతారాంపూర్, నవాబుపేట, ముదిమాణిక్యం, గాగిరెడ్డి పల్లె గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు గందరగోళం మధ్యన జరిగాయి. ఈ పథకాలకు అర్హులైన అనేకులు ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో తమ పేర్లు రాకపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ అధికారులు వారిని శాంతింపజేసి అర్హులు మరల ఈ పథకాలకు తమ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. చిగురుమామిడి మండల కేంద్రంలో వేదికపై కాంగ్రెస్ నాయకులు కూర్చోవడంపై అధికారులను బిజెపి, టిఆర్ఎస్ నాయకులు నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కనుసన్నల్లో లబ్ధిదారులను ఎంపిక చేశారని వారు ఆరోపించారు.

వర్షా మేడం సేవలపై ప్రజల హర్షం

హైదరాబాద్ నుంచి ప్రత్యేక నిపుణులచే కంటి చికిత్సలు

సందర్శించిన ఎమ్మెల్యే దంపతులు, కలెక్టర్

బెల్లంపల్లి, జనవరి 22, (జనంసాక్షి)

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తనయ గడ్డం వర్షా మేడం సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల ప్రజలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే తనయ వర్షా వరుణ్ దంపతుల ఆధ్వర్యంలో నవంబర్ 16న ఉచిత కంటి పరీక్షలు చేయించారు. జనవరి 13న కంటి పరీక్షల్లో కంటి అద్దాలు అవసరం ఉన్నవారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. బుధవారం రోజు బెల్లంపల్లి పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిలో హైదరాబాద్ లోని ప్రత్యేక కంటి నిపుణులు డాక్టర్ అజయ్ చక్రవర్తి ఆధ్వర్యంలో వంద మందికి పైగా కంటి ఆపరేషన్లు చేయించారు. ఇలా ఒక్కో మండలం వారీగా మొత్తం నియోజకవర్గం వ్యాప్తంగా అందరికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా అద్దాలు, కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు ఎమ్మెల్యే దంపతులు వినోద్ రమ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వినోద్ ఆసుపత్రి వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, మున్సిపల్ చైర్పర్సన్ జక్కుల శ్వేతా, నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలు తిని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

గృహ విజ్ఞాన శాస్త్రవేత్త అరుణ్ జ్యోతి

రాయపర్తి,జనవరి 22(జనంసాక్షి):

చిరు ధాన్యాలు తిని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం మామూనూర్ గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణ్ జ్యోతి అన్నారు.కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గణేష్ కుంట తండాలో విలువ ఆధారిత చిరు ధాన్యాలపై తండా వాసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణలో భాగంగా మొదటి రోజు చిరు ధాన్యాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.చిరు ధాన్యాలు తినడం వల్ల షుగర్ లాంటి వ్యాధుల భారిన పడకుండా ఉండే అవకాశం ఏర్పడుతుందన్నారు.చిరు ధాన్యాల సాగు సైతం చేపట్టడం వల్ల కొంత ఎక్కువ మోతాదులో తినే అవకాశం ఏర్పడుతుందన్నారు.చిరు ధాన్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,తండా వాసులు మున్యా నాయక్,మునావత్ రవి నాయక్, జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ కోరారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా నారాయణ పేట ఆర్టీవో శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ,ఎస్పీ యోగేష్ గౌతమ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యత అన్నారు. సమిష్టి కృషితోనే ప్రమాదాలను నివారించ వచ్చని చెప్పారు. విద్యార్థు లకు రోడ్డు ప్రమాదాల గురించి స్కూలు కళాశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో పోయిన సంవత్సరం 250 వరకు రోడ్డు ప్రమాదాలు జరిగాయని అందులో 102 మంది చనిపోవడం జరిగిం దని,ఈసారి రోడ్డు ప్రమాదా లను గణనీయంగా తగ్గించ డానికి అన్ని శాఖల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగా హన కార్యక్రమాలు నిర్వహి స్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ఏర్పాటు చేసిన వాల్పోస్టర్ ను ఆవిష్కరిం చారు. రోడ్డు భద్రత మాసోత్సవాల పై ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా ఎస్పీ తో కలసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మినీ స్టేడియం నుంచి ప్రారం భమైన ర్యాలీ మనోహర్ థియేటర్ నుంచి పాత బస్టాం డ్, సత్య నారాయణ చౌరస్తా మీదుగా తిరిగి మినీ స్టేడియా నికి చేరుకుంది. ఈ కార్యక్ర మంలో మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, ఆర్టీవో మేఘా గాంధీ, డీఎస్పీ నల్లపు లింగ య్య, ఆర్టీసీ డిఎం లావణ్య, డీఈవో గోవిందరాజులు, మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి,వైస్ చైర్మన్ కొనంగేరి హనుమం తు, సిఐ శివశంకర్, ఎస్. ఐ. వెంకటేశ్వర్లు, ఆర్టీవో కార్యా లయ, పోలీసు అధికారులు, సిబ్బంది, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలి

కేటీకే -5 గని మేనేజర్ జాకీర్ హుస్సేన్

భూపాలపల్లి, జనవరి 22 (జనం సాక్షి):

భూపాలపల్లి ఏరియా సింగరేణి కాలరీస్ కేటికే 5 ఇంక్లీన్ గని లో 2024 సంవత్సరంలో 101 కన్నా తక్కువ హాజర్లు చేసిన కార్మికులకు వారి కుటుంబ సభ్యుల సమక్షం లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా గని మేనేజర్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ కార్మికులు ఇప్పటికైనా క్రమం తప్పకుండ విధులకు హాజరై డిస్మిస్ కాకుండా చూసుకోవాలి కోరారు. కార్మికులు విధులకు హాజరు కాకుండా సంస్థ నిబంధనలను ఉల్లంగిస్తే చర్యలు తీసుకునే ఆవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమ్ ద్వారా కార్మికులు తమ భాద్యతను గుర్తించి సంస్థ అభివృద్ధి కి తోడ్పడే ల నడుచుకోవాలి తెలిపారు. గని వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్ కుమార్, గుర్తింపు సంఘ పిట్ సెక్రెటరీ దోర్నాల తిరుపతి, ప్రాతినిత్య సంఘ పిట్ సెక్రెటరీ చుంచుల గట్టు రాజు, క్లర్క్ రవి పాల్గొన్నారు. 20 మంది కార్మికులు వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 జనవరి 2025

త్వరలో 6 కేజీల సన్నబియ్యం పంపిణీ

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
- రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిది/రుద్రంగి జనవరి 22 (జనంసాక్షి) : రాష్ట్రంలోనే చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.బుధవారం రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝలతో కలిసి రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు,రైతులకు, రైతు కూలీలకు,నిరుద్యోగులకు , పేదలకు ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం స్వతంత్ర భారతదేశంలో చేయలేదన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, గత 10 సంవత్సరాల కాలంలో ఎప్పుడు ఈ స్థాయిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, కేవలం 40 వేల కార్డులు మాత్రం అందించారన్నారు.జనవరి 26 నా ప్రారంభించి రాష్ట్రంలో అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డు వచ్చే వరకు ప్రక్రియ కొనసాగుతుందని, రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, ప్రజా పాలన కేంద్రాలలో దరఖాస్తు చేసిన, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసినా, గ్రామ సభలలో దరఖాస్తు ఇచ్చిన విచారించి అర్హత మేరకు కార్డులు మంజూరు చేస్తామన్నారు. గ్రామ సభలో ప్రకటించే ప్రాథమిక జాబితాలో పేరు లేని పక్షంలో దరఖాస్తు సమర్పిస్తే అర్హతను పరిశీలించి రేషన్ కార్డు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు మండల కేంద్రాలు మున్సిపాలిటీలలో ఉన్న ప్రజాపాలన కేంద్రాలలో కూడా దరఖాస్తులు ఇవ్వాలన్నారు.రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రస్తుతం దొడ్డు బియ్యం సరఫరా అవుతున్నాయని, వీటిని చాలా మంది తినడం లేదని, నూతన రేషన్ కార్డుల జారీ తరువాత ప్రతి ఒక్కరికి 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేస్తామన్నారు.ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో సాచురేషన్ పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మించామని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మరోసారి ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే సొంత ఊరు కాబట్టి ఇక్కడ 100 శాతం అర్హులకు మొదటి దఫాలోనే ఇండ్లు మంజూరు అవుతాయన్నారు.సొంత జాగా ఉండి ఇండ్లు లేని వారికి రూ 5 లక్షలు అందిస్తున్నామని,ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ 6 లక్షలు అందజేస్తామన్నారు.రైతు భరోసా కింద రైతులకు అందే సహాయం 20 శాతం పెంచి ఎకరానికి రూ 12 వేలు అందజేస్తామని, వ్యవసాయ యోగ్యమైన భూమికి పంట వేసిన వేయకుండా రైతు భరోసా అందుతుందన్నారు.భూమిలేని కూలీలకు స్వతంత్ర భారతదేశంలో ఎక్కడ లేని విధంగా రైతు కూలీల కుటుంబాలకు రూ12 వేలు ఇస్తున్నామని తెలిపారు. ఈ నాలుగు పథకాలను గ్రామసభలు నిర్వహించే ప్రజల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి జనవరి 26 నుంచి అమలు చేస్తామని, అర్హులైన చివరి వ్యక్తి వరకు లబ్ధి జరుగుతుందన్నారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి గ్రామ ప్రజలు తమ బిడ్డను ఎమ్మెల్యేగా గెలిపించాలని చేసిన కృషి ఫలితంగా తాను నేడు ఎమ్మెల్యే అయ్యానన్నారు. 43 వేల 100 ఎకరాలకు సాగు నీరు అందించే కలికోట సూరమ్మ ప్రాజెక్టును మొదటి ప్రాధాన్యతలో పెట్టామని, ఈ పనులను త్వరలో ప్రారంభం అయ్యేలా చూడాలని ఆయన మంత్రిని కోరారు. రుద్రంగి మండలం మానాలలో పాత చెరువు కొత్త చెరువుకు లిఫ్ట్ అందిస్తే త్రాగు,సాగు నీటికి ఇబ్బందులు ఉండవన్నారు. ప్యాకేజీ 9 లో మలక్ పేట్ రిజర్వాయర్లో నీళ్లు నింపామని, మరో 25 కోట్లు విడుదల చేస్తే అప్పర్ మానేరు కు నీళ్లు తీసుకుని వెళ్ళవచ్చన్నారు.ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేయాలని ప్రభుత్వ విప్ కోరారు. వేములవాడ, తిప్పాపూర్, కథలాపూర్ బస్టాండ్ ఆధునికరణకు నిధులు మంజూరు చేయాలని రవాణా శాఖ మంత్రిని కోరారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రుద్రంగి మండల కేంద్రంలో ప్రాథమికంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 103 , రైతు భరోసా క్రింద 1927,నూతన రేషన్ కార్డుల కోసం 802, ఇందిరమ్మ ఇండ్ల కోసం 1375 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. గతంలో సాంకేతిక కారణాల వల్ల వివరాలు, దరఖాస్తుల సమర్పించని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హత మేరకు పథకాలు అమలుకు చర్యలు చేపట్టామన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని, గ్రామ సభలలో ప్రతిపక్ష పార్టీ నాయకులు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని కోరారు.జనవరి 26 నుంచి ప్రారంభించి అర్హత ప్రకారం రేషన్ కార్డులను అందరికీ జారీ చేస్తామన్నారు. అనంతరం మంత్రులు కలికోట – సూరమ్మ ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేసి, ప్రాజెక్ట్ పరిధిలోని భూములకు సాగునీటిని ఇవ్వాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మిగిలిన ఇతర పనులకు అన్ని నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్,ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అష్టల్ బేగం,ఏడీ మైన్స్ క్రాంతి కుమార్,కో ఆపరేటివ్ చైర్మన్ మోహన్ రెడ్డి సంబంధిత అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

మాకూ కోటి బీమా సౌకర్యం కల్పించండి

(ప్రత్యేక ప్రతినిధి/జనంసాక్షి)

సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు ఏ తరహాలో నైతే కోటి రూపాయల ప్రమాద భీమా సౌకర్యంను కల్పిస్తున్నారో అదే తరహాలో మాజీ ఉద్యోగులకు కూడా కల్పించాలని మాజీ ఉద్యోగులు కోరుతున్నారు. వారి కుటుంబాలకు కూడా ఈ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. సింగరేణి మాజీ ఉద్యోగులు పొందుతున్న వారి కూడా అనుకోని పరిస్థితుల్లో ఆపదలకు ప్రమాదాలకు గురై మరణిస్తే వారి కుటుంబాలకు సైతం కూడా గతంలో వారి అందించిన సేవలను గమనంలోకి తీసుకొని మానవీయకోణంతో ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలని సింగరేణి ఆల్ పెన్షన్స్ దారుల అసోసియేషన్ సింగరేణి చైర్మన్ ఎన్.బలరాం కు వినయ పూర్వకంగా విజ్ఞప్తి చేస్తుందని పేర్కొన్నారు. సింగరేణిలో కొత్త కొత్త సంస్కరణలకు శ్రీకారం చుడుతూ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న మీరు మాజీ ఉద్యోగులకు సైతం ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడం ద్వారా బాధిత కుటుంబాలకు భరోసాగా నిలుస్తుందని వారు అన్నారు.అది వారు సింగరేణికి అందించిన గత సేవలకు గుర్తింపుగా ఆ కుటుంబాలను ఆదుకోవచ్చని సింగరేణి ఆల్ పెన్షన్స్ దారుల అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, సింగరేణి చైర్మన్ ను వారు కోరారు.

అన్నదాతల ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీ భేటీ

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో సమావేశమైన నేతలు

వనపర్తి, జనవరి 22 (జనంసాక్షి): రాష్ట్రంలో తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం, ఆందోళనకర స్థాయిలో పెరిగిన రైతు ఆత్మహత్యలపై ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ అధ్యయన కమిటీ తొలి సమావేశం బుధవారం జరిగింది. కమిటీ చైర్మన్, మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధ్యక్షతన రాజధానిలో గల మంచి రేవులలోని ఆయన నివాసంలో ఈ సమావేశం జరగగా బీఆర్ఎస్ ముఖ్య అతిథిగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. కమిటీ సభ్యులైన మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్ కుమార్, జోగు రామన్న, బాజిరెడ్డి గోవర్ధన్, అంజయ్య యాదవ్, రసమయి బాలకిషన్, యాదవ రెడ్డి తదితరులతో కలిసి కేటీఆర్ చర్చించారు. రైతు ఆత్మహత్యలు, రైతు భరోసా మోసం, రైతు రుణమాఫీ పేరిట కాంగ్రెస్ చేసిన దగా, సాగునీటి కష్టాలు, రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ మాకొద్దు!

- నేటి నుండి వరుస ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు
- ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్

రాజోలి, జనవరి 22 (జనంసాక్షి) : పెద్ద ధన్వాడ సమీపంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజారోగ్యం తోపాటు పర్యావర ణానికి ముప్పు పొంచి ఉందని..పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు నేటి నుండి ఆందోళనబాట పట్టిన రైతులు, సమీప గ్రామ ప్రజలు ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు. నేడు ఇథనాల్ ఫ్యాక్టరీ సమీపంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలు, యువకులు, మహిళలు, పెద్దలు పాల్గొని విజయవంతం చేయాలనీ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

అలెగ్జాండ్రిన్ చిలుకలను అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) : నగరంలోని పాతబస్తీలో మహ్మద్ ఫారూఖ్ అనే వ్యక్తి ఏకంగా 110 అలెగ్జాండ్రిన్ చిలుకలను అమ్ముతూ పట్టుబడ్డాడు. ఇప్పుడు ఉన్న వాతావరణ పరిస్థితుల్లో ఈ చిలుకలు చాలావరకు తగ్గిపోయాయి. అరుదుగా కనపడుతుంటాయి. ఇక హైదరాబాద్ వంటి నగరాల్లో అయితే కొన్ని ప్రాంతాల్లో తప్ప ఆసలు కనపడడం లేదు. ఈ క్రమంలోనే పాతబస్తీలో మహ్మద్ ఫారూఖ్ అనే వ్యక్తి ఏకంగా 110 అలెగ్జాండ్రిన్ చిలుకలను అమ్మడం తీవ్ర కలకలం రేపింది. సమాచారం తెలుసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు ఫారూఖ్ ని పట్టుకొని అటవీ అధికారులకు అప్పగించారు. అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న 110 అలెగ్జాండ్రిన్ చిలుకలను అటవీ అధికారులు జూపార్కుకు తరలించారు. ఈ ఘటనపై తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్) ఆర్ఎం డోబ్రియల్ మాట్లాడుతూ.. అలెగ్జాండ్రిన్ చిలుకలను అక్రమంగా అమ్ముతున్న మహ్మద్ ఫారూఖ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు. వన్యప్రాణి చట్టం ప్రకారం చిలుకలను వేటాడటం నేరం అని హెచ్చరించారు.

అమరచింత హెల్త్ సబ్ సెంటర్ అప్ గ్రేడ్

- జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ

వనపర్తి బ్యూరో, జనవరి22 (జనంసాక్షి) : ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అమర్చింత హెల్త్ సబ్ సెంటర్ ను అప్గ్రేడ్ చేసి అన్ని వసతులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. బుధవారం మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా పర్యటన సందర్భంగా సాయంత్రం వనపర్తి జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని అమర్చింత మండలంలో పర్యటించి దేశాయి మురళీధర్ రెడ్డి స్మారకార్థం వారి కుమారుడు ప్రకాష్ రెడ్డి నిర్మించిన భవనంలో నడుస్తున్న హెల్త్ సబ్ సెంటర్ ను జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక శాసన సభ్యులు వాకిటి శ్రీహరి, దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి తో కలిసి పరిశీలించారు.ఆసుపత్రి గదులను పరిశీలించిన మంత్రి భవనాన్ని నిర్మించి ఇచ్చిన ప్రకాష్ రెడ్డిని కొనియాడారు. తన పుట్టిన నేల కోసం ఏదో ఒకటి చేయాలి, పుట్టిన ఊరు రుణం తీర్చిలుకోవాలి అనే సంకల్పంతో చక్కని భవనాన్ని నిర్మించి ప్రభుత్వ వైద్యశాలకు ఇచ్చినందుకు ప్రకాశ్ రెడ్డిని మంత్రి కొనియాడారు. స్థానిక శాసనసభ్యులు వాకిటి శ్రీహరి కోరిక మేరకు, మండల ప్రజలు ఎన్నో రోజులుగా మండలంలో మెరుగైన వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలి అనే కోరికను ఈ సందర్భంగా మంత్రి తీర్చారు. ఇక్కడి సబ్ సెంటరును. వేరే ప్రాంతానికి బదిలీ చేసి ఇదే భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నడిపేందుకు ఉత్తర్వులు జారి చేస్తానని హామి ఇచ్చారు. అనంతరం టి.బి. రోగులకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు.అనంతరం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రూ . 3.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఉచిత 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు.ఆత్మకూరు లో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి పి.జే.పి కార్యాలయం ఆవరణలో స్థల పరిశీలన చేశారు.జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకోబోం

- 60 లక్షలు మంది సైనికులున్న పార్టీ బీఆర్ఎస్
- కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి కాంగ్రెస్‌ది : కల్వకుంట్ల కవిత

నల్లగొండ, జనవరి 22 (జనంసాక్షి) : బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత.. 60 లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం తమ బీఆర్ఎస్ పార్టీ అని, తమ పార్టీ కార్యాలయాలపై, ఇళ్లపై దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి కూడా ఉండదని హెచ్చరించారు. ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులారా.. జాగ్రత్తగా ఉండండి, ఇంకోసారి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరు అంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. రౌడీ మూకలతో ఇతరుల పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి తమది కాదని చెప్పారు. మూసీ మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు ఇప్పటికైనా గుర్తించాలని కవిత చెప్పారు. రాష్ట్రాన్ని 60ఏళ్లు పాలించిన పారిశ్రామిక వ్యర్థాలు మూసీలో కలుస్తుంటే కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. హైదరాబాద్ కు దగ్గర్లో ఉన్న కొండపోచమ్మ సాగర్ ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసీ – గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదన్నారు. మూసీని కాంగ్రెస్ నాయకులు ఏటీఎంగా మార్చుకోవాలని చూస్తున్నారని కవిత ఆరోపించారు. కాంట్రాక్టర్ల కోసమే ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోందన్నారు. అందులో భాగంగానే అనుసంధాన ప్రాజెక్టు వ్యయాన్ని రూ.7,500 కోట్లకు పెంచారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. కొండపోచమ్మ నుంచి మూసీ అనుసంధానం చేసే ఆస్కారం ఉన్నప్పటికీ ఈ కొత్త ప్రాజెక్టు ఎందుకని అడిగారు. ఈ విషయంపై నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీలో మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్న కవిత.. మూసీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అప్పట్లోనే ప్రణాళికలు రూపొందించారని గుర్తు చేసుకున్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలపైకి ఇళ్లపైకి బుల్డోజర్లను పంపి, కూల్చివేస్తోందని కవిత ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకు అయ్యే వ్యయాన్ని మొదట్లో రూ.50 వేల కోట్లు అని, ఆ తర్వాత రూ. 1లక్ష కోట్లు, మరోసారి లక్షన్నర కోట్లు అని సీఎం చెబుతూ.. మూసీని ఏటీఎంగా మార్చుకొని ఆ డబ్బును ఢిల్లీకి పంపించే ప్రణాళిక చేస్తున్నారని చెప్పారు. మరోపక్క యాదాద్రిలో కేసీఆర్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలన్న కవిత.. యాదాద్రి వైభవాన్ని ప్రభుత్వం కాపాడాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని, అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేశారని చెప్పారు. ఫ్లోరైడ్ ని నిర్మూలించిన ఘనత కేసీఆర్ దేనని, ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క వాటర్ ప్లాంట్ పెట్టిన పాపాన కూడా పోలేదని ఆరోపించారు.

ఎనిమిదేళ్ల వయస్సు నుంచే ప్రకృతి అంటే ఆసక్తి

- 70 ఎకరాల్లో అడవి సృష్టించి.. జీవరాశులకు ఆవాసం..
- గవర్నర్ ప్రతిభా పురస్కారానికి ఎంపికైన దుశ్చర్ల సత్యనారాయణ

సూర్యపేట, జనవరి 22 (జనంసాక్షి) : సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవపురానికి చెందిన దుశ్చర్ల సత్యనారాయణకు ఎనిమిదేళ్ల వయస్సు నుంచే ప్రకృతి అంటే ఆసక్తి. బ్యాంక్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన దుశ్చర్ల సత్యనారాయణ.. ప్రకృతిపై ఉన్న ప్రేమతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. నల్లగొండ జిల్లాను పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యపై జల సాధన పేరుతో ఉద్యమించిన దుశ్చర్ల సత్యనారాయణ.. వారసత్వంగా తనకు వచ్చిన 70 ఎకరాల భూమిని ఆరు దశాబ్దాలు శ్రమించి అడవిని సృష్టించాడు. మూగ జీవాలకు ఆవాసంగా.. జీవరాశులకు ఆహారం, నీళ్లు అందించేలా అడవిగా మార్చాడు. ఐదెకరాల్లో పక్షులు, జంతువులకు ఉపయోగపడే పంటలను సాగుచేశారు. భూగర్భ జలాల పెంపు, జంతువులు, పక్షుల తాగునీటికి 7 ప్రాంతాల్లో కుంటలు తవ్వించారు. కొన్ని చోట్ల బోర్లు వేయించారు. అడవిల్లో మాదిరిగా ఉండే పలు రకాల పక్షులు, జంతువులకు ఆవాసంగా ఈ అడవిని మార్చి జీవ వైవిధ్యానికి జీవం పోస్తూ పర్యావరణ వేత్తగా అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ప్రకృతిని కాపాడుతూ 70 ఎకరాల్లో అడవిని సృష్టించిన పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణకు అనేక అవార్డులు వరించాయి. ఢిల్లీలోని ప్రతిష్టాత్మకమైన ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్‌లో నాలుగో నది ఉత్సవంలో పర్యావరణవేత్త దుశర్ల సత్యనారాయణపై "ఇండియాస్ గ్రీన్‌హార్ట్ దుశర్ల సత్యనారాయణ" అనే డాక్యుమెంటరీ ప్రదర్శించారు. తాజాగా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆరుగురిని రాజ్‌భవన్ వర్గాలు ఎంపిక చేశాయి. వారిలో సత్యనారాయణ ఒకరు. ఈ నెల 26న రాజ్‌భవన్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవంలో దుశర్ల సత్యనారాయణకు తెలంగాణ గవర్నర్-2024 అవార్డ్స్ ఫర్ ఎక్స్‌లెన్స్‌తో పాటు రూ.2లక్షల నగదును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అందజేస్తారు. ఈ సందర్భంగా దుశ్చర్ల సత్య నారాయణ మాట్లాడుతూ ఈ అవార్డు ఎంపికతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

- అడ్డుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హల్ చల్ చేశారు. జీహెచ్ఎంసీ చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలను ఎమ్మెల్యే అడ్డుకున్నారు. చింతల్ బస్తీలో పలు నిర్మాణాలను అక్రమాలుగా జీహెచ్ఎంసీ గుర్తించింది. అయితే తనకు సమాచారం ఇవ్వకుండా ఎలా చర్యలు తీసుకుంటారని దానం మండిపడ్డారు. కూల్చివేతల ఆపకుంటే జేసీబీ ముందు కూర్చుంటానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌పై, టౌన్ ప్లానింగ్ అధికారులపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అయితే అధికార పార్టీ ఎమ్మెల్యే కూల్చివేతలను అడ్డుకోవడంతో దానం వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిఎం వచ్చే వరకు కూల్చివేతలు ఆపాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ వార్నింగ్ ఇచ్చారు. నోటీసులు లేకుండా ఎలా కూల్చివేతలు చేస్తారు. కూల్చివేతలు ఆపకపోతే లాండ్ ఆర్డర్ ప్రాబ్లం క్రియేట్ చేస్తా. ఎక్కడినుంచో బతకడానికి వచ్చి మమ్మల్ని బతకనివ్వరా? కూల్చివేతల ఆపకపోతే బండి ముందు కూర్చుంటా. నా వెంట వస్తే 100 అక్రమ కట్టడాలు చూపిస్తా.. ముందు అవి కూలకొట్టండి. సీఎం సిటీకి వచ్చిన తర్వాత మాట్లాడతా రెండు రోజులు కూల్చివేతలు ఆపండి' స్టాం÷–రగ్‌గా వార్నింగ్ ఇవ్వడం ఇప్పుడు సంచలనంగా మారింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370